Saturday, February 11, 2023
6:28 PM

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

*సంపాదకుడు :* డా॥ సామల రమేష్‌బాబు *9848016136*

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




జూలై 2018

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదకహృదయం : | జనాభా లెక్కల్లో తెలుగువారికి అన్యాయం.... | | 7 |
| తెలుగు జనాభా : | 2011మాతృభాషల.. | ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు | 8 |
| | పొరుగు రాష్ట్రాలలోని తెలుగువారు | స.వెం.రమేశ్ | 10 |
| కంప్యూటర్లు - తెలుగు : | తెలుగు భాషకు ఆధునిక హోదా - 6 | వీవెన్ | 12 |
| శ్రద్ధాంజలి : | నేరెళ్ళ వేణుమాధవ్ | అంపశయ్య నవీన్ | 14 |
| వారసత్వ సంపద : | పెద్ద బొంకూర్ శాతవాహన స్థావరం... | సంకేపల్లి నాగేంద్రశర్మ | 16 |
| మరణ వాంగ్మూలం : | గురువుకు తగిన శిష్యుడు... | డా॥వేదగిరి రాంబాబు | 19 |
| సాహిత్యరంగం : | పుస్తకము చేతన్ బూనితిన్.... | ఆచార్య మధురాంతకం నరేంద్ర | 24 |
| సాహితీ మూర్తి : | విజ్ఞాన సర్వస్వం... | ఆచార్య వెలమల సిమ్మన్న | 32 |
| స్పందన : | ... | | 34, 41 |
| పెద్దోరి తీపి గురుతులు : | దీక్షా దక్షతలు గల పనిరాక్షసుడు... | సన్నిధానం నరసింహశర్మ | 35 |
| నామ విజ్ఞానం : | వివాహిత స్త్రీల ఇంటిపేర్లు... | కీ.శే. యార్లగడ్డ బాలగంగాధరరావు | 38 |
| పిట్ట చూపు : | రాజకీయాధికారంతోనే... | చలసాని నరేంద్ర | 47 |
| పుస్తక సమీక్షలు : | | డా॥ ఎం.వి.శాస్త్రి | 49 |
| గ్రంథాలయం : | | | 50 |
| భాషోద్యమ కథానికలు : | | | |
| 1. సింధువులో బిందువులు ..... | | విహారి | 21 |
| 2. అమ్మమాట | | డా॥ వేదగిరి రాంబాబు | 36 |
| ధారావాహికలు : | | | |
| 1. మౌనంలోని మాటలు 9 : సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ | | ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు | 27 |
| 2. బౌద్ధం-వైజ్ఞానిక మార్గం -15 | ..... | బొర్రా గోవర్ధన్ | 42 |
| కవితలు : | | | |
| 1. పూలు సుగంధాలనే విరజిమ్మాలి | | డా॥కత్తి పద్మారావు | 26 |



రేఖా చిత్రాలు : **పావులూరి చిదంబరేశ్వరరావు**

కంప్యూటరీకరణ:**లంకె జనార్దన్**

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.


చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం. 58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (*క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్*) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.


సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

# తెలుగుజాతి (ట్రస్టు)

20 ఏళ్లపాటు తెలుగు ప్రజల అభ్యున్నతికి అంకితమై అందరి అభినందనలను పొందిన 'నడుస్తున్న చరిత్ర' మాసపత్రిక 2013 నవంబరు నుండి అనివార్య కారణాలవల్ల ఆగిపోయింది. ఆ పరిస్థితుల్లో - పత్రికను తిరిగి కొనసాగించాలనీ, దానితోపాటు తెలుగు భాషా వికాసం కోసం, భాషోద్యమ చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించడం కోసం సరికొత్త పుస్తకాలను వెలువరించాలనీ, ప్రచార సేవా కార్యక్రమాలను చేపట్టాలని సంకల్పించాము. అందుకొరకై - 2014లో 'తెలుగుజాతి' ట్రస్టు (92 / 2014) ను స్థాపించాము. దీనికి డా॥ సామల రమేష్‌బాబు వ్యవస్థాపక ట్రస్టీగా ఉన్నారు.

2015 మార్చి నుండి 'అమ్మనుడి' పేరుతో పత్రికను మొదలుపెట్టి ఏ ఆటంకమూ లేకుండా ప్రతినెలా వెలువరిస్తున్నాము.

దేశంలో తెలుగు రాష్ట్రాలలోని తెలుగువారికి సమంగా బయటి రాష్ట్రాల్లో అంతే సంఖ్యలో వున్న తెలుగువారి భాష, చరిత్ర, సంస్కృతులను పరిశోధించి, స.వెం.రమేశ్ వ్రాసిన విలువైన వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'** ను ప్రచురించాము.

భాషాశాస్త్రజ్ఞుడు, హైదరాబాదు విశ్వవిద్యాలయ ఆచార్యులు డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు పరిశోధనాత్మక రచనలు

**1.తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం. 2. ద్రావిడ - మంగోలు భాషల జన్య సంబంధం** పుస్తకాలను ప్రచురించాము.

మరికొన్ని విశిష్ట ప్రచురణలు త్వరలో రానున్నాయి.

## దాతలకు విన్నపం

**ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో నిర్వహించటానికి మీ అందరి చేయూత కావాలి. విరాళాలనిచ్చి తోడ్పడగోరుతున్నాము.**

| | | | |
|---|---|---|---|
| రాజ పోషకులు | రు.1,00,000/- | పోషకులు | రు.25,000/- |
| విశిష్ట పోషకులు | రు.50,000/- | ప్రోత్సాహకులు | రు.10,000/- |

- దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని **'అమ్మనుడి'** పత్రికలో ప్రచురిస్తాము.
- దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము.
- ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా వెనువెంటనే పంపిస్తాము.

సొమ్మును ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర **యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు**కు పంపాలి.

అక్కౌంట్ నెం. 914020020387880


I.F.S.C.Code : UTIB0000068.

లేదా- అదే బ్యాంకు పేర బ్యాంకు డ్రాఫ్టుగా పంపాలి. డ్రాఫ్టును పంపుటకు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా : డా॥ సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు),8-386, జీవక భవనం, **అంగలకుదురు** పోస్టు, **తెనాలి.** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244

**(3వ అట్టపై ఇటీవలి దాతల వివరాలు చూడండి)**

## తెలుగువారంతా చదువవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




**ఎల్లలు లేని తెలుగు**

వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**

వెల :రు. 100/-




**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**

వెల : రు.350/-

విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, సామాజిక కార్యకర్తలు రచయితలు, భాషోద్యమకారులు, ఆసక్తిగల వారంతా ఈ రచనలను చదివి ప్రయోజనం పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ. చేస్తే వాటిని కొరియర్ / రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.

**తెలుగుజాతి (ట్రస్టు)** - జీవక భవనం, 8-346, **అంగలకుదురు** పోస్టు **తెనాలి** - 522211ఫోన్ : 9440448244

జనవాణి

# తెలుగు సంవత్సరాలు

**మనం** ఇప్పుడు తెలుగునాట వాడుతున్న సం॥ల పేర్లు 60. ఇది ఒక చక్రము. ఈ 60 సం॥ల చక్రము ఎప్పటి నుండి వాడుకలో ఉంది? ముందు నుండి ఇదేనా? మరో చక్రమేదైనా వాడుకలో వుందా?

ఒకప్పుడు థాయ్‌లాండు, దిగువ బర్మా, లావోస్ ప్రాంతాలను తెలాంగ్ (తైలంగ్) జాతీయులు పాలించారు. వీరి ఆధునిక పేరు మూన్. వీరు మన ఆంధ్రతీర ప్రాంతము నుండి వెళ్లినట్లుగా వారి జోల పాటలలో వున్నాయి. ఇంతేకాక వారు తమ లిపిని తెలుగు - కన్నడ లిపిని ఆధారం చేసుకొని రూపొందించినట్లు చెప్పుకుంటారు.

బర్మా రాజుల చేతిలో ఓడిపోయిన తరువాత వారి భాష, సంస్కృతులు నాశనం చేయబడి రాజ్యాలను వదిలి అడవుల పాలయ్యారు. గత 50 సం॥లుగా వారు తిరిగి తమ చరిత్రను, భాష - సంస్కృతులను నిలుపుకోవడానికి పరిశోధనలు చేస్తూ, వాటికి గ్రంథరూపమిస్తున్నారు. అవి అన్నీ బర్మా భాషలో ఉన్నాయి.

అలాంటి ఒక పుస్తకంలో ఓ చోట మృగశిర సం॥ము, జ్యేష్ఠ సం॥ము అని కన్పించాయి.

థాయ్‌లాండులోని లాన్‌ఫూన్ (హరిపుంజయ) నగరంలోని బౌద్ధ దేవాలయములలో మూన్ భాషలో 7 రాతి శాసనాలు దొరికాయి. వాటి రాతలలో సం॥లను అంకెలలో కాకుండా పేర్లతో వ్రాయడం కన్పించింది. వుత్‌డూన్ దేవాలయంలో కన్పించిన సవ్వాది సిద్ధి (సర్వాది సిద్ధి) రాజుగారి దాన శాసనంలో ... రాజుగారి వయస్సు 26 సం॥లు నిండినప్పుడు (క్రీ.పూ 1219-1220) మార్గశిర సం॥ము, జ్యేష్ఠమాసం, శుక్లపక్షమి 5వ రోజు ఆదివారమనియు, రాజుగారి వయస్సు 32సం॥లు నిండి నప్పుడు...జ్యేష్ఠ సం॥ము, జ్యేష్ఠమాసం, బహుళ పక్షమి, 13వ రోజు, మంగళవారం...అని వుంది.

బర్మాదేశం, ప్యీ నగరం, శ్వేసండో రాతి శాసనంలో శకరాజ్ 455, మృగశిర సం॥ము, శ్రావణ మాసం, శుక్రవారం, ఉత్తర ఫల్గుణి నక్షత్ర, కన్యలగ్న మనియు, దిగువ బర్మా, తటోన్ నగరంలోని...చైటే శాసనంలో...శకరాజ్ 460, వైశాఖ సం॥ము, వౌశాఖ నెల, శుక్రవారం, హంస నక్షత్ర...అని వుంది.

పై అంశాలు గమనించినప్పుడు పూర్వం మన వాళ్ళు నెలల పేర్లతో 12 సం॥ల చక్రాన్ని వాడినట్లుగా తెలుస్తున్నది. ఈ విషయాన్ని పెద్దలు శివనాగిరెడ్డిగారు, జయధీర్ తిరుమలరావు గార్లతో ప్రస్తావించగా...అలాంటి శాసనాలు ఇక్కడ కన్పించలేదన్నారు. సం.వెం. రమేష్ గారు మటుకు రాష్ట్ర కూటుల పాలనా కాలంలో అలాంటి లెక్కింపు ఉండవచ్చునని అన్నారు.

– యర్రా (బర్మా) నాయుడు, విశాఖపట్నం
900582436

# భాషలేకపోతే సాహిత్యమన్నదే ఉండదు

**మంచి**పనికి మొదట్లో మనుషులు తక్కువే వుంటారు. మొక్కల్ని తొక్కినట్టు తొక్కేస్తారు కూడా. ఆ మొక్క ఎలాగో పెద్దదై నాలుగు కాయలు కాస్తుండేసరికి, నేను నీళ్లు పోశాను, కంప వేశాను, పశువుల్ని హెచ్చరించాను, అంటూ అందరూ వస్తారు. లోకంలో జరిగే సాధారణ విషయం యిది. అందరూ తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే (కొందరికి తెలిసి వుండవచ్చు), మానవుడు ఏ గడ్డమీద పుడితే, ఆ గడ్డమీద వేల సంవత్సరాలుగా వస్తున్న నాగరికతా సంస్కృతులకు, భాషలకు నిర్వివాద వారసుడిగా వుంటాడు. కుటుంబ విలువలు, చదువులు, మరియు భాషా సాహిత్యాలే అతడికి ఆ నాగరికతా వారసత్వాన్ని అందిస్తాయి. సొంతగడ్డ, సంస్కృతి అంటూ ఏదీ లేకుండా విశ్వమానవుడిగా అమాంతంగా ఎవడూ పుట్టెయ్యడు. నాగరికతను అందించే భాషా సాహిత్యాల్లో కూడా భాష అతి ముఖ్యమైనది. పిండి అంటూ వుంటేనే ఏ రొట్టె అయినా చేసుకోవచ్చు. జుత్తు అనేది వుంటేనే ఏ జడైనా వేసుకోవచ్చు. భాష అన్నది లేకపోతే సాహిత్యమన్నదే వుండదు.

భాష అన్నది లేకపోతే, ఎవరు నువ్వు, ఏమిటీ నీ చరిత్ర? అంటే చెప్పుకోవడానికి ఏమీ లేక, తెలియక ఆత్మన్యూనతకి గురి కావలసి వస్తుంది. ఏ యితర భాషలో చదివినా, బ్రతికినా వాళ్ల వారసత్వాలు మనవిగా వుండవు. వాళ్ళ వారసత్వమే మనది అంటే తంతారు కూడా.

భాషనీ, సంస్కృతినీ పోగొట్టుకోవడం వల్ల, ఆధిక్యభాషల వాళ్ళక్రింద, మన ఉనికినీ, అస్థిత్వాన్నీ, తుదకు ఆత్మ గౌరవాన్నీ కూడా తాకట్టు పెట్టుకుని బ్రతకాల్సి వస్తుంది. ఇంగ్లీషు చదివితే వచ్చే ఉద్యోగాలన్నీ వాళ్ళ ప్రయోజనాలు కాపాడే బానిస ఉద్యోగాలే తప్పితే, దేశాన్ని బాగుచేసే వుద్యోగాలు కావన్నది అందరూ గుర్తుపెట్టుకోవాలి. ఏ విషమ పరిస్థితో, యుద్ధ పరిస్థితో వస్తే లక్షలాది వుద్యోగాలు పోయి యువతరం వీధిన పడుతుంది. మేధావులు యిప్పుడిప్పుడే అది గుర్తిస్తున్నారు. ఇవన్నీ మన భాష, మన చరిత్ర, మన సాహిత్యం... వీటిని పోగొట్టుకున్నదాని పర్యవసానాలే.

భాష అంటే అది కేవలం మాట్లాడుకునే పదాల సమూహం కాదు. భాష అంటే అది మన అస్థిత్వం. మన ఉనికి. మన ఆత్మగౌరవం. భాషని పోగొట్టుకోవడం అంటే, మన అస్థిత్వాన్నీ, ఆత్మ గౌరవాన్నీ తాకట్టుపెట్టుకుని, "నేను బాంచెన్ నీ కాళ్లకు మొక్త అనడమే. మనకున్న మానవ హక్కులన్నీ కాలరాచి వేసుకోవడమే. మనకు ఆత్మ, ప్రాణంలాంటి భాషని కాపాడుకోలేకపోతే, మనం గుర్రాలకూ గాడిదలకీ పుట్టిన శెంకుముత్తి గుర్రాల్లాగా తయారై, పాశ్చాత్య పేకేజీ చెత్తని మోసుకు తిరిగే బానిసలమై పోతాం. ఆత్మ గౌరవంతో బ్రతుకుదాం అంటున్న అమ్మనుడి ఛత్రం క్రిందికి అందరూ రావాలని ఆశ, ప్రార్థన.

– డి.నటరాజ్, విశాఖపట్టణం
9440428597

సంపుటి : 4 సంచిక : 5
**అమ్మనుడి**
జూలై 2018

సంపాదక హృదయం

# జనాభా లెక్కల్లో తెలుగువారికి అన్యాయం

**ఈ** సంచిక ముఖచిత్రాన్ని చూసి 'నడుస్తున్న చరిత్ర','అమ్మనుడి' పత్రికల పాఠకులు కొద్దిగా నివ్వెర పోవచ్చు. ఎందుకంటే ఇదే ముఖచిత్రాన్ని 'అమ్మనుడి' తొలిసంచిక (మార్చి 2015) పైనా, 'నడుస్తున్న చరిత్ర'లోనూ చదువరులు చూసిందే. ఐనా దాన్ని ఇప్పుడు మళ్లీ ముద్రించాల్సిన అక్కర వచ్చింది. కారణం - 2011లో భారత ప్రభుత్వం సేకరించి, ఏడేళ్ల తర్వాత ఇప్పుడు వెల్లడి చేసిన మాతృభాషల జనాభా లెక్కల వివరాలే.

తెలుగునుడి పటాన్ని పరిశీలించండి. దక్షిణ భారతదేశమంతటా ఎక్కువ ప్రాంతంలో చిక్కగా, చాలా ప్రాంతాల్లో పలుచగా పరచుకొని వున్న తెలుగువారి విస్తృతిని గమనించండి. అందులోంచి నేటి ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలను గుర్తు పట్టగా - తక్కిన భాగంలో ఎంతగా మనవాళ్ళున్నారో నిశితంగా పరిశీలించండి.

వాళ్లు ఇప్పుడు మాతృభాషకు దూరమై వివక్షకూ, అలక్ష్యానికీ, ఉదాసీనతకూ గురవుతూ జీవిస్తున్నవాళ్లు. ఒక విధంగా - పరాయీకరించబడుతున్న వాళ్ళు. స్వాభిమానాన్ని చంపుకొనో, అణచుకొనో బ్రతుకుతున్నవాళ్ళు. ఈ పరిస్థితి ముఖ్యంగా భాషా రాష్ట్రాల పేరుతో జరిగిన విభజన వల్ల వచ్చిందనే ఆరోపణ నెంతవరకు ఒప్పుకోవచ్చునన్నది చర్చనీయాంశమే అయినా, కారణాలేవైనా - పరిణామాల ఫలితాన్ని వాళ్ళనుభవిస్తున్నారు. చివరకు - తమ మాతృభాష 'తెలుగు' అనే గుర్తింపుకు కూడా దూరమైనారు. మాతృభాషాపరంగా వారి పరాయీకరణ ఈ 50-60 ఏళ్లలో వేగంగా జరిగింది. ఇటు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు - పరిపాలన, విద్యారంగాల్లో ఇంగ్లీషుకు దాసోహ మనడంతో - ఘన చరిత్ర, ఎంతోశక్తి కలిగిన మన భాషా సంస్కృతులు ఇక్కడ పరాయీకరించబడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల బయట వున్నవారు స్థానిక భాషల ప్రభావంలో మునిగి తేలుతుంటే, తెలుగు రాష్ట్రాలు పూర్తిగా ఆంగ్లీకరణ మోజులో ఆత్మహత్యా సదృశంగా వ్యవహరిస్తున్నాయి.

భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు మౌలిక ఉద్దేశం మంచిదే అయినా దాన్ని అమలు చేసిన తీరు, అందువల్ల దక్షిణ భారతదేశంలో ఏర్పడిన సామాజిక, రాజకీయ ఒడిదుడుకులూ, చారిత్రక అన్యాయాలూ - తెలుగు భాషనూ, తెలుగు ప్రజలనూ కోలుకోలేని దెబ్బ కొట్టాయి. ఇందుకు కారణం - తెలుగువారికి తొలినుండీ సరైన సామాజిక, రాజకీయ నాయకత్వం లేకపోవడం. ఏనాడూ భాషా సాంస్కృతిక స్పృహగాని, చైతన్యంగాని లేని నేతలే ఆంధ్రప్రదేశ్ పాలిట దాపురించారు. అనేక సామాజిక చారిత్రక కారణాలవల్ల తెలుగువారిలో జాతి భావన ఏర్పడలేదు. సమైక్య జీవనానికి మారుగా - కుల భావనలు, స్వార్థం శృతిమించాయి. భాషా రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత - మన ప్రాణావసరమైన మాతృభాషను ఆధారంగా చేసుకొని ఒక భాషాజాతిగా ఎదగాలనే ఇంగిత జ్ఞానం లేకపోయింది. బయటి రాష్ట్రాల్లో మిగిలిపోయిన తెలుగువారికి అండదండలనందించాలనే ఆలోచనే నాటికీ నేటికీ మృగ్యమైంది.

తెలుగును 1 నుండి 10 వ తరగతి వరకు పాఠశాలలో కేవలం ఒక సబ్జెక్టుగా మాత్రమే నేర్పుతామని రెండు తెలుగు రాష్ట్రాల నేతలూ ప్రకటించేశారు. కేజీ నుండి పీజీ వరకు ఇంగ్లీష్ మాధ్యమమే మనకు దిక్కూ దారీ అని రెండు ప్రభుత్వాలూ నిర్ణయించేశాయి. అంటే - 'నేను తెలుగు వాణ్ణి, నా భాష తెలుగు అని గర్వంగా చెప్పుకోవడానికి సిగ్గుపడాలి' అని మన భావితరాలకు నేర్పుతున్నామన్నమాట. ఉపయోగించే కొద్దీ వికసించడం ఏ భాషకైనా స్వభావ లక్షణమనీ, ఎంతో సాహిత్యం, చరిత్ర కలిగిన తెలుగు అత్యంత ఆధునిక భాషగా అన్ని అవసరాలకూ పనికొస్తుందనీ ఒక పక్కన విజ్ఞులు ఘోషిస్తున్నా, పెడచెవిన పెడుతున్న మన ప్రభుత్వ నేతలు - జనాభా లెక్కల్లో తెలుగుజాతికి అన్యాయం జరుగుతున్న తీరును ఎందుకు పట్టించుకొంటారు?!

(8 - 11 పుటలలోని రెండు వ్యాసాలను తప్పక చదువండి)

సామల రమేష్ బాబు

తేదీ : 30-6-2018

తెలుగు జనాభా

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

## 2011 మాతృభాషల జనాభాలెక్కలు

# తెలుగు నిలదొక్కుకొనేదెలా....

**2011** వ సంవత్సరంలో సేకరించిన భాషలకు సంబంధించిన జనాభా లెక్కలు చివరకు ఇంకా ఈ దశాబ్దం గడవడానికి ఏడాదిన్నర ఉందనంగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ భారత జనాభా లెక్కల సంస్థవారువిడుదలచేశారు. కింద చూపిన పట్టిక (సేకర్త, కొలిచాల సురేశ్, తెలుగు భాషా వేదిక, తెలుగుబలగంలోకి ఎగుమతి చేసినది) . ఈ పట్టికలో చూపిన కొన్ని భారత భాషల లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఎంత శాతం మంది ఏ భాషను మాట్లాడుతున్నారో1971 నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కలలో తేలిన గణాంకాల సారాంశం ఉంది. ఇందులో హిందీ తప్పించి అన్ని భాషలూ కొద్దోగొప్పో తరుగుతున్నా హిందీ బాగా పుంజు కొంటోంది.  తెలుగూ మలయాళ భాషల జనాభా బాగా తగ్గుతోంది. అని తెలుస్తోంది. ద్రావిడ భాషల జనాభా తగ్గుముఖం పట్టాయి అని కూడా చెబుతోంది. దీనికి రెండుమూడు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి -ప్రతి దశాబ్దపు జనాభా సేకరణలోనూ మాతృభాషల సంఖ్య ఒకటి తగ్గిపోతోంది అని తెలుస్తోంది. అంటే 10వేలకంటే తక్కువ మాట్లాడే జనాభా ఉన్న భాషలనూ మరికొన్ని చిన్నా పెద్దా భాషలను ఆయా భాషా సమూహాలకిందజమకట్టేయడం జరుగుతోంది. ఉదాహరణకు షుమారు 40కి పైగా భాషలు (రాజస్థానీ, ఛత్తీస్గఢీ, భోజపురి, పహాడీ, మైథిలీ, మగధీ లాంటివెన్నింటినో హిందీ కింద జమవేయటం. అంటే హిందీ ఒక పెద్ద భాషా సమూహానికి మారు పేరుగా మారిపోయింది. అట్లాగే ఆయా రాష్ట్రాలలో మాట్లాడే జన్యుసంబంధం కలిగిన మరికొన్ని అల్పసంఖ్యాక భాషలను ఆయా రాష్ట్రభాషలలో కలిపి లెక్క చూపించడం జరిగింది. ఇంకొక కారణం – దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు చాలా తక్కువగా నమోదు కావడం కావొచ్చు. ఉత్తరాది రాష్ట్రాల జనాభా పెరుగుదల సాధారణ జాతీయ సగటుకంటే ఎంతో ఎక్కువ. మూడవది – మన దేశ రాజ్యాంగంలో చెప్పినట్లుగా ఆయా రాష్ట్రాలలో ఉన్న మైనారిటీ లేక అల్పసంఖ్యాక భాషల రక్షణ హక్కులను పట్టించుకోకపోవడం. ఈ భాషా హక్కుల హరణం తెలుగుపై  కోలుకోలేనివిధంగా దెబ్బతీస్తోంది. ఉదాహరణకు తమిళనాడులో 1971 వరకు వందలాది తెలుగు బడులు ఉండేవి అవి మెల్లమెల్లగా పూర్తిగా మూసివేతకు గురయ్యాయి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కేజీ టూ పీజీ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టడంలాంటి చర్యలు మరే రాష్ట్రంలోనూ కనబడవు. తెలుగు రాష్ట్రాలలోనేతెలుగుకు సరైన గుర్తింపు లేనపుడు ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువారు ఇంకా తెలుగును నిలుపుకునే ప్రయత్నం ఎలా చేయగలం?!

| క్ర.సం. | ఏడాది / భాష | హిందీ% | తెలుగు% | బంగ్లా% | మరాఠీ% | తమిళం% | కన్నడ% | మలయాళం% |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | 1971 | 36.99 | 8.16 | 8.16 | 7.62 | 6.88 | 3.96 | 4.00 |
| 2. | 1981 | 38.74 | 7.61 | 7.71 | 7.43 | 6.50 | 3.86 | 3.86 |
| 3. | 1991 | 39.29 | 7.87 | 8.30 | 7.45 | 6.32 | 3.91 | 3.62 |
| 4. | 2001 | 41.03 | 7.19 | 8.11 | 6.99 | 5.91 | 3.69 | 3.21 |
| 5. | 2011 | 43.63 | 6.70 | 8.03 | 6.86 | 5.70 | 3.61 | 2.88 |

తెలుగు నిలదొక్కుకొనేందుకు ఇది చివరి అవకాశమే. నిజమే. లేకపోతే తెలుగు కనుమరుగు అవటం కూడా ఖాయం. ఇదీ నిజమే. అయితే ఈ సందర్భంలో తెలుగువాళ్లు ఉన్నంతకాలం తెలుగు ఉండాలనుకొనేవాళ్లు ఏం చేయాలి అన్న దానిమీద సరైన అవగాహన ఉండాలని నా అభిప్రాయం.ఆయితే తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కేజీ టూ పీజీ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఎంతో మంది తెలుగువాళ్లు తమ బాధను దిగమింగుకొని ముక్కున వేలేసుకొని నిస్సహాయంగా చూస్తుండగా, కొంతమంది తమగోడునూ, వ్యథనూ, వేదననూ, ఆవేదననూ ఆక్రందనాలనూ అభిప్రాయాలను అనేక రూపాలలో  అంతర్జాలంలోనూ, సామాజిక జాలికావలయాలైన ట్విటర్‌ల, ఫేస్‌బుక్‌లోనూ వివిధ పత్రికలలో వ్యాసాల రూపంలోనూ బయట పెట్టుకుంటున్నారు. ఇందులో కొంతమంది తెలుగు వర్ణమాల లోని అక్షరాలను పెంచాలనో తగ్గించాలనో, సరిచేయాలనో సూచిస్తుండగా, మరికొందరు తెలుగు పారిభాషిక పదాల రూపకల్పనకు సూచనలను చేస్తున్నారు. ఇంకా మరికొందరు తెలుగుపదాలలోని సంస్కృత, ఆంగ్ల పదాలను ఏరివేయాలనీ వాటి వాడకాన్ని నియంత్రించాలనీ సంస్కృత ఆంగ్ల ప్రభావాలను ఎటువంటివాటినైనాసరే సుతరామూ ఒప్పుకోగూడదనీ పట్టు బట్టుతున్నారు. ఇకనైతే కొందరు ఏ మాండలికం

వాడాలో చెబుతూ ప్రామాణికతకు దారులు తెరుస్తున్నారు. ఇంకెంతో మంది ఇప్పటికిప్పుడు పెద్దపెద్ద నిఘంటువులను తయారుచేయాలని సూచిస్తుండగా ఇంకొందరు ప్రపంచంలో వస్తున్న ఆధునిక విజ్ఞానాన్ని అంతటినీ వెంటనే అనువాద రూపంలో తెలుగులోకి తీసుకురావాలని అభిప్రాయ పడుతున్నారు. ఇలా ఎంతోమంది తెలుగుభాష మనుగడకూ, తమ భాషను బతికించుకో వాలనేతాపత్రయపడుతున్నారు. ఇలా అనేక రూపాలలో తెలుగు మాధ్యమం కోసం పుంఖానుపుంఖాలుగా వ్యాసాలను ప్రకటిస్తున్నారు.

కొంతమంది తెలుగు మడిగట్టుకు కూచోవాలంటారు. ఇంకొందరు ఇదంతా వదిలి ఆధునిక యుగం కోసం తెలుగునే వదలాలి అంటారు. ఈ రెండూ మోతాదును మించిన అతి పోకడలే. ఈ రెండూ కాక మూడో దారి ఉందని గుర్తించాలి. ఇక్కడ అవసరం ఏమిటో గుర్తించాలి. ఆధునిక యుగం జ్ఞానయుగం. జ్ఞాన సంపదను నియంత్రించగలగాలి. తేలికగా, విరివిగా వాడుకోగలగాలి. కోట్లాదిగా ఉన్న తెలుగువాళ్లు వేరేభాషకు మారడంకంటే ఆయా భాషలలో ఉన్న జ్ఞానసంపదను తెలుగులోకి తెచ్చు కోవడమే సులభం. ఈ ప్రక్రియ సులభంగా నెరవేరాలంటే కొత్త భావనలకు కొత్త పదాలను ఇతర భాషలనుండి స్వీకరించటంతప్పుకాదు. కాకపోతే ఉన్న పదాలు వాడకుండా అనవసరంగా అరువుపదాలు వాడటం అర్థంలేని పనే. తెలుగులో వాడుతున్న సరీసృపం, కసేరుకం, పత్రహరితం త్రికోణమితి, అతిపరావలయ ప్రమేయాలు, కల్పితాక్షం, రసాయన చికిత్స, మొదలైన వాటికి వరుసగా ఇంగ్లీషులో సమానార్థకాలైన రెప్టైల్ 'reptile', వర్టిబ్రేట్'vertebrate', క్లోరోఫిల్'chlorophyll', ట్రిగ్నోమెట్రీ 'trigonometry', హైపర్‌బోలిక్ ఫంక్షన్స్ 'hyperbolic functions', ఇమాజినరీ యాక్సెస్ 'imaginary axis, కీమోథెరపీ 'chemotherapy', మొదలైనవిమౌలికంగా ఇంగ్లీషు పదాలు కావు. ఇవన్నీ లాటిను, గ్రీకు మొదలైన భాషలనుండి అరువు తెచ్చుకున్నవే. ఈ ప్రక్రియ ఇంగ్లీషు భాషను సుసంపన్నం చేసిన ప్రక్రియేగదా. ఇంగ్లీషుకు గ్రీకు, లాటిను లాంటివే తెలుగుకు సంస్కృత ప్రాకృతాలు. ఇలా తయారైన తెలుగును ఈసడించుకోవాల్సిన అవసరం లేదు. పారిభాషిక పదాలు ఉన్న తెలుగు సాధారణ విషయాలలో వాడే తెలుగు కాదు. ఇది ప్రత్యేక సందర్భాలలో వాడే తెలుగు. సందర్భాన్ని బట్టీ, వ్యాసంగాన్ని బట్టీ, వృత్తినిబట్టీ మనం వాడే తెలుగులో తేడాలు ఉండొచ్చు. ఇవిగాక ప్రాంతీయ మాండలిక భేదాలు ఎలాగూ ఉండనే ఉన్నాయి. అన్ని తెలుగులూ ఉండాలి. ఇందులో ఏ తెలుగూ మరో తెలుగుకంటే మంచిదనిగానీచెడుదనిగానీ, చిన్నా పెద్దా తేడాలు కానీ, గొప్పా పేదా భావాలకు గానీ తావులేదు. ప్రామాణిక భాష అనే భావనకేతావు లేదు నేడు. రాష్ట్ర విభజననుండి నేర్చుకోవలసినమొదటిపాఠం ఇదే.

వీరందరినీ కోట్లాది తెలుగువాళ్లకు ప్రతినిధులుగా, ఇట్లా రాయగల గడంచేతనైనవారిగా – తమ గోడు వినిపిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకొని సమస్య పరిష్కారానికి ఎలాంటి చొరవనుగానీ ఉద్దేశ్యాన్ని గానీ ప్రకటించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగును విద్యామాధ్యమ భాషగా తొలగించి ఆంగ్లాన్ని ప్రవేశపెట్టేందుకు అన్యాయమూ అక్రమమూ, కుతర్కంతో నిర్హేతుకమైన నిర్ణయాన్ని ప్రకటించిన సందర్భంలో ప్రజల తరపున వెలువడిన స్పందనలను పట్టించుకొని ఇది ఒక సమస్య అని గుర్తించడానికి తిరస్కరించింది. దానిపై ఒక విస్తృత అధ్యయనం కోసం విద్యావేత్తలతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలనిగానీ తెలుగు సమాజంలో పేరుపొందిన విజ్ఞులతో ఒక పౌర సంఘాన్ని ఏర్పాటుచేయాలనిగానీ ఇంకా ముందు చూపుతో విజ్ఞతతో రాజకీయ పార్టీల ప్రతినిధులను సమావేశపరిచి చర్చించి భాషాసమస్యను పరిష్కరిద్దామనిగానీ తలపెట్టలేదు. ఈ ప్రభుత్వాలు ప్రజలు ఎన్నుకొన్న ప్రజా ప్రభుత్వాలు అనిపించుకోవు.

భాషలు తమ వికాస పరంపరలో, సందర్భాన్ని బట్టీ తాను ఎదుర్కొంటున్న కొత్త భావనలకు కొత్త పదాలను ఉనికిలోకి తెస్తాయి లేక సృష్టించుకొంటాయి. ఈ ప్రక్రియ, ఇప్పటికే ఉన్న వనరుల (పదాల) నుంచి గానీ ఇతర భాషలనుంచి తెచ్చుకున్న వనరులనుంచి గానీ కావచ్చు. రోజురోజుకూ అపరిమితంగా సృష్టింపబడుతున్న జ్ఞాన సంపదను ఒడిసిపట్టడానికి సొంత వనరులు చాలవు. ఇతరుల వనరులు వద్దని సొంత వనరులే ఎక్కువగా వాడితే పదాల నిడివి (పొడుగు) పెరిగి చాంతాడంత అవటం మామూలే. మనం తమిళం, జర్మను భాషలలో చూసేది ఇదే. కొత్త పదాలన్నీ సాధారణంగా చాలా పొడవుగా అలవిగానివిగా తయారవుతాయి. పైపెచ్చు, పదాల అర్థ భారం పెరుగుతుంది. సొంత వనరులనుంచి ఏర్పడే పదాలు అనేక సందర్భాలలో అనేకార్థాలతో నేర్చుకొనేందుకు కష్టంగా కూడా ఉండవచ్చు. అదే అరువు తెచ్చుకున్న పదాలు కొత్త భావనలకు వాడినప్పుడు పదాల నిడివిలోనూ, అర్థంలోనూ పొందిక, జిగిబిగి కనిపిస్తుంది. ఇంగ్లీషూ, తెలుగూ అరువుపదాలతో సుసంపన్నమైన పదసృష్టి గావించే భాషలు. ఇక్కడ వనరులకు కొదవ ఉండదు. అర్థ సంకోచ వ్యాకోచాలకు అసలు తావు లేదు.

మీరు ఏ తెలుగైనా వాడండి. తెలుగు ఉండాలిగానీ ఏ తెలుగు ఉండాలి అనిగాదు. ఇదే మన ఆరాటం. అందరినీ కలుపుకు పోవలసిన సమయం ఇది. ముందు తెలుగు అంటూ ఉంటే అవసరాన్ని బట్టీ ముందుముందు అది ఒక ఉమ్మడి తెలుగుగా ఎదగవచ్చు. అలా కాకుండా ఇప్పటినుంచే అచ్చతెలుగా, మచ్చతెలుగా అనే ప్రశ్నలు వద్దు. అందరికీ కావలసింది తెలుగు. దానికోసమే అందరం నడుం కట్టాలి. అందరికీ తెలుగు ఎందుకో అవగాహన కలిగించాలి. కార్పొరేట్, ప్రైవేటు, ప్రభుత్వ బడులు అనే తేడాలేకుండామాతృభాషా మాధ్యమం ద్వారా చదువులూ, ప్రత్యేక విషయంగా మాత్రమే ఇంగ్లీషు అనే చట్టం రావాలి. అప్పుడే, సమాజంలో ప్రజలందరికీ సమాన ఉద్యోగావకాశాలూ ఆర్థిక ఉన్నతీ చేరువవుతాయి.

ప్రపంచంలోని 230 దేశాలలో 175 దేశాలలో మాతృభాషా మాధ్యమమే నడుస్తోంది. ఆ మిగిలినవి బ్రిటిషు, స్పెయిను లాంటిఆధిపత్య దేశాల వలసపాలనలో మగ్గి అణగారిన దేశాలే. దాంట్లో మన దేశమూ, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లాంటి పెద్దదేశాలూ మరెన్నో చిన్నాచితకా ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలే. మాతృభాషా మాధ్యమం నడుస్తున్న దేశాలలో అక్షరాస్యత ఎక్కువ. దాంతోపాటు ఆర్థికాభివృద్ధీ ఎక్కువే. అందుకోసం బడిభాషగాఅమ్మనుడికే మనం నిలబడాలి. మాతృ భాషామాధ్యమ ఉద్యమం అవసరం అందుకే.

స.వెం.రమేశ్

## పొరుగు రాష్ట్రాలలోని తెలుగువారు

# కొడిగట్టిపోతున్న తెలుగు భాషాదీపం

**భా**రతదేశాన్ని ఉత్తర దక్షిణాలుగా విభజిస్తూ, భరతమాతకు వడ్డాణం లాగా వింధ్యపర్వతాలున్నాయి. ఈ వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఇప్పుడు ఒరిస్సా, ఛత్తీసుఘడ్, మహారాష్ట్రల లోని కొన్ని ప్రాంతాలూ, ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలూ, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతమూ ఉన్నాయి. చదువరుల సులువు కోసం దీనినంతా కలిపి నేనిక్కడ దక్షిణ భారత దేశం అంటున్నాను. ఈ దక్షిణ భారతదేశంలో ఎన్నో రకాల భాషలను మాట్లాడేవారున్నారు. ముఖ్యమయిన భాషలు : తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠి, ఒరియా, గోండి, ఉరుదూ, తుళు, కొంకణి, కొడగు. ఇవిగాక కొద్ది కొద్ది మంది మాట్లాడే రకరకాల కొండవాసుల భాషలున్నాయి.

శాతవాహనుల కాలం నుండీ ఆంగ్లేయుల రాకవరకూ ఈ దక్షిణ భారతదేశం అంతా చిన్నా పెద్దా రాజ్యాలుగా వుండేది. కొన్ని కాలాలలో కలిసి వుండేది. ఎన్నో సమయాలలో చిన్న చిన్న రాజ్యాలుగా వుండేది. ఆంగ్లేయుల పరిపాలనా కాలానికి ఈ దక్షిణ భారతదేశం మద్రాసు, మైసూరు, నిజాం, తిరువాన్కూరు, కొచ్చిన్, రాష్ట్రాలుగానూ, బొంబాయి, మధ్యరాష్ట్రాలలో కొంతభాగంగానూ వుండి పోయింది.

తెలుగు వారి ఆందోళనలూ, అలజడుల కారణంగా ప్రజాస్వామ్య భారతదేశంలో ఇప్పుడు మొదట వివరించిన పద్ధతిలో ఉన్నది.

**తెలుగువారు ఎందరున్నారు?**

దక్షిణ భారతదేశంలో ఈనాటికీ ఎక్కువమంది మాట్లాడే భాష తెలుగు. మిగిలిన అన్ని భాషలవారూ కలిసినా కూడా తెలుగు వారొక్కరే పెద్ద సంఖ్యలో వున్నారు. దక్షిణాదిన నేటికీ 50 శాతం పైగా తెలుగువారున్నారు.

తెలుగువారి సంఖ్యను ఇంకొంచెం వివరంగా చెబుతాను.

| | | |
|---|---|---|
| **ఆం.ప్ర.జనాభాలో** | **90 % అంటే సుమారు** | **7 కోట్లు** |
| **తమిళనాడులో** | **42 % అంటే సుమారు** | **2 కోట్లా 80 లక్షలు** |
| **కర్ణాటకలో** | **33 % అంటే సుమారు** | **1 కోటీ 70 లక్షలు** |
| **మహారాష్ట్రలో** | **16 % అంటే సుమారు** | **1 కోటీ 50 లక్షలు** |
| **ఒరిస్సాలో** | **22% అంటే సుమారు** | **80 లక్షలు** |
| **ఛత్తీసుఘడ్లో** | **20 % అంటే సుమారు** | **80 లక్షలు** |
| **కేరళలో** | **12 % అంటే సుమారు** | **40 లక్షలు** |

అంటే దక్షిణ భారతదేశంలో పధ్నాలుగున్నర కోట్లకు పైగా తెలుగువారున్నారు. ఉత్తరభారతం, ఇతర దేశాలలోని తెలుగు వారిని కలుపుకొంటే తెలుగువారు 15 కోట్ల పైమాటే. అంటే భారతదేశంలో ఎక్కువ మందికి తల్లిపలుకు తెలుగే. ఆంధ్రప్రదేశ్ కు బయట దక్షిణాదిన ఏడున్నరకోట్ల మంది తెలుగు వారున్నారు. ఈ సంఖ్య ఆంధ్రప్రదేశ్ లోని తెలుగువారి సంఖ్య కంటే పెద్దది.

**తెలుగు దీనస్థితికి కారణాలు ఏమిటి?**

ఇంత పెద్ద భాష ఎంతో చరిత్ర కలిగిన భాష ఇట్లా దీన పరిస్థితికి రావడానికి కారణమేమిటి? కాస్త చూద్దాము.

**1వ కారణము :** పరాయిభాషల వారి పరిపాలనలో వుండిపోవడము. దక్షిణాదిన ఎక్కువ భాగం, ఎక్కువకాలం ఆంధ్రరాజులే పరిపాలన చేసినారు. కొన్ని ప్రాంతాలు మాత్రం కొన్ని కాలాలపాటు ఇతర రాజుల పరిపాలనలో వున్నాయి. విజయనగర సామ్రాజ్య పతనం తరువాత చాలా ప్రాంతాలు ఉర్దూ భాషీయుల చేతిలోనికి, వారి ద్వారా ఆంగ్లేయుల చేతిలోనికి పోయాయి. ఇదొక కారణము.

**2 వ కారణము :** తెలుగువాడికి మొదటినుంచీ కూడా తెలుగుభాషపై పట్టనితనం. అదిప్పుడు మనం కనులారా చూస్తూనే వున్నాం. ఏదో ఒక పొరుగు భాషపైన విపరీతమైన ఆకర్షణ తెలుగువాడికి. ఇది ఇప్పుడే కాదు. మొదట్నించీ వున్నదే. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో ఆంగ్లానికి పెద్దపీట వేసినట్లే. ఉమ్మడి మదరాసు రాష్ట్రంలోని తెలుగువాడు తమిళానికీ, మైసూరురాజ్యంలోని తెలుగువాడు కన్నడానికీ, ఒరిస్సాలోని వారు ఒరియాకు, మహారాష్ట్రలోని వారు మరాఠీకీ, జాతీయభాష పేరుతో వచ్చిన హిందీకి, పెద్దపీట వేసినారు. హిందీని జాతీయభాషగా ప్రచారం చేయడంలో తెలుగువాడిదే పెద్ద చేయి. తెలుగువాడి సాయమే లేకుంటే, ఉత్తరాదిన కేవలం 13 కోట్ల మందికి మాతృభాష అయి వుండి, దక్షిణాదిన ఉనికేలేని హిందీ (ఇప్పటి లెక్కల ప్రకారం) జాతీయభాష అయివుండేదే కాదు. రాజుల కాలంలోనూ అంతే సంస్కృత, ప్రాకృత భాషలకే పెద్దచోటు. శాతవాహనులు ప్రాకృతంలో గ్రంథాలు రాస్తే, పల్లవులు ప్రాకృతంతో పాటు, తమిళంలో శాసనాలే వేసినారు. చరిత్రలో నిన్న మొన్నటి రెడ్డిరాజులు కూడా సంస్కృత గ్రంథాలే వ్రాసినారు.

**3 వ కారణము :** ఇది కేవలం ఇతర రాష్ట్రాలలోని వారికి చెందినది, ముఖ్యమైనది కూడా. ఏమిటంటే, ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్ప డటం. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఎందుకు అడిగినారో అర్థమే కాదు. ఇక్కడ నేను ఆనాటి పెద్దలను విమర్శించాలను కోవడం లేదు. ఆనాటి ఉద్యమస్ఫూర్తినీ, త్యాగధనులనూ తప్పు పట్టడం లేదు. జరిగిన చరిత్రను, ఇన్నాళ్ళూ పెద్దలు దాచి పెట్టిన విషయాలనూ చెబుతున్నానంతే. ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో తమిళుల పెత్తనాన్ని భరించలేక ప్రత్యేకాంధ్ర ఉద్యమం మొదలయిందని మనం చరిత్ర పుస్తకాలలో చదువుతున్నాం. ఇది నిజమేనా? బాగా పరిశీలించి చూస్తే తెలుస్తుంది.... మాంటేగ్-ఛేమ్సుఫర్డ్ సంస్కరణలు వచ్చి భారతదేశంలో ఎన్నికలు జరిగి, భారతదేశంలో స్థానికులకు పరిపాలనలో చోటు కల్పించడం మొదలయింది 1920లలో. అప్పటికే ఆంధ్రరాష్ట్ర ఉద్యమం మొదలై వుంది. నిజంగా అప్పటి పెద్దలు

చెప్పినట్లు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమిళుల పెత్తనమే వుంటే, మద్రాసు రాష్ట్రానికి అగరం సుబ్బరాయలురెడ్డి, పానగల్లు రాజా, కుమారస్వామి రాజా, కె.వి.రెడ్డి, బొల్లిని మునుస్వామినాయుడు, టంగుటూరి ప్రకాశం, ఓమందూరు రామస్వామిరెడ్డి లాంటి తెలుగువారే ఎందుకు ముఖ్యమంత్రు లయినారు. మదరాసు నగరానికి మొదటి మేయర్ పిట్టి త్యాగరాయశెట్టి తెలుగువాడే. తమిళుల పెత్తనం అంతగా వున్నప్పుడు తమిళులెందుకు ఉన్నత పదవులను పొందలేకపోయారు. దీనిని బట్టి చూస్తే ఆనాడు పెద్దలు చెప్పిన 'తమిళుల పెత్తనం' అనే మాట ఒట్టిది. ఆనాటి ఆంధ్రోద్యమ కారులు చెప్పిన ఇంకొక ముఖ్య కారణము కృష్ణానది నీళ్ళు. ఇప్పుడు నాగార్జునసాగర్ వున్నచోట కాకుండా, ఇంకా ఎగువన ఆనకట్ట కట్టి, కాలువల ద్వారా దక్షిణాన చెంగల్పట్టు వరకూ నీళ్ళివ్వాలని అప్పటి మదరాసు రాష్ట్ర ప్రతిపాదన. 'పన్నులు తెలుగు వారి దగ్గర కట్టించు కొంటూ, నీళ్ళు అరవలకా?' అని ఆంధ్రులు ఆనాడు గర్జించారు. నిజానిజాలను చూస్తే, అప్పటి మదరాసు రాష్ట్రం చెప్పిన ఈ కాలువ నీళ్ళు గుంటూరు, కృష్ణా జిల్లాలకే కాక, నెల్లూరు, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల గుండా చెంగల్పట్టుకు చివరలో చేరేవి. వీటిలో అరవప్రాంతాలు ఏమున్నాయి? మదరాసు నగరానికి కేవలం 50 కి.మీ. దక్షిణంగా వుండే చెంగల్పట్టు అరవప్రాంతం కానే కాదు. అచ్చమైన తెలుగు ప్రాంతం. మరి ఉద్యమం ఎందుకు చేసినట్లు? (ఇంత ఉద్యమం చేసీ ఆంధ్రప్రదేశ్ ఏర్పరచుకొని, చెంగల్పట్టునూ, మదరాసునగరాన్ని తమిళులకు అప్పగించి, తీరుబాటుగా మళ్ళీ ఇప్పుడు ఆ కాలువనే తెలుగుగంగ పేరుతో తవ్వినారు.) ఏతా - వాతా తేలేదేమిటంటే, అప్పుడు జరిగిన ఉద్యమం తమిళుల పైన కోపంతో కాదు. దక్షిణజిల్లాల తెలుగువారి పైన కోపంతో, ఉత్తర జిల్లాలవారు ఉద్యమించినారు. అప్పుడు అధికారంలో వున్న తెలుగువారంతా (ఒక్క ప్రకాశంగారు తప్పిస్తే) దక్షిణజిల్లాలవారే కదా? ఆ ఉద్యమానికి భాషను ఒక ఆయుధంగా ఎన్నుకొన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్న వేర్పాటు వాదాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఇప్పుడు వేర్పాటువాదులు కూడా నీళ్ళూ, భాషలోని యాసా ఆయుధాలుగా చేసుకొని ఉద్యమిస్తున్నా, వారి అంతరంగంలో అధికారం చేపట్టినప్పుడు అసలు కారణం. అప్పుడు జరిగిందీ ఇదే. ఇప్పుడు జరుగుతున్నదీ ఇదే.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఆయా రాష్ట్రా లలో మిగిలిపోయిన తెలుగువారు నిస్సహాయు లయిపోయినారు. ముఖ్యంగా తమిళనాడులో తెలుగు వారి పైన ఒత్తిడి పెరిగిపోయింది. ఏం మాట్లాడినా 'మీకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చేసినా, ఇంకా ఇక్కడ మీ పెత్తనం ఏమిటి?' అని తమిళులు నిలదీయ సాగినారు. విధిలేని పరిస్థితుల్లో తల్లిమాటకు తెలుగువాడు దూరం కావలసి వచ్చింది.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం జరిగుండకపోతే, ఆంధ్రప్రదేశ్ ఏర్పడి వుండకపోతే దక్షిణాది అంతా కలసి దక్షిణప్రదేశ్ రాష్ట్రం ఏర్పడివుంటే, ఈనాడు భారతదేశంలో తెలుగు తిరుగులేని స్థానంలో వుండుండేది. తెలుగుకన్నా చిన్న భాష అయిన హిందీ, ఎట్లా అయితే ఉత్తరాది అంతా అల్లుకుందో, అట్లా తెలుగు దక్షిణాది అంతా అల్లుకుపోయి వుండేది. కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు ఇతర భాషీయులు కూడా తెలుగును నేర్చుకొనేందుకు ఆసక్తి చూపుతుండేవారు.

**(2003 ఏప్రిల్ - నడుస్తున్న చరిత్ర నుండి)**

## మీకు తెలుసో, లేదో

1. ప్రస్తుతం 'ఒరిస్సా'గా పిలుస్తున్న కళింగ ప్రాంతాన్ని కళింగ గాంగులు తొమ్మిది వందల సంవత్సరాలు పరిపాలించి నారు. వీరి మాతృభాష తెలుగు.

2. కేరళలో ప్రసిద్ధి చెందిన రామనాట్టం, కృష్ణనాట్టం అనే శాస్త్రీయ నృత్యాలు సంస్కృత భాషలో నడుస్తాయి. ఈ నాట్య గ్రంథాలు తెలుగు లిపిలో వుండేవి.

3. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎల్లోరా, కోణార్క్, పూరి, మధుర, మహాబలిపురం దేవాలయాలను తెలుగు రాజులే నిర్మించారు.

4. ఒడియా భాషలో అద్భుతమైన 'ఆధ్యాత్మ రామాయణా'న్ని వ్రాసిన గోపాలకవి తెలుగువాడే.

5. 1857వ సంవత్సరం ఆంగ్లేయుల పై జరిగిన ప్రథమ స్వాతంత్ర్య తిరుగుబాటుకు పదేండ్లు ముందే 1847 లో తెలుగువాడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆంగ్లేయుల పై తిరుగుబాటు చేసినాడు.

6. బ్రిటీష్ మహారాణి విక్టోరియా ఇచ్చిన వాగ్దానాలను అమలు జరపడం లేదంటూ, ధైర్యంగా ఆంగ్లేయ ప్రభుత్వానికి ఎత్తి చూపిన మొదటి భారతీయుడు 'గాజుల లక్ష్మీనరుసు శెట్టి' అనే తెలుగువాడు.

7. తెలుగులో వచ్చిన మొట్టమొదటి వార్తా పత్రిక సత్యదూత. ఇది 1835లో, ఇప్పుడు కర్ణాటకలో వున్న అచ్చ తెలుగు ప్రాంతమైన బళ్ళారి నుండి ప్రచురితమయ్యేది.

8. అచ్చ కన్నడ జిల్లాలుగా పేరుపొందిన మైసూరు, మండ్య, శివమొగ్గ, చామరాజ నగరు జిల్లాలలో, కన్నడ మాతృభాష కలిగిన మంగలివారు ఒక్కరూ లేరు. అందరూ తెలుగు వారే.

9. కర్ణాటక మొట్టమొదటి ముఖ్యమంత్రి కేశంపల్లి చెంగలాయ రెడ్డి తెలుగువారే.

10. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ స్థాపకులు డా॥ హెగ్డేవార్ మాతృభాష తెలుగు.

11. మహారాష్ట్రకు ఒకప్పటి ముఖ్యమంత్రి డా॥ కన్నంవార్ తెలుగువారే.

12. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై తెలుగు వారేననీ, వారి తల్లి పేరు బంగారమ్మ అనీ ఆంధ్రులకు మొట్ట మొదట తెలియజేసినది స్వర్గీయ మరుపూరు కోదండరామిరెడ్డి,

## స్పందనను వ్రాయండి


'**అమ్మనుడి**'లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు '**అమ్మనుడి**',
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*



Unfiled Notes Page 9

వీవెన్
9963029061

తెలుగు భాషకు ఆధునిక హోదా–6



# నగరాలు పలు భాషల నగారాలు కావాలి

ప్రపంచ జనాభాలో సగం నగరాలలోనే ఉన్నదని ఐక్యరాజ్యసమితి 2008లో ప్రకటించింది. తాజా అంచనాల ప్రకారం 2030వ సంవత్సరానికల్లా ప్రపంచ జనాభాలో 60% నగరాలలోనే నివసిస్తారనీ, 2050 సంవత్సరానికి ఇది 70 శాతానికి చేరువకావచ్చనీ చెప్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇప్పటికే 80 శాతం పైబడి నగరాలలో నివసిస్తున్నారు. ఈ వృద్ధికి మామూలుగా జనాభా పెరుగుదలతోపాటు నగరాలకు వలసలు, నగరీకరణలు దోహదం చేస్తున్నాయి.

కోటిమంది కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాలను మహా నగరాలు (మెగాసిటీ) అని వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 46 మహానగరాలు ఉంటే, కేవలం భారతదేశంలోనే 6 ఉన్నాయి. భవిష్యత్తు అంతా నగరాలదే. ఈ నేపథ్యంలో భాషల మీద పడే ప్రభావం, పరిరక్షణ గురించిన అంశాలతో ఈ వ్యాసం.

నగరాలలో జనాభాలో అధిక శాతం (వారో వారి పూర్వీకులో) వలసలుగా వచ్చినవారే అయివుంటారు. తత్ఫలితంగా నగరాలు భిన్న సంస్కృతుల, విభిన్న భాషల సమ్మేళనాలు. కాలక్రమేణా ప్రతీ నగరానికీ దానికంటూ ఒక ప్రత్యేకమైన సంస్కృతి ఏర్పడుతుంది. పాలన ఏదో ఒక భాషకి పరిమితమవుతుంది.

నగరాలలో మరో వింత పోకడ: ఒకవైపు ఆకాశహర్మ్యాలు, మరోవైపు మురికి వాడలు. (ఎవరో రచయిత అన్నట్టు అత్యంత ధనికుడూ, అతి పేదవాడూ నగరంలోనే ఉంటాడు.) ఈ విభజన కూడా ఆ నగర భాషాసంస్కృతులపై ప్రభావం చూపిస్తుంది.

నగరాలలో దాదాపు చాలా వరకు ఉద్యోగ, వ్యాపారాల్లో ఉండి తీరిక లేని పరిస్థితే కనిపిస్తుంది. ఉరుకులు, పరుగులు నిత్యకృత్యమవుతాయి. అందువల్ల భాషాసంస్కృతులపట్ల ఆసక్తి చూపించేవారూ, అందుకు సమయం కేటాయించేవారూ జనాభాలో అతి కొద్దిశాతమే ఉంటారు. అధికాదాయ వర్గాలు తగినంత తీరికసమయంతో ఉన్నా వారి ప్రాథమ్యాలు వేరుగా ఉంటాయి. సగం పైన జనాభా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ రోజుగడవడమే గగనం అన్న రీతిలో ఉంటారు.

అటు నగర / పురపాలక సంస్థలు కూడా వేగంగా పెరుగుతూన్న జనాభాకి తగ్గట్టు కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా విఫలమవుతున్నాయి. స్వచ్ఛమైన గాలీ నీరూ అందేలా చూడడం, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, సాఫీయైన రహదారులు వంటి సేవల నిర్వహణే కుంటుతూ నడుస్తుంది. కొండొకచో వీటిని ప్రయివేటు నిర్వహణలో కూడా నడిపిస్తున్నారు. ఈ స్థితిలో నగరంలోని ప్రజల భాషలకు, వారి సంస్కృతులకు:నగరం లోనూ, దాని బడ్జెట్టులోనూ:సముచిత స్థానం కల్పించడం, వాటిని ప్రోత్సహించడం అనేవి ఊహకందని విషయాలుగానే ఉండిపోతున్నాయి. ఏదో ఒక భాష (మరో అనుబంధ భాషతోనో) పాలన అంతా నెట్టుకొచ్చేయబడుతుంది. జపాన్, చైనా దేశాల నగరాలలో ఆక్కడి స్థానికభాష చెలామణి ఉంటే, అదొక్కటే ఉంటుంది. ఇతర / పరాయి భాషలకు ఆదరణ ఉంటుందనుకోలేము. సింగపూర్ వంటి నగరాలు పలు భాషలను ఆదరిస్తూ ఇందుకు మినహాయింపుగా నిలుస్తున్నాయి.

భారతదేశం వంటి అభివృద్ధి చెందిన దేశాల నగరాలలో అధిక శాతం జనాభా అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ ఉంటారు. హైదరాబాద్ నగరాన్నే తీసుకుంటే, తెలుగు, ఉర్దూల తర్వాత హిందీ, రాజస్థానీ, పంజాబీ, మరాఠీ, గుజరాతీ వంటి భాషల వారే ఇందులో ఉంటారు. వీరందరికీ ఆంగ్లం రాదు. అయినా, కార్యాలయాలు, పాలనలోనూ ఆంగ్లానిదే భోగం. కేవలం ఆంగ్లం, తెలుగు (కొన్నిచోట్ల ఉర్దూ) మాత్రమే కనబడే ఈ నగరంలో వీరందరూ 'సమాచారం అందుబాటు'కి బహుదూరంగానే ఉంటున్నారు. గల్ఫ్ నగరాలతో తెలుగువారి పరిస్థితీ ఇంతే దారుణంగా ఉంటుంది.

### కొత్త ఆశలు

1. న్యూయార్క్ నగరంలో 'లిటిల్ చైనా', మరికొన్ని నగరాల్లో 'చైనా టౌన్' వంటివి ఆయా ప్రాంతాలనుండి వలసవచ్చినవారు ఒకే చోట దగ్గరదగ్గరగా స్థిరపడి తమ ప్రత్యేకతతో నివసిస్తూంటే ఏర్పడిన

## అక్షరాస్యతలో నెం 1.   100/100   ఫిన్లాండ్

**క**నెక్టికట్ విశ్వవిద్యాలయం నిర్వహించిన సర్వే ప్రకారం, ప్రపంచంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన దేశాల్లో తొలిస్థానం ఫిన్లాండ్‌ది (100శాతం). చదువుతోపాటు చదువుకున్న వాళ్ల వ్యవహారశైలినీ పరిగణనలోకి తీసుకొని నిర్వహించిన నాగరిక దేశాల సర్వేలోనూ దానికి తొలిస్థానం దక్కింది.

✱ తరగతిలోని విద్యార్థుల మధ్య ప్రతిభ విషయంలో అతి తక్కువ వ్యత్యాసం ఉన్న దేశం ఫిన్లాండే. తెలివైన విద్యార్థులకంటే, త్వరగా పాఠాలను అర్థం చేసుకోలేని పిల్లల దగ్గరే టీచర్లు ఎక్కువ సమయం గడపటం, సగటున పదిహేను మంది పిల్లలకు ఒక టీచర్ ఉండటం దానికి కారణం ప్రతిభ ఆధారంగా పిల్లల్ని వేర్వేరు సెక్షన్లలో కూర్చోబెట్టే పద్ధతే వాళ్ళకు తెలీదు.

✱ ప్రపంచ వ్యాప్తంగా అతి తక్కువ బోధనా గంటలూ, స్కూళ్లకు ఎక్కువ సెలవులు ఉన్న దేశం ఫిన్లాండే. అక్కడ స్కూళ్ళు గరిష్టంగా 180 రోజులు మాత్రమే పనిచేస్తాయి. భారత్‌లో దాదాపు 240 రోజులపాటు తెరిచి ఉంటాయి. అక్కడ సగటున ఒక ఉపాధ్యాయుడు ఏడాదికి 600 గంటలపాటు పాఠాలు చెబుతాడు. అదే మన దేశంలో ఆ సంఖ్య దాదాపు 1700 గంటలు. అంటే ఫిన్లాండ్ కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ.

✱ భవిష్యత్తులో విద్యార్థుల వృత్తిగత జీవితంలో పెద్దగా ఉపయోగపడని జాగ్రఫీ, హిస్టరీ లాంటి కొన్ని సబ్జెక్టులను ఫిన్లాండ్ హైస్కూళ్లలో తొలగించాలని నిర్ణయించారు. వాటి స్థానంలో ప్రస్తుత తరంలో జోరు మీదున్న రెస్టారెంట్లూ, జిమ్‌లూ, స్టార్టప్‌ల లాంటి సమకాలీన అంశాల గురించి బోధిస్తారు.

✱ ఫిన్లాండ్‌లో స్కూల్ సిలబస్‌ను తాయారుచేసే బాధ్యత పూర్తిగా టీచర్లదే. వివిధ ఉపాధ్యాయ సంఘాలన్నీ కలసి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త పాఠ్యాంశాలను చేరుస్తూ, పాతవాటిని తొలగిస్తూ ఉంటాయి.

✱ ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో పిల్లల పుస్తకాల్ని ప్రచురించే దేశం ఫిన్లాండే. ప్రతి సిటీబస్సులో, రైల్లో ఓ పుస్తకాల స్టాండ్ కనిపిస్తుంది. విదేశీ కార్యక్రమాలని అనువదించకుండానే అక్కడి టీవీల్లో ప్రసారం చేస్తూ, వాటి కింద సబ్ టైటిళ్లు వేస్తారు. టీవీ చూస్తూనే పిల్లలు స్థానిక భాషను చదవడం నేర్చుకునేందుకే ఈ పద్ధతి.

✱ పదకొండేళ్లు వచ్చాకే ఫిన్లాండ్ పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు మొదలవుతాయి. అప్పటిదాకా బోధనంతా ఫిన్నిష్, స్వీడిష్ భాషల్లో సాగుతుంది. అక్కడ ఒక్కో విద్యార్థి సగటున నాలుగు భాషలు మాట్లాడగలడు.

పోటీ పరీక్షలూ, కాలేజీలకు ప్రవేశ పరీక్షలూ, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లూ లేని దేశం ఫిన్లాండ్. హైస్కూలు దశలోనే విద్యార్థులు తమ భవిష్యత్తుని నిర్ణయించుకుని దానికి తగ్గ కోర్సులే చేస్తారు. ఆ విద్యార్థుల సంఖ్యకు సరిపడా వృత్తి విద్యా సీట్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుంది.

విభాగాలు. ఇలాంటివి పరాయి దేశాల్లోనూ, ప్రాంతాల్లోనూ ఆయా భాషాసంస్కృతుల అచరణకు, పరిరక్షణకు ఎంతగానో తోడ్పడతాయి. నగరాలలో భిన్న సంస్కృతుల ఎదుగుదలకు ఇలాంటివాటికి ఏదో రకమైన తోడ్పాటుని ప్రభుత్వాలు అందిస్తే బాగుంటుంది.

2. సాంకేతికాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు:

(అ) దుకాణాల పేరుపలకలు మెల్లగా డిజిటల్ రూపంలోనికి మారుతున్నాయి. వీటిల్లో ఎల్‌ఈడీ లైట్లతో కూడిన తెర ఉంటుంది, దీనిలో ఏమి కనబడాలి అనేది కంప్యూటర్ ద్వారా నియంత్రించబడుతూంటుంది. వీటిలో కనబడే వాటిని ఎన్ని భాషలలో అయినా, ఒకదాని తర్వాత ఒకటి కూడా, చూపించవచ్చు.

(ఆ) నేటి కాలంలో ప్రభుత్వ, నగరపాలక సంస్థల సేవలు అన్నీ అంతర్జాలం ద్వారానో చేతిఫోనులో యాప్ ద్వారానే అందించే వీలుంది. ఆయా సైట్లనూ, యాప్‌లనూ స్థానికీకరించి పలు భాషలలో అందించ వచ్చు. పౌరులు తమకు కావలసిన భాషను ఎంచుకుంటారు. కాగితపు ఫారాల వలే ఒకటిరెండు భాషలకు పరిమితమవ్వాల్సిన గత్యంతరం ఉండదు. ఈ స్థానికీకరణ ప్రక్రియను ప్రజల భాగస్వామ్యంతో (క్రౌడ్ సోర్సింగ్) చేయవచ్చు.

(ఇ) కృత్రిమ మేధ, యంత్రాలు నేర్చుకోవడం వంటిని మెరుగయ్యేకొద్దీ, వివిధ భాషల మధ్య యంత్రానువాదమూ మెరుగవుతుంది. గూగుల్ ట్రాన్స్‌లేట్ వంటి ఉపకరణాలతో ఇప్పటికే మనం చూస్తున్న అంతర్జాల పేజీలను అప్పటికప్పుడు పలు భాషల్లో చూసే వీలుంది (తక్షణ అనువాదం). ఎదుటనున్న బోర్డు మీది సమాచారాన్ని మన చేతిఫోను కెమేరాతో మన భాషలో చూసుకునే వీలు కూడా అందుబాటులోకి వచ్చింది. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ ద్వారా బయటి ప్రపంచాన్ని అప్పటికప్పుడు మన భాషలో చూడవచ్చు. మనుషుల మాటల్ని అప్పటికప్పుడు మరో భాషలోనికి అనువదించి చెప్పే రోబోట్లు, ఉపకరణాలు పరిశోధనల్లోనూ, తయారీ దశల్లోనూ ఉన్నాయి. (తెలుగుకి సంబంధించి ఈ రంగంలో జరగాల్సిన కృషి చాలా ఉంది. మనం పూనుకుని తెలుగుని క్రియాశీలంగా వాడుతుండాలే గానీ, ఇది భవిష్యత్తు సాంకేతిక నిపుణులకు అపార అవకాశాలు కల్పిస్తుంది.)

**అందరికీ వారి మాతృభాషలో విద్య వంటి మౌలిక కార్యక్రమాలతో పాటు, ప్రజల భాషలలో సమాచారాన్నీ సేవలనూ అందించడానికి తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, విభిన్న భాషాసంస్కృతుల కలివిడి మనుగడకూ, పెంపుదలకూ సరైన సుహృద్భావ వాతావరణం/పరిస్థితులు కల్పించడం, ప్రజలకు వారి భాషా సంస్కృతుల పట్ల మక్కువను పెంచే చర్యలు చేపట్టడం లాంటి విషయాల్లో ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు, నగర / పురపాలక సంస్థలూ చేయాల్సిన కృషి చాలా ఉంది.**

వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.

అంపశయ్య నవీన్
99892 91299

## గొప్ప ధ్వనిఅనుకరణ కళాకారుడు, తెలుగువారి కీర్తి కిరీటం

# నేరెళ్ళ వేణుమాధవ్



భాషలోని వివిధ పలుకుబళ్ళను, యాసలను,
సామెతలను, జోక్స్‌ను ఆయన ప్రదర్శించే విధానం
తెలుగు భాషలోని అనేక వైవిధ్యాలను
అర్థం చేసుకోవడానికి తోడ్పడేది.
ఆయనకు తెలుగంటే విపరీతమైన అభిమానం ఉండేది.
ఎన్ని మాండలికాలున్నా, ఎన్ని యాసలున్నా
తెలుగుభాష ఒక్కటే అనే వాస్తవాన్ని
ఆయన అనేకసార్లు చెబుతుండేవాడు.

**జూన్** 19 మంగళవారం నాడు 11-30 గంటలకు విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్‌గా ప్రసిద్ధుడైన నేరెళ్ళ వేణుమాధవ్‌గారు వరంగల్‌లో తన స్వగృహంలో చివరిశ్వాస విడిచాడన్న వార్త విన్నప్పుడు వరంగల్ నగర ప్రజలంతా తమ కుటుంబంలోని ఒక ఆత్మబంధువే ఈ లోకం లోంచి శాశ్వతంగా వెళ్లిపోయాడని దుఃఖించారు.

నేరెళ్ళ వేణుమాధవ్‌తో నాకు 40 యేళ్ళ స్నేహం ఉంది. 1958లో నేను వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజిలో చదువుకుంటున్న రోజుల్లో మొదటిసారి ఆయన మిమిక్రీ ప్రదర్శనను చూశాను. ఆనాటి నుండే నేనాయనకు అభిమానినైపోయాను. 1966లో నేను నల్లగొండ కాలేజిలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రోజుల్లో నేనాయన్ను ఆ కాలేజీలో జరిగే వార్షికోత్సవానికి ఆహ్వానించాను. అప్పుడాయనతో ఒకరోజంతా గడిపే అవకాశం కల్గింది. అప్పట్నించే నాకాయనతో స్నేహం ప్రారంభమయ్యింది. ఆ స్నేహం క్రమంగా బలపడ్తూ వచ్చింది. 1982లో నేను వరంగల్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాక మేమిద్దరం తరచూ కలుసుకునేవాళ్ళం. 2001లో ఆయన 'నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్టు' అనే సంస్థను స్థాపించినప్పుడు దానికాయన అధ్యక్షుడయ్యాడు. నాకు చాలా ఆశ్చర్యం కల్గించిన విషయమేమిటంటే ఆ ట్రస్టుకు నన్ను ప్రధాన కార్యదర్శిగా నియమించటం. మీ కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా కార్యదర్శిగా నియమించండి అని నేనెంత పోరాడినా "ఆయన మీరే ఉండాల"ని పట్టుబట్టారు. ఆయన మాటను నేను కాదనలేక నేను నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్టులో శాశ్వత సభ్యుడుగానూ, ప్రధాన కార్యదర్శిగానూ ఉండటానికి అంగీకరించాను.

నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్టు యేర్పడినప్పట్నించి ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజు నాడు- అంటే డిసెంబర్ 28 నాడు వరంగల్‌లో పెద్ద కార్యక్రమం జరుగుతుంది. భారతదేశమంతా ఆరోజును "మిమిక్రీ డే"గా జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా ఉన్న మిమిక్రీ కళాకారులంతా ఆరోజు ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. అప్పుడప్పుడే మిమిక్రీ నేర్చుకుంటున్న ఔత్సాహిక కళాకారులకు మిమిక్రీ పోటీలు నిర్వహిస్తారు. అలాగే ఆరోజు సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం, రంగస్థలం లాంటి లలితకళల్లో విశేష కృషి చేసిన ఉద్దండులకు 10 వేల నగదుతో ఘనంగా సన్మానం చేస్తారు. ఇలా ప్రతి డిసెంబర్ 28 నాడు వరంగల్ నగరంలో రోజంతా - ఉదయం నుండి రాత్రి పదిగంటల వరకు మిమిక్రీ సంబరాలు జరుగుతాయి. వేణుమాధవ్‌కు కొన్ని వేలమంది శిష్యులున్నారు. మిమిక్రీ శ్రీనివాస్, ఆంథోనిరాజ్, హరికిషన్, జానీలీవర్, జూనియర్ వేణుమాధవ్ లాంటి ఎందరో లబ్దప్రతిష్టులైన మిమిక్రీ కళాకారులు డిసెంబర్ 28 నాడు తప్పనిసరిగా వరంగల్‌కొచ్చి వేణుమాధవ్ పుట్టినరోజు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటారు.

మిమిక్రీ కళాకారుడుగా వేణుమాధవ్ ప్రపంచమంతా మూడుసార్లు తిరిగొచ్చాడు. ఎన్నో దేశాల్లో ఆయన తన మిమిక్రీ ప్రదర్శనలతో శ్రోతలను ఉర్రూతలూగిస్తూ నవ్వుల్లో ముంచెత్తేవాడు. ఆయన మన తెలుగునాడులో మిమిక్రీ ప్రదర్శనలిచ్చినప్పుడు తెలుగుభాష ఎంత తియ్యని భాషో ఉదాహరణలతో చెబుతుండేవాడు.

ఆయన ఎన్నోసార్లు పోతన భాగవతంలోని సప్తమ స్కంధంలో ప్రహ్లాద చరిత్రలోని ఒక ఘట్టాన్ని పోతన ఎలా వర్ణించాడో చాలా అద్భుతంగా, వింటున్నవాళ్ళను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ చెప్పేవాడు. ఆ ఘట్టం యేమిటంటే: హిరణ్యకశిపుడిని నరసింహ అవతారంలో ఉన్న విష్ణుమూర్తి వధించిన ఘట్టం. హిరణ్య కశిపుడు స్తంభాన్ని తన గదతో ఢీకొట్టినప్పుడు ఆ స్తంభం బ్రద్దలై దాంట్లోంచి చాలా భయంకర రూపంలో నరసింహుడు బయటకొచ్చి హిరణ్యకశిపుడిని వధించిన ఘట్టాన్ని పోతన్న ఇలా వర్ణించాడు:

"ఇట్లు దానవేంద్రుండు, పరిగ్రహ్యమాణ వైరుండును, వైరానుబంధ జాజ్వల్యమాన రోషానలుండును, రోషానల జఘన్యమాన విజ్ఞాన వినయుండును, వినయ గాంభీర్య ధైర్య జేగీయమాన హృదయుండును, హృదయ చాంచల్య మానవతామసుండును రామసగుణ చంక్రమ్యమాణ సైర్యుండునునై, విస్రంభంబున హుంకరించి, బాలుని ధిక్కరించి,

హరినిందుజూపుమని, కనత్కనక మణిమయకర కరణక్రీంకార శబ్దపూర్వకంబుగా దిగ్గతిదంత భేదన పాటన ప్రశస్తంబగు హస్తంబున సభామండప స్తంభంబు వ్రేసిన వ్రేటు తొడన దశదిశలును మిణుగురులు సెదఅజిటిలి పెటిలిపడి..."

ఇలా ఈ వర్ణన రెండు పేజీల పర్యంతం సాగుతుంది. ఈ రెండు పేజీల అతికష్టమైన ఈ పోతన్న తెలుగును వేణుమాధవ్ మొత్తం తన కంచుకంఠంతో చదివి వినిపించేవాడు.

ఈ తెలుగును గ్రాంధికమని, మనం రోజూ రేడియోలోనూ, వార్తాపత్రికల్లోనూ వినే, చదివే తెలుగును వ్యావహారికమని, పల్లెటూళ్ళల్లో గ్రామీణులు మాట్లాడే తెలుగును గ్రామ్యమని - ఇలా తెలుగును ఎన్ని రకాలుగా మాట్లాడవచ్చో ఆయన వివరించి చెప్పేవాడు. గ్రామ్యాన్నే మనం మాండలికం అంటాం.

మాండలికానికి ఉదాహరణగా వేణుమాధవ్ ఒక జోక్ చెప్పేవాడు.

ఒకసారి అప్పట్లో, అంటే 1956లో ఆంధ్రప్రదేశ్ యేర్పడిన కొత్తల్లో తెలంగాణాకు చెందిన కె.వి. రంగారెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి దగ్గరకు వెళ్ళి "యేం సంజీవరెడ్డి! నాకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోతివి?" అని అడిగాడట. అప్పుడు సంజీవరెడ్డి "నీ వెనక జనం లేరు గదప్పా!" అన్నాట్ట. అప్పుడు కె.వి. రంగారెడ్డి "నువ్వు నాకు ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తే ఆళ్ళే వస్తరు" అన్నాట్ట. కె.వి. రంగారెడ్డి గొంతును, సంజీవరెడ్డి గొంతును అనుకరిస్తూ వేణుమాధవ్ ఈ జోక్ చెప్పినప్పుడు జనమంతా గొల్లున నవ్వేవారు. కె.వి. రంగారెడ్డి గొంతులోని తెలంగాణ యాసను, సంజీవరెడ్డి గొంతులోని రాయలసీమ యాసను, వేణుమాధవ్ చాలా అద్భుతంగా ధ్వనింపజేసేవాడు.

శిష్టవ్యావహారిక భాషకు ఉదాహరణగా సినిమాల్లో నటీనటులు మాట్లాడే సంభాషణల్ని ఉదాహరణలుగా చెప్పేవాడు. ఎన్.టి. రామారావు, నాగేశ్వరరావు మాట్లాడుకున్నప్పుడు వినిపించే తెలుగును ఆయన వ్యావహారిక భాషకు ఉదాహరణగా చెప్పేవాడు. ఇలా చెణుకులను, భాషలోని వివిధ పలుకుబళ్ళను, యాసలను, సామెతలను, జోక్స్‌ను ఆయన ప్రదర్శించే విధానం తెలుగు భాషలోని అనేక వైవిధ్యాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడేది. ఆయనకు తెలుగంటే విపరీతమైన అభిమానం ఉండేది. ఎన్ని మాండలికాలున్నా, ఎన్ని యాసలున్నా తెలుగుభాష ఒక్కటే అనే వాస్తవాన్ని ఆయన అనేకసార్లు చెబుతుండేవాడు.

కళకు ప్రాంతీయ భేదాలు ఉండకూడదని, కళ అనేది ప్రపంచ ప్రజలందర్నీ యేకం చెయ్యాలని అంటుండేవాడు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి (UNO) జనరల్ అసెంబ్లీలో మిమిక్రీ ప్రదర్శన ఇచ్చిన మొట్టమొదటి మిమిక్రీ కళాకారుడు వేణుమాధవ్.

అక్కినేని నాగేశ్వరరావు అనేకసార్లు మా సినిమా హీరోలకంటే వేణుమాధవ్ ఎన్నో రెట్లు గొప్పవాడు అని చెబుతుండేవాడు. ఎందుకంటే "సినిమా హీరోకు మేకప్ వేసే వాడుంటాడు. డైలాగ్స్ రాసేవాడుంటాడు, ఇంకా ఎంతో మందుంటారు. కానీ వేణుమాధవ్ ఒక్కడే మిమిక్రీ కళను ప్రదర్శిస్తూ వేలమంది సినిమావాళ్ళను మనముందుంచుతాడు" అంటాడు ఏ.ఎన్.ఆర్.

వేణుమాధవ్‌కు స్నేహితులంటే ఎంతో ఇష్టం. ఆయనకున్న ముగ్గురు స్నేహితులు- సి.నా.రె, మిక్కిలినేని, గుమ్మడి - తనతో కలుపుకుని ఈ నల్గుర్ని "ఇష్టచతుష్టయం" అనేవారుట. వీళ్ళు నల్గురు అనేకసార్లు కలుసుకొని ఒకరికొకరు తోడు నీడగా ఉండేవారు.

నన్నూ వేణుమాధవ్ చాలా అభిమానించేవాడు. ఒకసారి ఆయన హైదరాబాద్‌లో మోకాలు ఆపరేషన్ ((Knee Replacement Operation) చేయించుకొని వరంగల్‌కు తిరిగొస్తూ తన ఇంటికి వెళ్ళకుండానే "నవీన్‌ను కలిసిపోవాల"ని మా ఇంటికొచ్చి గంటసేపు కూర్చొని వెళ్ళాడు. నాల్గు రోజులు కనిపించకపోతే "నవీన్ గారూ! ఎలా ఉన్నారు?" అంటూ పలకరించేవాడు. నాకొచ్చిన అవార్డులన్నీ మీకూ వస్తాయి" అంటుండేవాడు. ఆ మహా కళాకారుడికి నా జోహార్లు. నా జీవితంలో ఆయన లేని లోటును ఎవరూ పూడ్చలేరు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

### ఇక తెలుగు వెబ్‌సైట్లకు గూగుల్ యాడ్స్ సపోర్ట్

ప్రజాదరణ పొందిన తెలుగు వెబ్‌సైట్లకూ ఇక గూగుల్స్ యాడ్‌వర్డ్స్, గూగుల్ యాడ్‌సెన్స్ మద్దతుతో ప్రకటనలు లభించనున్నాయి. దీంతో తెలుగు పబ్లిషర్లు, ప్రకటనకర్తలు ఇంటర్నెట్‌లో అసంఖ్యాకంగా ఉన్న తెలుగు వారికి చేరువకావచ్చు. 'గూగుల్ ఫర్ తెలుగు' పేరుతో 27-6-18న జరిగిన ఒక కార్యక్రమంలో కంపెనీ ఆగ్నేయాసియా, భారత మార్కెట్ల వైస్ ప్రెసిడెంట్ రాజన్ ఆనందన్ మాట్లాడారు. 'ఇంటర్నెట్‌లో భారతీయభాషల కంటెంట్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇది రోజురోజుకీ భారీగా పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తెలుగు వెబ్‌సైట్లు, బ్లాగులకు కూడా ప్రకటనల ఆదాయం సమకూర్చేందుకు గూగుల్ యాడ్‌వర్డ్స్, గూగుల్ యాడ్‌సెన్స్‌ను అందుబాటులోకి తెస్తున్నాం' అన్నారు.

గత 18 నెలల్లో నెట్ వినియోగదారుల సంఖ్య భారత్‌లో పెరిగినంత వేగంగా మరెక్కడా పెరగలేదన్నారు. ప్రస్తుతం కొత్తగా ఇంటర్నెట్ వినియోగిస్తున్న ప్రతి పదిమందిలో తొమ్మిది మంది భారతీయ భాషల్లో నెట్ చూస్తున్నట్టు ఆనందన్ చెప్పారు. 2021 నాటికి యాభై కోట్ల మందికి పైగా నెట్ వినియోగదారులు భారతీయ భాషల్లో నెట్ వినియోగిస్తున్నారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి భారతీయుడికి ఇంటర్నెట్‌ను చేరువ చేయాలన్నదే గూగుల్ లక్ష్యమన్నారు. ఆదాయం లేకపోవడంతో ప్రస్తుతం తెలుగులో సరైన కాంటెంట్ అందుబాటులో లేకపోవడమే పెద్ద సమస్యగా ఉందన్నారు. గూగుల్స్ యాడ్ వర్డ్స్, గూగుల్ యాడ్‌సెన్స్ టూల్స్‌తో ఈ లోటు తీరుతుందన్నారు.

ప్రస్తుతం దేశంలో ఆన్‌లైన్ ప్రకటన మార్కెట్ రూ.10,000 కోట్లు ఉంటే అందులో డిజిటల్ ప్రకటన మార్కెట్ వాటా ఐదుశాతం మాత్రమేనని గూగుల్ ఇండియా మార్కెటింగ్ సొల్యూషన్స్ డైరెక్టర్ షాలిని గిరీష్ చెప్పారు. 2021 నాటికి ఆన్‌లైన్ యాడ్స్ మార్కెట్ సుమారు రూ.29,250 కోట్లకు చేరుతుందన్నారు. అందులో డిజిటల్ ప్రకటనల వాటా 35 శాతం వరకు ఉంటుందని చెప్పారు. భారతీయ భాషల్లో హిందీ తర్వాత తెలుగులో ఎక్కువమంది ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. (ఆంధ్రజ్యోతి 28-6-2018)

సంకేపల్లి నాగేంద్ర శర్మ
సెల్: 9441797650.

# పెద్దబొంకూరు శాతవాహన స్థావరం

## తెలంగాణ పురావస్తు శాఖ తవ్వకాలలో బయల్పడిన చారిత్రిక యుగపు ఆనవాళ్ళు

**శా**తవాహన స్థావరమైన పెద్దబొంకూర్‌లో గత మూడు నెలల పాటు జరిగిన పురావస్తు తవ్వకాలు చరిత్రకారులను ఆశ్చర్య పరుస్తున్నది. చారిత్రక యుగపు ఆనవాళ్ళు ఇక్కడ 920 వరకు దొరికాయి. ఈ తవ్వకాలను పరిశీలించిన తెలంగాణా పురావస్తు శాఖా సంచాలకురాలు శ్రీమతి విశాలాచ్చి మాట్లాడుతూ, తెలంగాణా క్రీస్తు పూర్వము నుండే సంపన్న ప్రాంతంగా విరాజిల్లినట్లు ఇక్కడ తవ్వకాలలో బయల్పడిన ఆవశేషాలు తెలియజేస్తున్నాయని అన్నారు. జూన్ 8 వ తేదిన ఆమె పెద్దబొంకూర్ స్థావరాన్ని సందర్శించి, తవ్వకాలలో దొరికిన వివిధ వస్తువులను గూర్చి విలేఖరులతో మాట్లాడారు. మార్చ్, ఏప్రిల్, మే నెలల్లో జరిగిన తవ్వకాలపట్ల ఆమె తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లాలో, హైదరాబాద్ - రామగుండం స్టేట్ హైవే మార్గంలో, పెద్దపల్లికి సమీపంలో ఈ స్థావరం ఉంది. 1967, 68, 1973 - 74లలో ఇక్కడ పురావస్తు శాఖవారు తవ్వకాలు జరిపించారు. ఇక్కడ 70ఎకరాలలో ఈ శాతవాహన స్థావరం ఉంది. గతంలో జరిపిన తవ్వకాల స్థలంలో కాక, ఉత్తరం వైపున తవ్వకాలు జరిపారు. ప్రస్తుతం 25 కందకాలను తవ్వి, సుమారు 3 నుండి 4 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపారు. **తెలంగాణలో పలుచోట్ల ఇటీవలి కాలంలో తవ్వకాలు జరిపామని, సముద్ర తీరపు వ్యాపారాలు ఇక్కడి సమీపంలోని గోదావరి నది ప్రవాహాల ద్వారా జరిగాయని, కర్ణమామిడి, సిద్ధిపేట, నల్గొండ జిల్లాలలో జరిగిన తవ్వకాలలో ఆదిమానవుడి అవశేషాలతోపాటు, రోమన్ రాజుల కాలపు బంగారు పూత నాణాలు దొరికాయని విశాలాచ్చి అన్నారు.** సుమారు 22 లక్షల రూపాయలు ఈ తవ్వకాలకు కేటాయించామని అన్నారు. సుమారు రెండు వేల ఏండ్ల కిందటి అనేక వస్తువులు బయటపడ్డాయి. వివిధ రంగుల్లో కుండ పెంకులైతే బస్తాలు, బస్తాలుగా దొరికాయి. రోమన్ దేశపు చక్రవర్తుల నాణేలు దొరకడము వల్ల తెలంగాణా ప్రాంతము, క్రీస్తు పూర్వం రెండు నుండి, క్రీస్తు శకం నాలుగు వరకు 4 శతాబ్దాల పాటు, రాజుల యుద్ధాలు, ఎలాంటి గొడవలు లేకుండా ప్రజలు సుఖశాంతులతో ఉండటం వల్ల, తెలంగాణా ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, సుసంపన్నంగా విరాజిల్లినట్లుగా అంచనా వేయవచ్చునని చెప్పారు. ఇక్కడ గతంలో జరిగిన తవ్వకాలలో పూర్వ శాతవాహనులు, శాతవాహనుల కాలపు రాగి, సీసపు, పంచ్ మార్క్ నాణాలు దొరికాయి. ఇవి రోమన్ చక్రవర్తులు, మౌర్యులు, శాతవాహన రాజుల కాలపు నాణాలు దొరికాయి. ప్రజలు విలువైన ఆభరణాలతో పాటుగా, విదేశీ సముద్ర వాణిజ్యానికి ఆసక్తి చూపారని అన్నారు. రోమన్ చక్రవర్తుల కాలానికి చెందిన టైబీరియస్ వెండి నాణెం ఈ తవ్వకాలలో దొరికిందని, ఇది చెప్పుకోదగ్గ విషయమని అన్నారు. లోహపు పనిముట్లు,, మట్టిబొమ్మలు, అచ్చు ముద్రికలు, ఎముకతో చేశిన పాచిక, పలు రకాల సీసపు గాజులు, పిప్పాన్ పూసలు, శంఖు గాజులు వివిధ రకాల నాణేలు దొరికాయి. వీటితో పాటుగా చదరంగపు పావులు, ఇనుప మేకులు, చిరు కత్తులు, ఆవు కొమ్ము గల బొమ్మ లభ్యమయ్యాయి. 90 రోజులపాటు జరిగిన తవ్వకాలను వర్షాకాలం రావడం వల్ల నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ దొరికిన వస్తువులను హైదరాబాద్ మ్యూజియానికి తరలించి, భద్రపరచి, పరిశోధనలు చేయనున్నట్లు తెలిపారు.



జూన్ 8 న పెద్ద బొంకూర్ స్థావరంలో దొరికిన నాణాలు, పూసలను పరిశీలిస్తున్న తెలంగాణా ఆర్కియాలజి సంచాలకురాలు శ్రీమతి విశాలాచ్చి, ఆం.ప్ర. ఆర్కియాలజి శాఖ విశ్రాంత సంచాలకులు రామకృష్ణ, రిటైర్డ్ ఆర్కియాలజిస్ట్ శ్రీ రంగాచార్యులు, సైట్ ఇంఛార్జి డెప్యూటి డైరెక్టర్ రాములు నాయక్ తదితరులున్నారు.

పూర్వ కరీంనగర్ జిల్లా ప్రాంతం తొలి శాతవాహన రాజులకు ముఖ్యమైన పరిపాలనకేంద్రం, వెల్గటూర్ మండలంలోని కోటి లింగాలలో1979 -1980, 1983 - 1984 లలో **ఉమ్మడి రాష్ట్ర పురావస్తు శాఖవారు నిర్వహించిన తవ్వకాలలో పూర్వ శాతవాహనులు, తొలి శాతవాహన రాజుల కాలపు ఎన్నెన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయి... అంతకు ముందు గుంటూరు జిల్లా అమరావతి - ధాన్య కటకాన్నే తెలుగునాట శాతవాహన స్థావరంగా పరిగణించే వారు. ఎగువన ఉన్న మహారాష్ట్రలోని పైఠాన్ (ప్రతిష్టానపురం) ను శాతవాహన స్థావరంగా గుర్తించారు.. 1976 లో ధర్మపురికి చెందిన తపాల ఉద్యోగి సంగనభట్ల నరహరి శర్మ కోటిలింగాలలో శాతవాహనులకు చెందిన దుబ్బ నాణాలను కనుక్కోవడంతో, తొలి శాతవాహనులు, పూర్వ శాతవాహనుల స్థావరంగా కోటిలింగాల, తెలంగాణా ప్రాంతము ప్రసిద్ధి కెక్కింది.** ఇక్కడ రెండు వేల ఏళ్లకు పూర్వమైన మట్టి కోటను కనుగొన్నారు. అంతేకాక ఇక్కడ పొలాలలో శాతవాహనుల కాలం నాటి ఇటుక బావులను కనుగొన్నారు. రాష్ట్ర పురావస్తుశాఖకు చెందిన ప్రముఖ పురాతత్వవేత్తలు డా॥పివి. పర బ్రహ్మశాస్త్రి, డా॥వివి.క్రిష్ణశాస్త్రి, డా॥ఎన్.ఎస్. రామచంద్రమూర్తితో సహా ప్రముఖ పురాతన నాణాల పరిశోధకులు డా॥ దేమె రాజిరెడ్డి తదితరులు కోటిలింగాల, ధూళికట్ట, పెద్దబొంకూర్ స్థావరాలలో దొరికిన నాణాలపై పరిశోధన చేసి ఎన్నెన్నో అంశాలను వెలుగులోకి తెచ్చారు. ప్రాక్



జూన్ 25న పెద్ద బొంకూర్ శాతవాహన స్థావరంలో ఊరేగింపు తీసి, ఈ స్థలాన్ని కాపాడాలని కోరిన చరిత్రకారులు, రచయితలు. డా॥ మలయశ్రీ,డా॥ కాలువ మల్లయ్య, అల్లం వీరయ్య, బాలసాని రాజయ్య, మార్వాడి సుదర్శన్ తదితరులు ఉన్నారు.

చరిత్రకారులు ఠాకూర్ రాజారాం సింగ్ పెద్దపల్లి ప్రాంతంలోని యితర శాతవాహన స్థావరాలైన ధూళికట్ట, పెద్ద బొంకూర్‌లను వెలుగులోకి తెచ్చారు. **ధూళికట్టలో క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్తూపం బయటపడింది. ఈ స్తూపం అమరావతికన్న వంద ఏళ్లకు పూర్వమైనదని అంచనా వేశారు. దీనికి పది కిలోమీటర్ల దూరంలో వున్న పెద్దబొంకూర్లో శాతవాహనుల గ్రామీణ స్థావరం బయటపడింది. తెలంగాణా ప్రాచీన చరిత్రకు ఉమ్మడిరాష్ట్రంలో సరైన న్యాయం జరుగలేదు... పెద్దబొంకూర్‌లో శాతవాహన స్థావరంలో 70 ఎకరాల భూమిని గుర్తించి, సేకరించారు. కోటిలింగాల ధూళికట్ట మొదలగు శాతవాహన స్థావరాలతో సమానంగా పెద్ద బొంకూర్ శాతవాహన స్థావరం కూడా ముఖ్యమైనదని తెలంగాణా రాష్ట్ర పురావస్తుశాఖ గుర్తించింది.** 1968 నుండి 1974 వరకు ఉమ్మడి రాష్ట్ర పురావస్తు శాఖ ఇక్కడ పాక్షికంగా తవ్వకాలను నిర్వహించింది.


హుస్సేమియా వాగు తీరంలో వున్న, ఈ స్థావరంలో ఒక రైతుకు పొలంలో శాతవాహనుల కాలంనాటి నాణెముల కుండ దొరికింది. ఈ కుండలో 22 వేలకుపైగా నాణాలువున్నాయి. 1968-74 మధ్య యిక్కడ తొలిసారిగా జరిపిన తవ్వకాలలో శాతవాహనుల కాలంనాటి మూడు ఇటుక కట్టడాలు, ఇటుకతో కట్టిన 22 చేదబావులు, మట్టి గాజులతో నిర్మించిన ఒక బావి బయటపడింది. రెండు టంకశాలలు, మురుగు కాలువల ఆనవాళ్ళు, బయటపడ్డాయి. శాతవాహనులు, మౌర్యులు, రోమన్ చక్రవర్తుల కాలమునకు చెందిన రాగి నాణెములు, సీసపు నాణెములు, పంచ్ మార్క్ నాణెములు దొరికాయి. ఆ కాలములో వాడుకలోకి ఉపయోగించిన లోహపు పనిముట్లు, అబ్బురపరిచే రీతిలో మట్టి బొమ్మలు, అచ్చు ముద్రికలు, రాతిపూసలు లభించాయి. ఇవన్నీ క్రీస్తు పూర్వం 2 వ శతాబ్దం నుండి మొదలుకొని క్రీస్తుశకం 2 వ శతాబ్దమునకు చెందినవిగా గుర్తించారు.

ధూళికట్ట బౌద్ధస్తూపం వద్ద 1972-75 లో జరిగిన పురావస్తు తవ్వకాలలో, శాతకర్ణి కుమారుడు పులుమావి వేయించిన వెండి నాణెం బయటపడింది. రోమన్ రాజుల నాణాలు ఇక్కడ దొరకడంతో శాతవాహనులకు సముద్ర వ్యాపారాలు బాగా ఉండేవని తెలుస్తున్నది. గోదావరి నదిలో పడవలు బంగాళాఖాతం సముద్రం వరకు నడిపి, విదేశాలతో సముద్ర వ్యాపారం చేసే వారని తెలుస్తున్నది.

కోటిలింగాల తవ్వకాలలో శాతవాహనుల పూర్వ రాజులైన గోబద, నారన, కంవాయసిరి, సమగోప మొదలైన రాజుల నాణాలు కూడ దొరికాయి మహాతలవర, మహాసేనాపతి, శబక వంటి సామంత రాజులకు చెందిన నాణాలు కూడా యిక్కడి తవ్వకాలలో బయటపడ్డాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రం నుండి వేరుపడి, **తెలంగాణా వచ్చాక 2015-2017 సంవత్సరాల మధ్య సిద్ధిపేట సమీపంలోని పుల్లూరుగ్రామంలో జరిపిన తవ్వకాలలో బృహత్ శిలాయుగపు సమాధులలో మానవ అవశేషాలు బయటపడ్డాయి నర్మెట్ట గ్రామంలో కూడా సమాధిపై పేర్చిన బండ మూతరాయి బయటపడింది. పాలమాకుల గ్రామంలో కూడా ఇలాంటి బృహత్ శిలా సమాధులే బయటపడ్డాయి.** గోదావరి తీరంలోని కోటిలింగాల ఆవలవైపు వున్న మంచిర్యాల జిల్లాలోని కర్ణమామిడిలో 2017లో తెలంగాణా పురావస్తుశాఖ వారు, పాక్షికంగా తవ్వకాలను నిర్వహించారు. వర్షాకాలం రావడం వల్ల నెలరోజులకు పైగా జరిపిన ఈ తవ్వకాలను అర్ధాంతరంగా నిలిపివేసినట్టు సమాచారం.

**పెద్దబొంకూర్ శాతవాహన స్థావరంలో 48 యేండ్ల కింద నిలిపి వేసిన తవ్వకాలను, తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత, కొనసాగించడానికి, తెలంగాణా పురావస్తు శాఖ అధికారులు ముందుకు రావడం పట్ల, తెలంగాణా చరిత్రకారులు తమ హర్షామోదాలను వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ఆర్కియాలజి శాఖ సుమారు 22 లక్షలతో, ఒక్క తెలంగాణాలోని పెద్ద బొంకూర్లోనే, ఒక్కచోటనే తవ్వకాలు చేపట్టడానికి అనుమతి మంజూరు చేయడం గమనించాలి...**

ఫిబ్రవరి 22న పెద్దబొంకూర్లో పురావస్తు తవ్వకాలకు, తెలంగాణా



కాల్చిన మట్టితో చేసిన బొమ్మలు

పురావస్తు శాఖ సంచాలకురాలు శ్రీమతి విశాలాచ్చి శ్రీకారం చుట్టారు. పురావస్తు శాఖ ఉప సంచాలకులు డి.రాములు నాయక్ ఆధ్వర్యంలో, విశ్రాంత పురావస్తు అధికారులు ఎస్.ఎస్.రంగాచార్యులు, భానుమూర్తి లతో కూడిన పదిమంది అధికారుల బృందం ఈ పురావస్తు తవ్వకాలను పర్యవేక్షిస్తున్నారు. అధికారుల బృందంలో కరీంనగర్ ఇంచార్జి అధికారిణి శ్రీమతి మాధవి, నాగరాజు తదితరులు ఉన్నారు. ప్రతిరోజు సగటుగా 30 మంది కూలీలు ఇక్కడ పనులు చేస్తూ కనిపించారు. ప్రస్తుతం పెద్దబొంకూర్లో గతంలో బయల్పడిన ఇటుక కట్టడానికి ఉత్తరంగా కల ప్రాంతాన్ని ఎంచుకొని, అందులో ఒక డివిజన్‌గా ఏర్పాటుచేసుకొని, 5.5 మీటర్ల విస్తీర్ణంలో 25 పరికెలుగా(త్రెంచులు) గా విభజించారు. యిందులో ఆరు పరికెల్లో త్రవ్వకాలు జరిపి నెల రోజుల్లో కొంత మేరకు సత్ఫలితాలను సాధించగలిగారు. వీటిలో చాలావరకు, తొలి చారిత్రిక యుగపు ఆనవాళ్ళు, దాదాపు 30 నుండి 60 సెంటిమీటర్ల లోతుగల మట్టి పొరలలో బయటపడ్డాయి. మట్టి పూసలు, శంఖముతో చేసిన పూసలు, ముల్లాపు పూసలు, పచ్చటి బంగారు రేకులతో చేసిన పూసలు, క్రిస్టల్, గాజు, షెల్‌బ్రీడ్స్, కార్నిలియలన్ పూసలు, ఎముకలతో చేసిన చదరంగపు పాచికలు, చిన్నపాటి రింగ్ మట్టి పాత్రలు, కొలత పావులు, దుప్పి లేదా జింక కొమ్ము మొదలగునవి ఈ తవ్వకాలలో బయట పడ్డాయి. ముఖ్యంగా **ఈ చారిత్రిక తవ్వకాలలో మొట్ట మొదటిగా ముత్యాల పూసలు లభించటం మొదటిసారని పురావస్తు అధికారులు చెప్పారు. లోగడ ఇలాంటివి ఎక్కడా లభించలేదని, రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకురాలు శ్రీమతి విశాలాచ్చి చెప్పారు.** యిక్కడ దొరికిన ఒక నాణెం, పూర్వ శాతవాహనులైన గోబద కాలానికి చెందినది కావచ్చునని ఆమె అన్నారు. గోబద కాలానికి చెందిన నాణాలు కోటిలింగాల తవ్వ కాలలో దొరికిన విషయం గమనార్హం. పెద్దబొంకూర్‌లో దొరికిన ఎరుపు, నలుపు మట్టి పాత్రలు, పెంకులు, వివిధ రకాలైన లోహపు పనిముట్లు బయటపడటాన్ని గమనించవచ్చు. పెద్దబొంకూర్ తొలి తవ్వకాలలో కమ్మరి కొలిమి కూడా కనుక్కొన్నారు.

### హెరిటేజ్ సిటీ / సైట్‌గా అభివృద్ధి :

పెద్దపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దబొంకూర్ స్థావరాన్ని హెరిటేజ్ సైట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ 70 ఎకరాల స్థావరంలోనే సైట్ మ్యూజియం ఏర్పాటు చేసి, జిల్లా పురావస్తు శాఖ కార్యాలయాన్ని ప్రారంభించే యోచనని పరిశీలిస్తామని విలేకరులతో పురావస్తు సంచాలకురాలు విశాలాక్షి తెలిపారు. అంతేగాక ఈ స్థావరంలోని 70ఎకరాల భూమి, దురాక్రమణలకు గురి కాకుండా, చుట్టూ కంచె వేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు, ఈ స్థావరంలోని కట్టడాలు, చారిత్రిక ఇటుక బావులను ప్రజా ప్రదర్శనకు ఉంచుతామని అన్నారు. పెద్దబొంకూర్ తవ్వకాలు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. ఇంతేకాక సమీపంలో వున్న, ధూలికట్ట బౌద్ధ స్థావరం వద్ద ఆగిపోయిన తవ్వకాలను త్వరలో ప్రారంభించనున్నట్టు ఆమె తెలిపారు. ఇందులకై శాస్త్రీయ సర్వే నిర్వహించదలచామని అన్నారు. క్రీస్తు పూర్వము మూడవ శతాబ్దంలో గ్రీకు రాయబారి మెగస్తనీస్ చెప్పినట్లుగా శాతవాహనులకున్న 30 దుర్గాలలో కోటిలింగాల, ధూళికట్టతోపాటు, పెద్దబొంకూర్ స్థావరం కూడా ఒకటై ఉండవచ్చునని పురావస్తు శాఖాధికారులు భావిస్తున్నారు.

ఈ 70 ఎకరాల స్థావరం చుట్టు కంచె వేయడానికి 14వ కేంద్ర ఆర్థిక సంఘం 1.20 కోట్ల రూపాయలను మంజూరీ చేసింది. అట్టి నిధులను కేంద్రం విడుదల చేయలేదు. ఈ 70 ఎకరాలలో 30 ఎకరాల స్థలం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని నిర్ణయించినట్లు వస్తున్న వార్తల పట్ల ఈ ప్రాంత చరిత్రకారులు తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ స్థలాన్ని కాపాడాలని కోరుతూ చరిత్రకారులు డా॥ మలయశ్రీ, సాహితీ కారులు డా॥ కాలువ మల్లయ్య, బాలసాని రాజయ్య, అల్లం వీరయ్య ఆధ్వర్యంలో నలుపు రచయితల సంఘం రచయితలు 20 మంది పెద్దబొంకూర్, ధూళికట్ట స్థూపాల వద్ద ఫ్లెక్సీలను పట్టుకొని తమ నిరసనలను తెలుపుతూ జూన్ 24 న ప్రదర్శన చేశారు.




రోమన్ నాణెం (వెండి) – బొమ్మా బొరుసూ

ఆ 70 ఎకరాల స్థలాన్నీ ఆర్కియాలజీ శాఖవారికి కేటాయించి జిల్లా ఆర్కియాలజీ కార్యాలయాన్ని మ్యూజియం ఎగ్జిబిషన్ హాలుతోబాటు జిల్లా టూరిజం కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని చరిత్రకారులు కోరుతున్నారు.

డా॥ వేదగిరి రాంబాబు
9391343916

# గురువుకి తగిన శిష్యుడు



గిడుగు పిడుగైతే...ఆయన శిష్యుడు తాపీ ధర్మారావు, ఆయనకు ఏ మాత్రం తగ్గని శిష్యుడు.పర్లాకిమిడిలో కాలేజీలో చదివేటప్పుడు ఒకరోజున ధర్మారావుగారి ముఖంమీద బొట్టు కనిపించకపోవడంతో కోపగించుకుని, ఆయన మొఖం చూడకుండా తన కుర్చీని గోడవైపుకి తిప్పుకుని పాఠం చెప్పేరు గురువుగారు. ఆ తర్వాత ఆయనకు ధర్మారావుగారే ముఖ్య శిష్యుడయ్యాడు. అతని వైపే చూస్తూ పాఠం చెప్పేవారు.

ధర్మారావుగారు రామ్మూర్తిగారి వ్యవహారిక భాషా వాదం మీద ధ్వజం ఎత్తారు. కాలేజీలో ఆయనకు శిష్యుడు. ఆయన జ్ఞానాన్ని, దీక్షని, వాదన ప్రతిభని బాగా ఎరిగున్నవాడు. ఇవన్నీ ఆలోచించి ఒక చిన్న పద్య రూపంతో 'చంపకమాల'తో ఆయన్ని ఎదుర్కోడానికి సిద్ధమయ్యారు ధర్మారావుగారు. గ్రాంథికాన్ని బలపరుస్తూ, గురువుగారి వాదనని తిరగకొడుతూ చంపకమాల రాసారు.

గురజాడ అభ్యుదయం దిశగా సాగడానికి శ్రమించారు. సాహిత్యరంగంలో యధాపూర్వ స్థితికోసం పెనుగులాడే అభివృద్ధి నిరోధకుల భావాలపై గురజాడ కత్తికట్టి ఎదుర్కొన్నారు. కన్నుమూసే దాకా గురజాడ కలం దించలేదు.

'సంకెళ్ళను ప్రేమించే వాళ్ళు దాన్ని – అనగా గ్రాంథిక భాషను ఆరాధిస్తారు. కాగా నా మటుకు నా మాతృభాష సజీవమైన తెలుగు 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనిపించుకున్న మన ఈ తెలుగుతో మన సుఖాల్ని దుఃఖాల్ని వెల్లడించడానికి మనం ఎవరం సిగ్గు పడలేదు కానీ కాగితం మీద పెట్టడానికి మనలో కొంత మంది బిడియపడుతున్నారు', అంటూ అప్పటి స్థితిని ముఖం మీద కొట్టినట్టు చెప్పారు గురజాడ.

ఈ రంగంలో గ్రాంథికవాదుల మొరటుతనం, తెలుగుభాష పెరగడానికి వీలు లేకుండా మతిమీద మేకులు కొట్టింది. ఇక చిన్నయసూరిలాంటి వారైతే ఉక్కు చట్రాలనే బిగించారు. దీనిని గ్రహించారు ధర్మారావు.

అలాగే గురజాడ సాహిత్య సృజన గిడుగుకి లక్ష్యంగా కనిపించింది. దాంతో వ్యవహారిక భాషోద్యమం చేయాలనిపించింది ధర్మారావుగారికి. అంతే. ధర్మారావుగారు పాత కొత్తలకు పూల వంతెన వెయ్యాలి, ఆయన దృఢమైన వ్యక్తే కానీ తన అభిప్రాయం తప్పని తెలుసుకున్నప్పుడు, మార్చుకోవడానికి వెనుదీయలేదు. సంస్కరణ భావాలు పుష్కలంగా ఉన్న ధర్మారావుగారు కుమారుని కులాంతర వివాహాన్ని మనసారా సమర్థించారు. ఆ జంటకు చివరి వరకు అండగా నిలిచారు. కోడలు తాపీ రాజమ్మ బ్రాహ్మణ యువతి. ఆయన ఆమెతో 'అమ్మా, నేను బ్రాహ్మణ వ్యతిరేకిని ఏ మాత్రం కాను, ఆధిపత్య భావజాలాలకు మాత్రమే వ్యతిరేకిని' అని చెప్పారు.

న్యాయం కోసం ఎవరినైనా ఎదరించగల దిట్ట ఆయన. తమ భావాల్ని ఎదుటి వారికి సౌమ్యంగా ఖచ్చితంగా చెప్పే కరకుతనం ఆయనది. శత్రుత్వంతో సమీపించినవారినైనా మిత్రులుగా మార్చే సరళతర ప్రవర్తన ఆయనది.

ఏ విషయాన్నీ కోపంగా, గట్టిగా చెప్పేవారు కాదు. ఎంతో నిదానంగా మాట్లాడడం ఆయన ప్రత్యేకత. ఈ ధర్మాలన్నీ సమపాళ్లల్లో పోత పోసిన వ్యక్తి తాపీ ధర్మారావు. తాపీవారికి పసితనం నుంచి తెలుగు సాహిత్యం అన్నా, విషయ జిజ్ఞాస అన్నా ఆసక్తి, అభిరుచి ఉండేవి. కానీ నాయన నర్సింగరావుగారు డాక్టరు. ఆంగ్లం అంటేనే ఇష్టం. ఆయనకి తమ పిల్లలు ఆంగ్లం బాగా చదివి గొప్ప వాళ్ళై పెద్దపెద్ద సర్కారు ఉద్యోగాలు చేయాలని ఆయన ఆశయం.

తెలుగు చదివితే ధర్మారావుగార్ని తిట్టేవారు ఆయన తండ్రి. నాయనగారు మేడ మీదకు వెళ్లే వరకు ఏ ఇంగ్లీష్ పుస్తకమో చదువుతున్నట్టు ధర్మారావుగారు నటించి, తర్వాత తెలుగులో పద్యాలు రాసుకునేవారు.

నాయనగారి పలుకుబడినిబట్టి తలచుకుంటే ధర్మారావుగారికి గొప్ప సర్కారు ఉద్యోగమే దొరికేది. కానీ ఆయనకది ఇష్టం లేదు. ఉన్నంతలో ఉపాధ్యాయ వృత్తే ఉత్తమం అని కళ్ళికోట రాజా కళాశాలలో లెక్కల మాష్టారుగా చేరారు. అప్పుడే కొందరు మిత్రులతో కలిసి 'వేగుచుక్క' గ్రంథమాలని స్థాపించారు (1910 –1911), విజ్ఞాన చంద్రిక గ్రంథమాల, ఆంధ్ర భాషాభి వర్ధిని సభ, తాకని విషయాలపై ఆంధ్ర వాఙ్మయ చరిత్రను 'తెలుగనెడు కాంత' స్వీయ చరిత్ర రూపంలో 'ఉషఃకాలము' అనే పేరుతో ప్రకటించారు. మొదటి డిటెక్టివ్ నవల 'వాడే –వీడు', మొదటి ఆంధ్రచరిత్ర నాటకం 'ప్రేమము' మొదలైన గ్రంథాలు వెలువరించారు.

1911 ఉగాది సంచికలో (ఆంధ్ర పత్రిక) 'ఆంధ్రులకు ఒక మనవి' అన్న వ్యాసం ప్రచురితమైంది. అదే వారి తొలి రచన.

గిడుగు రామ్మూర్తి పంతులుగారు తమ మిత్రుడు గురజాడ మరణానంతరం 20 సంవత్సరాలు తమ ప్రసంగాలతో ప్రజలలోకి జనం మాట్లాడే భాష యొక్క ప్రాధాన్యతని తీసుకెళ్ళి, దానిని ఒక భాషోద్యమంగా

కొనసాగించారు. ఆయన శిష్యులు ధర్మారావుగారు పుస్తకాలు, పత్రికలు, సినిమాల ద్వారా మాట్లాడే భాషని విశేషంగా ప్రజల్లోకి తీసుకెళ్ళారు.

*'ధర్మారావుగారు ఏనాటివాడో – తొలి నుంచి నలుగురు నడిచే దారిలో కాకుండా కొత్త దారులకోసం వెతికారు. అటు పాశ్చాత్య సాహితీ సంస్కృతులను, ఇటు జాతీయ సారస్వత సభ్యతను చక్కగా జీర్ణించుకొని, ఆధునిక దృక్పథంతో అపూర్వ రచనా సంవిధానంతో తన తావు తాను చూసుకుని, తన గొంతు తను వినిపిస్తూ, విశిష్ట వ్యక్తిత్వం వెలార్చిన మనిషి ఆయన.*

*నవ్యాతి నవ్య దృష్టితో సమాలోచించగల ధీశాలి. తెలుగు దిన పత్రికలల్లో తొలిసారిగా వ్యావహారిక భాషని ప్రవేశపెట్టిన సాహసి కూడా ఆయనే'. అన్నారు విద్వాన్ విశ్వంగారు.*

ఆయనకు ఎందరో శిష్యులు. అందరూ అదే తోవ పట్టారు.

గిడుగు వారి తర్వాత వ్యావహారిక భాషకి పెద్ద పీట వేసిన వారు ధర్మారావుగారు. సంపాదకుడిగా పత్రికల్లో వ్యావహారిక భాషకి పెద్దపీట వేయడమే కాకుండా చలనచిత్రాల వైపు ఆయన దృష్టి సారించడం మన అదృష్టం. మొట్టమొదట స్క్రీన్‌ప్లే రాయడం తెలియజెప్పినవారు ఆయనే. మనం బయట రాసే దానికీ సినిమాలకి కావల్సిన శిల్పానికి తేడా ఉందని గుర్తించి చెప్పారు. అలాగే సినిమాల్లో చక్కని వ్యావహారిక భాషనే వాడారు. ఈ కారణాల వల్ల వ్యావహారిక భాషకి ఎంతో మేలు జరిగింది. ధర్మారావుగారు జీవితాంతం వరకు తను నమ్మిన ధర్మాలనే మన అందరికీ అర్థమయ్యే భాషలో చూపిస్తూ సాగారు. గిడుగువారి చివరి రోజులలో చెన్నైకు తీసుకు వెళ్లినప్పుడు, ఆయన కోరిక మీదట గూడవల్లి రామబ్రహ్మంగారి కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందులో గిడుగు రామ్మూర్తిగారు చేసిన ప్రసంగం శాశ్వతంగా గుర్తుండిపోతుంది. *"యూనివర్సిటీలున్నూ ప్రభుత్వ విద్యాశాఖ వారున్ను మాత్రం ఇంకా అనుగ్రహించలేదు. 25 సంవత్సరముల క్రిందట ఈ రెండు సంస్థలవారున్నూ వాడుక భాషను గ్రహించవలెనని చూసినప్పుడు నా వాదం తెలుగువారు గ్రహించకపోవడం చేత అలజడి ఎక్కువయినది. అందుచేత ఆ సంస్థలవారు దానిని గ్రహించలేదు. ఇప్పుడు తెలుగువారు నా వాదనను గ్రహించిన వారుగనుక , ఆ సంస్థలవారు గ్రహించి ఆమోదించేటట్లున్నూ, ఆచరణలో పెట్టేటట్లున్నూ చేయవలసిన భారం మీది. ఆ పని మీకప్పగించి నేను విరమిస్తున్నాను – సెలవు"* అని తన కట్టకడపటి సందేశంగా ఆయన చెప్పారు.

ఆ సందేశాన్ని అందిపుచ్చుకుని తాపీ ధర్మారావుగారు చేసిన కృషి అనితర సాధ్యమైనది. వేంకటేశ్వర యూనివర్సిటీలో కమిటీ సభ్యుడుగా – వ్యవహారిక భాషను ఆమోదింపజేసే కృషిలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు.

అంతేకాదు 'ఏది రాతో ఏది రోతో వివరిస్తూ 'కొత్తపాళీ'లో ఆయన రాసిన కవిత రచయితలందరికీ మార్గదర్శకంగా ఉండిపోయింది. *"చదివిన విన్నా జనులందరికీ చక్కగ తెలిసితె రాతా/మెదడు చించుకొని నిఘంటులన్నీ వెదికించిందే రోతా" "వాడుక మాటల వల్లనే భావాల్ ప్రకటించిందే రాతా / పాడు ముష్టితో పెద్ద సమాసాల్ వాడిందైతే రోతా" "చిన్న మాటలనె గొప్పభావములు చెప్పగలిగితే రాతా / మిన్ను విరిగినట్లు ధ్వనించి భావం సున్న చుట్టితే రోతా"* (పూర్తి పాఠం అమ్మనుడి పత్రిక జూన్ 2018 –17వ పుటలో చూడండి)

## ఇంటిభాష పాఠశాల భాష కావాలి



**పి**ల్లలు చదువులో రాణించాలంటే విద్యాబోధన పరాయిభాషలో కంటే సొంతభాషలోనే జరగాలి. విద్యార్థికి మాతృభాషలో బోధన జరిగితే సబ్జెక్టు ఎక్కువ అర్థం అవుతుంది. అమ్మ చేతి స్పర్శలాగా, సొంత ఊరు ఓదార్పులాగా, నివసిస్తున్న ఇంటినీడలాగా, మాతృభాష పిల్లల గుండెను తాకు తుంది. అటువంటి ప్రసార మాధ్యమం ద్వారా సబ్జెక్ట్ చెప్పగలిగితే విద్యార్థికి అర్థం అవుతుంది. ఇందుకు భిన్నంగా మరో భాష ద్వారా విద్యాబోధన జరిగితే కృత్రిమ మార్గాన్ని ఎంచుకున్నట్లే.

విద్యాహక్కు (రైట్ టు ఎడ్యుకేషన్) కింద విద్యార్థులకు విద్యా సౌకర్యం కల్పిస్తున్నాం కాని, వాస్తవ విజ్ఞానార్జనకు కావలసిన పునాది ఇవ్వలేక పోవడానికి బోధనా భాష అవరోధంగా నిలుస్తోంది. దీన్ని గుర్తించిన అన్ని దేశాలు ప్రాథమిక విద్యాభ్యాసాన్ని మాతృభాషలో చేస్తుంటే మనం ఇంగ్లీష్‌ను ఆశ్రయించాం. అయితే ఇంగ్లీష్ నేర్చుకోవడాన్ని విస్మరించమనడం ఇక్కడ ఉద్దేశం కాదు. ఇంగ్లీషను ఒక భాషగా బోధించవచ్చు. ఆ నైపుణ్యాన్ని ఎంతైనా మెరుగు పర్చవచ్చు, కానీ భావనల రూప కల్పన దశలో మాత్రం బోధన ఇంటిభాషలోనే ఉండాలి. ఇటలీ, ఫ్రాన్స్‌ల్లో జరుగు తున్నదదే. ఇంగ్లీష్‌ను కేవలం నాలుగేళ్ళు మాత్రమే బోధిస్తారు. అయితే విద్యార్థి ఆ భాషలోనూ రాణిస్తున్నాడు. మౌలిక భావనల విషయంలోనూ పటిష్టమవుతున్నాడు.

ప్రాథమిక విద్యాభ్యాసం ఇంటిభాషలో జరిగిన తర్వాత ఉన్నత విద్యకు చేరిన దశలో బోధన విద్యార్థి స్వేచ్ఛకే వదిలేయవచ్చు. విద్యార్థికి జ్ఞానం వచ్చిన దశ కావడంతో అతడికి ఆసక్తి గల భాషను ఎంచుకుంటాడు.

ఆ కవితతో పాటే కొత్తపాళీలోనే ఆయన తన సందేశాన్ని ఈ విధంగా కవితాబద్ధం చేశారు. *"గొంతులో ఒక అగ్ని కొత్తగా రగిలింది / తంత్రులన్నీ ఒక్క పుంతలో పడ్డాయి / ఇంతింత అనరాని వింతబల మెచ్చింది / స్వార్థగానము మానరా / ఓ కవీ సార్థకానికి పూనరా / ప్రజల కవివై గొంతు రగిలించి పాడితే బక్కడొక్కలు రేగి ప్రణయమారుత మట్లు తక్కువెక్కువలెల్ల ఒక్క దెబ్బను కూల్చి లోకాల నూగించవా ఓ కవీ శోకాల తొలగించవా".*

ప్రజాస్వామ్యం, ప్రగతి ఆయన కోరుకున్న మార్గాలు. భాషలో ప్రజాస్వామ్యాన్ని ఆధునిక యుగ లక్షణంగా నమ్మి పత్రికా సినీ మాధ్యమాల్లో దానిని పూర్తిగా అమలు చేసి ప్రజలగొంతుకు బలాన్ని పెంచారాయన. అదే ఆయన జీవన సందేశం. అదే ఆయన మరణ వాఙ్మూలం.



Unfiled Notes Page 18

భాషోద్యమ కథానిక

విహారి
9848025600

# సింధువులో బిందువులు

బందరు నుంచీ మా బావమరిది పురుషోత్తం వచ్చాడు.

హైదరాబాద్‌లో చాలామంది బంధువులు.

సాయంత్రం నడకకి పార్కుకు వెళ్దామనే ప్రయత్నంలో ఉన్నాన్నేను. 'వస్తావా' అంటే రానని నవ్వాడు.

నా శ్రీమతి శారద కూడా నవ్వుతూ, "ఆయనకు సీరియలుంది. దాన్ని మిస్‌కాడు" అంది.

సంభాషణ టీవీ కార్యక్రమాల మీదికి పోయింది. నేనూ ఆగిపోయాను.

– సమయం కాగానే, ఆ ఛానెల్‌ని మార్చింది శారద.

రియాల్టీ షో! నృత్యమో, నర్తనమో, నాటకమో తెలియని విన్యాసాలు. ఇద్దరు యువతులు, నలుగురు యువకులు, టీనేజ్ వారు. ఒకరిని మించి ఒకరు ఊపుతున్నారు ఊగుతున్నారు, ఎగురుతున్నారు. ఎక్కుతున్నారు, కాళ్ళకింది నుంచీ దూరిపోతున్నారు. మొత్తానికి కిందామీదా పడుతున్నారు.

ఫోకస్ లైట్స్! రంగులు మారుతున్నై! హాలంతా వెర్రెక్కిపోతున్నది. ఈలలూ, చప్పట్లూ, నవ్వులూ...!

ముగ్గురు జడ్జిలు. ఇద్దరు నడివయస్సు స్త్రీలూ, ఒక పెద్దాయనా. మహిళాజడ్జిల్లో ఒకావిడ లేడీవిలన్‌గా సీరియల్స్ వేసివేసి , శరీరం సహకరించక ఆగిపోయింది. రెండో ఆవిడ ఇంకా సీరియల్స్ ఫీల్డ్‌లో ఉన్నది. పెద్దాయన ఎప్పుడో రచనలు చేసి రిటైరయిన ఉపాధ్యాయుడు.

మహిళా జడ్జిలిద్దరూ చాలా ఆనందిస్తున్నారు. పెద్దాయనేమో తెచ్చికోలు నవ్వుతో, ఆముదం తాగిన మొహంతో ఇబ్బంది పడుతున్నాడు.

'డాన్స్' అయింది! హాలు సంతోషాల ఎక్కిళ్ళతో కరకరలాడుతోంది.

ముందుగా యాంకర్ స్టేజిపైకి వచ్చింది. 'సాయంపెబా! నీ పెరపామెన్స్ అదిరింది" అని



"తెలుగు నేర్పటానికి ఉచిత సేవా కార్యక్రమం అది. స్థలం దొరికింది. విద్యాలయం వాళ్ళు శనిఆదివారాలు పెట్టుకోమన్నారు. టీవీల్లో పని చేసేవారూ, పని చేద్దామనుకునేవారూ, కళాకారులూ, సృజనకారులూ, సంగీతం నేర్చుకుంటున్న పిల్లలూ, ఇతర యువతీ యువకులూ...ఏ వయస్సు వారైనా సరే అర్హులే. శని ఆదివారాల్లో ఉదయం పదినుండి పన్నెండువరకూ – తెలుగు అభ్యాసం. చదవటం రాయటం."

ఒక యువతిని అభినందించింది.

పెద్దాయన మొహం చిట్లించాడు. "అబ్బబ్బ! అది స్వయంప్రభ తల్లీ! ఖూనీ... ఖూనీ" అనుకున్నాడు. పక్క వారికీ వినపడింది!

యాంకరిప్పుడు ఒక యువకుడి వైపు గెంతి 'రంజిత్ యూ ఆర్ గ్రేట్. బెస్ట్ టీమ్‌వర్క్!' అని భుజం తట్టింది.

అతను వంగి వంగి 'థాంక్స్' చెప్పాడు. చేతిలో మైకుంది.

యాంకరమ్మ 'ఇప్పుడు మన జడ్జెస్ ఏమంటారో విందాం' అని వారివైపు చూసింది. 'శ్రుతకీర్తి మేమ్' అన్నది- మీ అభిప్రాయం ఏమిటన్నట్టు.

శ్రుతకీర్తి – టీమ్‌ని నానా విధాలుగా మెచ్చుకుని మార్కులకార్డు చూపింది. పదికి పది!

ఇప్పుడు చంద్రభాగ మేమ్.

చంద్రభాగ – ఒకటి రెండు సూచనలిచ్చింది. "ఓవరాల్‌గా సూపర్బ్' అంటూ కార్డ్ చూపింది. తొమ్మిది!

"సార్ రంగనాథం గారూ? అన్నది యాంకర్.

పెద్దాయన వంతు వచ్చింది. చిత్రంగా నవ్వాడు. స్వయంప్రభ వైపు చూస్తూ 'బాగా చేశావమ్మా' అన్నాడు.

చప్పట్లు మరీ ఎక్కువ మోగినై.

'కానీ... నీ డ్రెస్ నీకు సహకరించినట్లు లేదు' అన్నాడు.

ఈలలు ఎక్కువైనై.

ఆ యువతి తనను తాను ఆపాదమస్తకం చూసుకుంది.

ఈలోగా శ్రుతకీర్తి 'ఫర్వాలేదులే మాష్టారూ" అంటే అట్టాంటివి మనం పట్టించుకుని కామెంట్ చేయకూడదు సారూ" అని దీర్ఘం తీసింది చంద్రభాగ!

"అలాగా' అన్నట్లు తల పక్కకి తిప్పి, "నీ పేరేమిటమ్మా!" అని ఇంకో యువతిని అడిగాడు రంగనాథం.

"దవలండి" చెప్పిందామె.

అర్థం కాలేదు. పక్కకి చూశాడు. వాళ్ళకీ అర్థం కాలేదు. పెదవి విరిచారు. "ఇంటిపేరా?" అంటే కాదన్నది ఆమె.

ప్రేక్షకుల్లోంచి ఎవరో అరిచారు "ధవళ" అండీ అని! అవునన్నట్లు తల ఊపింది ఆమె.

"ఓహో!" అని "దాని అర్థం తెలుసా అమ్మా?" అని అడిగేడు.

"తెలీదండి" అని కొంచెం విసుగుదల చూపిందామె.

యాంకర్ కలుగచేసుకుంది. "మాష్టారూ మార్కులు" అని గద్దించింది.

ఆయన నవ్వాడు. ధవళవైపు చూశాడు. "ఇట్టాగైతే ఎట్టాగమ్మా!" అని "దాని అర్థం స్వచ్ఛమైనది, తెల్లనిది అని" అన్నాడు.

'అఁహాఁ" అని దీర్ఘం తీసి సిగ్గుపడింది ధవళ.

రంగనాథం రంజిత్‌వైపు చూస్తూ "మీ వేగం చొరవా చాలా బాగున్నాయి" అని మెచ్చుకున్నారు.

రంజిత్ ఛాతీ నాలుగంగుళాలు పెరిగింది. చేతిలో మైక్‌ని పెదవుల దగ్గరపెట్టుకుని, సగం వంకరలు తిరిగి, వంగి వంగి, "థాంక్యూ సోమచ్‌సార్" అన్నాడు.

హాలు మళ్ళీ స్పందించింది!

"అవునూ- మీరు పాడిన పాట నాకు సరిగా తెలీలేదు. ఒకసారి సాహిత్యం వినిపించగలవా?"

"అంటే?" తెల్లమొహం వేశాడు రంజిత్. పక్కనున్న తన మిత్రుల్నీ చూశాడు. అందరూ పెదవి విరిచారు.

''అంటే – పాటలో అక్షరాలూ, వాక్యాలూ భాయ్" అని కొంచెం వ్యంగ్యస్వరంతో అరిచారెవరో.

"అదా!" అంటూ ఒక యువతి ముందు కొచ్చి రంజిత్ చేతిలోని మైకుని అందుకోబోయింది. ఈలోగా రంజిత్ కొంచెం కోపంగా "ఏంటిసార్, ఏవేవో అడుగుతున్నారు?" అని "అంతా బీట్‌సార్. దాన్నిబట్టి మా మూమెంట్స్ సెట్స్ చేసుకుంటాం" అంటూ "ఈ మాత్రం తెలీదా?" అన్నట్టు చూశాడు. మైక్‌ని ఆ యువతికి అందించాడు.

"నీ పేరు?" శ్రుతకీర్తి అడిగింది. "నవ్యప్రియ" అని "బిగినింగ్ వోన్లీ ఐనో సారూ?" అంటూ పాడింది. "వచ్చి...వచ్చి...అహ వచ్చి... వచ్చీ...వచ్చీ ఎయ్‌మాకురా...సచ్చి... సచ్చి... సచ్చి...నోడా...హాయ్...గుచ్చి... గుచ్చి...గుచ్చి సంపమాకురా" ఆమె పాటతో పాటూ ఈలలూ, చప్పట్లూ...వాయిద్యాలూ, ఆమె స్టెప్పూ అన్నీ కలగాపులగం, శబ్దకాలుష్యం, హోరూ... రొద....!

నవ్యప్రియని చేత్తో దగ్గరికి లాక్కుని "హాయ్ ఫైన్...నైస్" అంటూ హగ్ చేశాడు రంజిత్.

అందరూ మళ్ళీ చప్పట్లు కొట్టారు. ప్రేక్షకుల్లో నుంచీ ఎవరో పెద్దగా "మార్కులు?" అని అరిచారు. "మేగ్జిమమ్" అని అరిచారు మరికొందరు ప్రేక్షకులు.

శ్రుతకీర్తీ, చంద్రభాగా కూడా ముఖకవళికలు మార్చి, ఒకరి మొహాలొకరు చూసుకుని, "అబ్బే! ఇదెక్కడి తీర్పు?' అన్నట్టూ 'అసలీయనగారెక్కడ దొరికారు?' అన్నట్టూ యాంకర్ వైపు చూశారు.

యాంకర్ తన చేతిలోని మైక్‌ని ఆన్‌చేసి, "జడ్జిగారి ఒపీనియన్‌ని మనం యాక్సెప్ట్ చేయాలి. లైట్ తీసుకోకూడదు" అని సలహా ఇచ్చింది.

ఆమె నవ్వుతో చెట్టంతయింది. ఆ వెంటనే డ్రెస్‌ని సర్దుకుని లేచి వేదికనెక్కింది. టీమ్‌తో కలిసి 'స్టెప్స్' కొన్ని వేసింది.

'జడ్జెస్ అందరూ మాట్లాడతారు' – యాంకర్, మిగిలిన ఇద్దరూ కూడా వేదికమీదికి వచ్చారు. శ్రుతకీర్తి రెండు నిముషాలు తన కాలంలో ఇలాంటి 'షో'లు రానందుకు చింతించింది. చంద్రభాగ మళ్ళీ ఏమీ చెప్ప కుండా అందరికీ కలిపి 'యూఆర్ ఆల్ ఫ్యూచర్ స్టార్స్' అన్నది. కరతాళ ధ్వనులు. రంగనాథం గారు తన కంఠం విప్పారు. 'నాకు తెలీ కడుగుతాను. ఇది దాన్నా? అసలు దీని ప్రయో జనమేమిటితో మొదలుపెట్టి తెలుగు భాషని మంటగలుపుతున్నారని ఆక్రోశించాడు. ఒక్క వాక్యమైనా పూర్తిగా తెలుగులో చెప్పలేని రేపటి పౌరుల్ని పనికిరానివారుగా తయారుచేస్తున్న ఈ కార్యక్రమాల్ని నిషేధించాలి" అని గొంతెత్తి పలికాడు.

అటువైపునుంచీ – పీలగా ఎవరో 'అవునవు'నంటూ అరిచారు. ఎక్కువమంది 'ఆపండి ఆపండి' అని కేకలు పెట్టారు.

ఈలోగా టైమయిపోయింది. జరజరా పాక్కుంటూ ప్రకటన వచ్చేసింది. ప్రాయోజిత కార్యక్రమం!

పురుషోత్తం బావ 'బాగుంది.. బాగుంది' అంటూ 'అమ్మాయ్ ఇంకో కాఫీ కొట్టు... తాగి వెళ్తాను' అన్నాడు. శారద ఆ పనిలోకి వెళ్ళింది.

నేను నోరూరుకోక "ఆ రంగనాథం గారు నాకు తెలుసు. చాలా సాహిత్య సభలకు వస్తూ ఉంటారు. సంగీతంలో కూడా నిధి" అన్నాను.

"ఎంత ఘనుడైతేనేం. అలా బిహేవ్ చెయ్యకూడదు" అనేశాడు. నేను విస్తుపోయి చూశాను.

"అవును. న్యూట్రెండ్స్ తెలియవు. అసలలాంటి వాళ్ళని పిలవటం తప్పు" అని తేల్చేశాడు.

"మరి తెలుగుభాష ఇట్టా ఖూనీ కావలసిందేనా?" అన్నాను కొంచెం ఉద్వేగంతో.

"మీలాంటి వాళ్ళతో ఇదే చిక్కు రియా

లిటీని తెలుసుకోరు. అన్నీ జనరలైజ్ చేసి జనం మీద పడి ఏడుస్తారు" అన్నాడు. నాకు కడుపు రగిలిపోయింది.

"ఇప్పుడు నువ్ మాట్లాడేభాషే చూసుకో. మనం ఎంతగా ఇంగ్లీషులో కూరుకుపోయామో తెలుస్తుంది"

"ఏం ఫర్వాలేదు. మీరు ఉద్ధరించేదేం లేదు. వర్తి అరుపులే"

పెద్దవాడు. నేను అంతకంటే ఆయనతో వాదన పెట్టుకోలేను. ఆగిపోయాను. కాఫీలు వచ్చినై.

కాఫీ తాగి కదిలాడు పురుషోత్తం. ఆయనవెళ్ళిన తర్వాత శారద, నేనూ 'రియాల్టీ షో'లలో తెలుగు ఇంగ్లీష్ గురించీ, ఇంగ్లీష్ తెలుగు గురించిన చర్చలో పడ్డాము.

ఉన్నట్టుండి మధ్యలో ఆమె "ఉండండి నా 'సంగీతం' కార్యక్రమం వస్తుందివాళో" అంటూ టీవీలో ఛానెల్‌ని మార్చి, సర్దుకుని కూచుంది.

అప్పటికే 'పాట పాడనా... ' కార్యక్రమం మొదలైంది.

పాడుతున్న పదేళ్ళపిల్ల చూడముచ్చటగా ఉంది. ఆడంబరమైన ఆభరణాల్లో మెరిసి పోతోంది. పేరు వేశారు. పద్మజ. కెమేరా కార్యక్రమ నిర్వాహకుని పైకి మరలింది. ఆయన చాలా పేరున్న సినీ సంగీత దర్శకుడు. ఆయన పక్కగా రంగనాథం! ఆనాటి అతిథి!

ఆశ్చర్యపోయాను. రంగనాథం సంగీత నిధి కనుక ఇక్కడికీ ఆహ్వానించారన్నమాట!

"మీ మిత్రులు ఇక్కడా ఉన్నారు" అని నవ్వింది శారద.

పాట పూర్తయింది. శ్రోతలంతా లేచి కరతాళ ధ్వనులు చేశారు. అంత బాగా పాడింది – పద్మజ. నిర్వాహకుడు చాలాసేపు ఆమెని మెచ్చుకున్నాడు.

రంగనాథం నవ్వుతూ "సంగీతం నేర్చు కుంటున్నావు కదూ?" అని, చక్కని గాత్రం. బాగా సాధన చెయ్యి" అంటూ "క్షీరసాగర మథనం..." అను" అన్నాడు.

పద్మజకి వత్తులు పలకలేదు. "మధురం" అను– అని అడిగాడు. ఇక్కడా వత్తు రాలేదు.

"తెలుగుభాషకి నిజంగా వత్తులు తక్కువ. మనం సంస్కృతమయమై పోయాం. లేకపోతే ఆంగ్లమయం" అని ఆ పదాల స్వరూపాన్నీ, ఉచ్చారణనీ విశదీకరించాడు.

ఆ తర్వాత పాడిన పిల్లల్లోనూ, అక్క దక్కడా ఇలా గోచరించిన ఉచ్చారణ దోషాల్నీ, భాషాపరమైన అవస్థల్నీ సరిచేస్తూ కార్యక్రమాన్ని రక్తి కట్టించాడు–రంగనాథం.

గంటపైగా సాగి ముగిసింది. మేమూ రాత్రి ఉపాహారానికి లేచాము.

\+ + +

రెండు నెలల తర్వాత – ఒకరోజు, నేను ఉదయపు నడకనుంచీ తిరిగొచ్చి కూర్చున్న సమయంలో వచ్చాడు రంగనాథం.

చాలా ఆశ్చర్యపోయాను. ఇదే ఆయన మాఇంటికి మొదటిసారి రావటం. వెతుక్కుంటూ వచ్చాడట.

– కాఫీ తాగడం పూర్తయింది.

అప్పుడు మొదలెట్టాడు రంగనాథం, "నేను కొన్ని టీవీ ప్రోగ్రాములకి అతిథిగా వెళ్ళాను. మీకు తెలుసో తెలీదో?"

"ఒకటిరెండు చూశాను"

"వాటి అనుభవంతో నేను మానసికంగా బాగా దెబ్బతిన్నాను మాష్టారూ?" అని క్షణం ఆగి, "తెలుగుభాష చెడిపోతున్నదనీ, ప్రభుత్వం వారు ఏమీ చేయటం లేదనీ, అధికారులూ, ఉపాధ్యాయులూ తల్లిదండ్రులూ ఉదాసీనతతో పట్టించుకోవడం లేదనీ అందరూ ఆందోళనలు చేస్తున్నారు. కొన్ని కొన్ని సంస్థలు కొంత నిర్మాణాత్మక కార్యక్రమాలకీ పూనుకున్నారు"

"అయినా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది"

"నిజం. అందుకని నా వంతుగా నేనొక ప్రయత్నాన్ని మొదలెట్టాను".

ఏమిటన్నట్టు చూశాను. శారద వచ్చి వో పక్కగా నిలబడింది.

"తెలుగు నేర్పటానికి ఉచిత సేవా కార్యక్రమం అది. స్థలం దొరికింది. విద్యా లయం వాళ్ళు శనిఆదివారాలు పెట్టుకో మన్నారు. టీవీల్లో పని చేసేవారూ, పని చేద్దా మనుకునేవారూ, కళాకారులూ, సృజన కారులూ, సంగీతం నేర్చుకుంటన్న పిల్లలూ, ఇతర యువతీ యువకులూ...ఏ వయస్సు వారైనా సరే అర్హులే. శని ఆదివారాల్లో ఉదయం పదినుండి పన్నెండువరకూ – తెలుగు అభ్యాసం. చదవటం రాయటం."

"బాగుంది.మంచి ప్రయత్నం" నేనూ శారదా ఇద్దరమూ అన్నాము.

"దీని కోసం మీ వంటివారి సహకారం తీసుకుంటున్నాను. ఒక గంటలో వివిధ గ్రూపులవారికి ఏమేమి నేర్పాలో – ఒక సిలబస్ వంటిది తయారుచేశాము – నేనూ మరో నలుగురం కలిసి".

క్షణాల తర్వాత అడిగేడు, "మీ సహ కారం కావాలి. ఒక గ్రూపుని మీరు చూసుకుంటే మాకు సహాయం చేసిన వారవుతారు"

"తప్పకుండా" అన్నాన్నేను. "నేనూ వచ్చి చూస్తాను" అన్నది శారద.

"స్వయంగా చూస్తే, అవసరాన్ని బట్టీ, అభ్యర్థుల్ని బట్టీ మనం మన బోధన విషయాల్నీ, విధానాల్నీ కూడా నిర్ణయించుకోవచ్చు, మార్చుకోవచ్చు" అంటూ చాలా కాగితాల్నీ, వారు తయారు చేసిన చిన్న చిన్న పుస్తకాల్నీ చూపాడు.

"చాలా బాగుంది" అంటూ ఆనందిం చాము.

రంగనాథం శలవు తీసుకున్నాడు.

\+ + +

ఆ తర్వాతి శని, ఆదివారాలు నేనూ, శారదా రంగనాథం చెప్పిన విద్యాలయంకి వెళ్ళాము.

చక్కటి, చల్లటి వాతావరణం. ఏదో ఉత్సవం జరుగుతున్నట్టున్నది. వందమంది దాకా బాలబాలికలు. యువతీయువకులు, నడివయస్సువారు, పిన్నలతో వచ్చిన పెద్దలు!

విద్యాలయంలో ఒకటి రెండు అంతస్థులు వీరికిచ్చారు. మొత్తం నాలుగు గ్రూపులుగా క్లాసులు జరుగుతున్నాయి.

నావరకూ నాకయితే మనస్సూ– శరీ రమూ కూడా ఆహ్లాదంతో తేలిపోతున్నట్లుంది.

"వట్టి మాటలు కట్టి పెట్టోయ్/ గట్టి మేల్ తలపెట్టవోయ్!" గురజాడ గేయం నా చెవుల్లో మార్మోగుతుంది.

"ఈయన అమాయకుడిలా ఉన్నాడు గానీ, అసాధ్యుడే" అన్నది శారద.

"అవును. ఒక ఆశయానికి అంకితమైన ప్రతి మహనీయుడూ అసాధ్యుడే మరి" అన్నా న్నేను.

పిల్లలూ, పెద్దలూ బిలబిలమంటూ వెళ్తున్నారు. !!



Unfiled Notes Page 21

సాహిత్యరంగం



మధురాంతకం నరేంద్ర
9866243659

# పుస్తకము చేతన్ బూనితిన్...

**చిన్నపిల్లల మేధాశక్తిని పెంచదానికి పుస్తకాలే ముఖ్యమైన దోహదాలు. తల్లిదండ్రులు చాలామంది తమ పిల్లలకు యింగ్లీషు సరిగ్గా రావడం లేదనీ, వ్యాకరణం నేర్పమనీ వుపాధ్యాయుల దగ్గర మొర పెట్టుకుంటూ వుంటారు. పిల్లలను పుస్తకాలు చదవనివ్వకపోవడం మొదటి తప్పయితే, మాతృభాషలోని పుస్తకాల్ని పట్టించుకోకపోవడం యింకో తప్పు. కాలక్షేపం పేరుతో టీవీ కార్యక్రమాలు కాలక్షేపాన్నే కలిగిస్తాయి. అయితే కాలక్షేపం పేరుతో దగ్గరయ్యే పుస్తకాలు మనిషిని చైతన్య వంతుడ్ని చేస్తాయి. మార్కుల కోసమే పరిగెత్తే నేటి విద్యార్థులు యాంత్రి కంగా మారదానికి పుస్తక పఠనం లేకపోవడమే కారణం. గత పాతికేళ్ళుగా అనేక రకాల పరీక్షల్లో అగ్రశ్రేణిలో వుత్తీర్ణులైన అనేక మంది విద్యార్థులు తరువాతి కాలంలో యెలా తయారయ్యారో పరిశీలిస్తే సమ గ్రమైన ఎదుగుదల యెంత అవసరమో, దానికి పుస్తక పఠనమెంతగా వుపయోగ పడుతుందో అర్థమవుతుంది.**

**1970**ప్రాంతాల్లో నేను వున్నత పాఠశాల విద్యార్థిగా వుంటున్న రోజుల్లో మా యింటికి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక అనే వార పత్రికలూ, జ్యోతి, యువ అనే మాసపత్రికలూ వచ్చేవి. పది పది హేనిండ్లుండే మా చిన్న వీధిలో, దాదాపు ప్రతి యింటిలో చదువుకుం టున్న పిల్లలుండేవాళ్లు. వాళ్ళలో ఆడపిల్లలే యెక్కువ. పత్రిక వచ్చీ రాకముందే వాటిల్లో తాము చదువుతున్న సీరియల్ నవలల కోసం వొకరికంటే ముందుగా వొకరు చదివేయడం కోసం పోటీ పడుతూ వుండేవాళ్ళు. మా వీధిలోనే పది, పదకొండు తరగతులతోనే చదువులు చాలించి, బాధ్యత తెలియకుండా తిరిగే యువకులిద్దరు ముగ్గురుండే వాళ్ళు. వాళ్ళు చెప్పే పనుల్ని చేస్తూ వాళ్ళ ఆంతరంగిక మిత్రులవగలిగే వాళ్ళకు వాళ్ళు రహస్యంగా యెర్రంచులుండే జానెడు పొడుగు పుస్తకాలను యిచ్చేవాళ్ళు. దేశాలనే సర్వనాశనం చేయాలనుకునే దుర్మార్గులూ, వాళ్ళను వెతికి పట్టి శిక్షించే గూఢచారులూ వుండే రకరకాల రహస్య పరిశోధనల నవలలవి.

1972లో కాలేజీ చదువుకోసం తిరుపతికి రాగానే రాజభవనా ల్లాంటి గ్రంథాలయాలు పరిచయమయ్యాయి. ప్రతిసారీ మూడు నాలుగు పుస్తకాల చొప్పున గదికి తెచ్చుకుని నిర్ణీత గడువులోపల తిరిగిచ్చేయాలి. కాలేజీ హాస్టల్లో విద్యార్థులు కొందరు మరీ రహస్యంగా కొన్ని పుస్తకాల్ని చదవడం గమనించాను. చాలా నమ్మక పాత్రమైన వ్యక్తికిగానీ వాళ్ళా పుస్తకాల్ని యిచ్చేవాళ్ళు కారు. తీరా ఆ పుస్తకాల్ని చదవగలిగే అవకాశం దొరికినప్పుడు అంతవరకూ తెలియని చీకటి ప్రపంచమొకటుందని తెలిసి వచ్చింది. యెక్కడో రహస్యంగా ప్రచురణై, యే చీకటికొట్లలోనో అమ్ముడై, తమకు కావలసిన ప్రత్యేక మైన పాఠకుల్ని అలరించే ఆ శృంగార పత్రికలు పదనైదు, పదహారేళ్ల కుర్రాళ్ల పైన యెటువంటి ప్రభావాన్ని చూపెట్టి వుంటాయో తెలుసు కోవడం కష్టంగాదు.

1975 వ సంవత్సరం వచ్చేసరికి నగరంలో ప్రతి వీధికీ బాడుగ పుస్తకాల అంగళ్ళున్నాయని తెలిసింది. అన్ని వార, మాస పత్రికలూ, నవలలూ రోజుకింత అని అద్దెకిచ్చే అంగళ్ళవి. అవెప్పుడూ పాఠకులతో కిటకిటలాడుతుండేవి. ప్రాచుర్యముండే సీరియళ్లను ప్రచురించే వార పత్రికలు కావాలంటే వారాలపాటూ నీరీక్షించాల్సి వుండేది. కొన్ని ప్రాచుర్యముండే నవలలు పాఠకుల చేతుల్లో నలిగినలిగీ జీర్ణావస్తకు చేరేవి. బాగా పరిచయం పెరిగాక అస్మదీయులైన వినియోగదారుల కోసం బాడుగ పుస్తకాల యజమాని తన నేలమాళిగలోంచీ రహస్య శృంగార సంచికల్ని తీసిచ్చేవాడు.

దూరదర్శన్ 1959లో ప్రారంభమైనప్పటికీ అది సామాన్యుల వరకూ రావడం 1980 ప్రాంతాల నుంచీ మొదలయ్యింది. 1983లో ప్రపంచ క్రికెట్ పోటీ, 1998లో మహాభారతం సీరియల్ దూరదర్శన్‌లో ప్రసారమయ్యే రోజుల్లో ప్రేక్షకులంతా టీవీల ముందు అతుక్కుపోవడం అందరికీ తెలుసు. దూరదర్శన్‌లో చిత్రసీమ, చలన చిత్రాలు ప్రసార మయ్యేటప్పుడు నగరాల్లో వీధులు కూడా ఖాళీగా కనిపించేవి. 1991లో దూరదర్శన్‌లోకి ప్రభుత్వేతర ప్రసార సంస్థలు వచ్చిన తర్వాత క్రమంగా పాఠకుల సంఖ్య తగ్గడం ప్రారంభమయ్యింది.

గతంలో పత్రికలు బాగా ప్రాచుర్యంలో వున్న రోజుల్లో, పాఠకుల సంఖ్య బాగా యెక్కువగా వున్నప్పుడు గూడా మంచి సాహిత్యాన్ని చదివే వాళ్ళు బాగా తక్కువనీ, పాఠకుల బలహీనతలను వుపయోగించుకునే నాసిరకం సాహిత్యానికే యెక్కువ గిరాకీ వుందనీ విమర్శకులు చెబు తుండేవాళ్ళు. టీవీ సీరియళ్లకు తరలిపోయినవాళ్ళు ఆ నాసిరకం పాఠకులేననీ, వాళ్ళు టీవీలకు వలసపోయినందువల్ల సాహిత్య రచనల కొచ్చే యిబ్బందేమీ వుండదనీ గూడా వాదించారు. వ్యాపార రచనలు చేసే రచయితలు కొందరు ప్రాప్త కాలజ్ఞులైపోయి, కాల్పనికేతర రచన లకు మొగ్గేశారు. యీ సంధికాలంలో ప్రముఖ పత్రికలు ఆంధ్రపత్రిక, భారతి మూత పడడంతో సాహిత్య పత్రికల పతనం ప్రారంభమయ్యింది.

పాఠకుల సంఖ్య గణనీయంగా పెంచడానికి వ్యాపార రచనలూ, సాధారణ పాఠకుల్ని అలరించే అపరాధ పరిశోధన, శృంగార రచనలూ దోహదం చేస్తాయని చరిత్ర చెబుతోంది. ప్రతిపాఠకుడూ తొలిదశలో అటువంటి పుస్తకాలే చదువుతాడనీ, అతడు యెదిగే కొద్దీ వున్నత ప్రమాణాలుండే పుస్తకాల వైపు మొగ్గుతాడనీ అనుకుంటూ వుంటాం. అయితే యిలా యెదుగుతూ వుత్తమ పాఠకులయ్యే వ్యక్తుల శాతం చాలా తక్కువే గావచ్చు. గతంలో ఆ తక్కువ శాతం పాఠకుల సంఖ్య కూడా బాగా గణనీయంగా వుండేది. యిప్పుడు అన్ని రకాల పాఠకులూ తగ్గిపోయారు.

పాఠకుల సంఖ్య తగ్గడానికీ, టీవీ ప్రేక్షకుల సంఖ్య పెరగడానికీ కారణాలు మానవ స్వభావంలోనే వున్నాయి. పుస్తకం చదవడమన్నది

కాల్పనికమైనపని. పాఠకుడు గూడా పఠనంలో చైతన్యవంతమైన బాధ్య తను పోషించి తీరాలి. అయితే టీవీ చూడడంలో అటువంటి చైతన్య వంతమైన అప్రమత్తత అవసరం లేదు. టీవీ తెరముందు కూర్చుని హృదయాన్నీ, మేధస్సునూ దానికే అప్పగించి, నిర్మోహంగా, నిస్తేజంగా కాలహరణం చేయడంలో మానవుడికుండే ఆనందం చైతన్యవంతమైన పుస్తక పఠనంలో వుండదు. యీ రెండింటికీ మధ్య వుండే తేడాను గ్రహించగలిగిన వారే పుస్తక పఠనంలో వుండే గొప్పతనాన్ని గుర్తించ గలరు. అయితే ఆ స్థితిని చేరగలిగే వ్యక్తులు తక్కువగావడంచేతనే పుస్తక పఠనం తగ్గిపోతోంది.

పుస్తకం మనిషి మేధస్సుకు సవాలుగా యెదుగుతుంది. అదే పుస్తకాన్ని యెంత గొప్పగా దృశ్యమాన మాధ్యమంగా మార్చినా ఆ పుస్తకానికున్న గొప్పతనం ఆ మాధ్యమానికి రాదు. మహాభారతాన్ని చదివినప్పుడు అది పాఠకుని మానస ప్రపంచంలో వికసించే తీరుముందు యెంత గొప్ప చలన చిత్రమైనా, మరేయితర ప్రదర్శన అయినా దిగదుడుపే అవుతుంది. ప్రపంచంలోని గొప్ప పుస్తకాలనంతా యిన్నిసార్లు నాటకాలుగా, చలన చిత్రాలుగా, టీవీ సీరియళ్లుగా మలచినా వాటికున్న మహత్యం యే మాత్రం తగ్గకుండా నిలచి వుండడానికిదే కారణం.

నాశనం కానిదాన్ని 'అక్షరం' అనడం, 'తల్లీ నిన్నుదలంచి పుస్తకం చేతన్ బూనితిన్' అని పుస్తకాన్ని సమస్త విజ్ఞానాలకీ భూమికగా గుర్తించడానికీ వున్న గొప్ప సంప్రదాయ సత్యాన్నిప్పుడు గుర్తించాల్సిన తరుణం వచ్చింది. సాంకేతికంగా యెంత ప్రావీణ్యతను పొందినా, సినిమా, టీవీల వంటి సాధనాలు పుస్తకానికి అనుయాయులేగానీ, ప్రత్యామ్నాయాలు కాలేవని యిప్పటికైనా గ్రహించాలి.

యిప్పుడు గూడా యింగ్లీషులో పాఠకుల సంఖ్య బాగానే వుంది. మనదేశంలో వుండే యే పుస్తకాల అంగడికెళ్లినా అక్కడ వుండే అన్ని భారతీయ భాషా పత్రికలకంటే యింగ్లీషు పత్రికలే యెక్కువగా కనిపిస్తాయి. అన్ని విమానాశ్రయాల్లోనూ యాత్రికులు వందల, వేల పుటలుండే లావుపాటి యింగ్లీషు పుస్తకాలను చదువుతూ కనిపిస్తారు. అయితే ఇంగ్లీషుతోబాటూ యితర భారతీయ భాషలన్నింటితోనూ పోల్చినప్పుడు తెలుగులోనే పాఠకులు బాగా తక్కువగా వుండడం గమనించాలి. దేశస్థాయి, రాష్ట్రస్థాయి పుస్తక ప్రదర్శనలు జరిగినప్పుడు అన్ని భాషల పుస్తకాల కంటే తెలుగులోనే తక్కువ పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. దీనికి ప్రధానమైన కారణం తెలుగు రాష్ట్రాల్లో విద్య మాతృభాషలో కాకుండా, యింగ్లీషులోనే జరగడం.

ప్రపంచ విజ్ఞానమంతా యింగ్లీషులోనే వుందనీ, ఆధునిక పోటీ ప్రపంచంలో నిలబడగలగాలంటే యింగ్లీషు మాధ్యమంలోనే విద్య వుండాలనీ ప్రభుత్వాధినేతలు నొక్కి చెబుతూంటారు. యింగ్లీషులో కాకుండా తమ మాతృభాషలోనే చదువుకునే చైనా దేశీయులు యీ పోటీలో ముందే వున్నారు. అమెరికాలో చదువుకునే చైనీయులు యింగ్లీషులో పాఠాలు అర్థం చేసుకోకపోయినా, వాళ్ళ మాతృభాషలో వున్న పుస్తకాల్ని చదువుతూ యెప్పటికప్పుడు అగ్రశ్రేణిలోనే వున్నారనీ అక్కడి అధ్యాపకులు చెప్తారు. దానికి కారణం ప్రపంచంలో యెప్పటి కప్పుడు వస్తున్న విజ్ఞానాన్నంతా తమ మాతృభాషలోకి అనువదించి ప్రచురించుకునే సంస్థల్ని అక్కడి ప్రభుత్వాలు నిర్మించి, ప్రోత్సహిం చడమే! యిటువంటి అనువాద సంస్థల్ని గురించి యింతవరకూ మన ప్రభుత్వాలు ఆలోచించనైనా లేదు.

ప్రతి పాఠశాలలోనూ ఒకప్పుడు గ్రంథాలయానికొక ప్రత్యేక మైన పీరియడ్ వుండేది. ఆ సమయంలో విద్యార్థులకు పుస్తకాలనిచ్చే వారు. కొన్ని పాఠశాలల్లో ప్రత్యేకమైన సాహిత్య సంఘాలుండేవి. వాళ్ళు క్రమం తప్పకుండా సాహిత్య సమావేశాలు జరిపేవాళ్ళు. కొన్ని మంచి పాఠశాలల్లో విద్యార్థులు తాము చదివిన పుస్తకాల గురించీ, తమకు నచ్చిన రచయితల గురించీ చర్చలు జరిపేవాళ్లు. పిల్లల్లో పఠనాసక్తిని పెంచే యిటువంటి కార్యక్రమాలకు యికనైనా పాఠశాలలు పూను కోవాలి.

చిన్నపిల్లల మేధాశక్తిని పెంచడానికి పుస్తకాలే ముఖ్యమైన దోహదాలు. తల్లిదండ్రులు చాలామంది తమ పిల్లలకు యింగ్లీషు సరిగ్గా రావడం లేదనీ, వ్యాకరణం నేర్పమనీ వుపాధ్యాయుల దగ్గర మొర పెట్టుకుంటూ వుంటారు. పిల్లలను పుస్తకాలు చదవనివ్వకపోవడం మొదటి తప్పయితే, మాతృభాషలోని పుస్తకాల్ని పట్టించుకోకపోవడం యింకో తప్పు. కాలక్షేపం పేరుతో టీవీ కార్యక్రమాలు కాలక్షేపాన్నే కలిగిస్తాయి. అయితే కాలక్షేపం పేరుతో దగ్గరయ్యే పుస్తకాలు మనిషిని చైతన్య వంతుడ్ని చేస్తాయి. మార్కుల కోసమే పరిగెత్తే నేటి విద్యార్థులు యాంత్రి కంగా మారడానికి పుస్తక పఠనం లేకపోవడమే కారణం. గత పాతికేళ్ళుగా అనేక రకాల పరీక్షల్లో అగ్రశ్రేణిలో వుత్తీర్ణులైన అనేక మంది విద్యార్థులు తరువాతి కాలంలో యెలా తయారయ్యారో పరిశీలిస్తే సమ గ్రమైన ఎదుగుదల యెంత అవసరమో, దానికి పుస్తక పఠనమెంతగా వుపయోగ పడుతుందో అర్థమవుతుంది.

అమెరికాలోని అనేక నగరాలకు వెళ్లినప్పుడూ, యితర దేశాలను చూసినప్పుడూ అక్కడ గ్రంథాలయాలకున్న ప్రాముఖ్యత వెల్లడవుతుంది. ప్రతి నగరంలోనూ పెద్దదీ, అందమైనదీ అయిన భవనం గ్రంథాలయమే అయి వుంటుంది. దానిలో దాదాపుగా దొరకని పుస్తకాలుండవు. దొరకని పుస్తకాలను యితర గ్రంథాలయాల నుంచీ తీసుకొచ్చి పాఠకుల కిచ్చే సౌలభ్యం కూడా వుంటుంది. అక్కడి పుస్తకాల అంగళ్లు గూడా గ్రంథాలయాల్లాగే వుంటాయి. కొందరైతే అక్కడే కూర్చుని వుచితంగా పుస్తకాలు చదువుకుంటూ వుంటారు. కొన్ని పుస్తకాల అంగళ్ళు గొప్ప సాంస్కృతిక కేంద్రాలుగా గూడా వుంటాయి. అక్కడ అప్పుడప్పుడూ సాహిత్య సమావేశాలు గూడా జరుగుతాయి. 'రైటర్స్ కార్నర్' అనే ప్రత్యేక స్థలంలో రచయితల్ని కలుసుకునే వీలుగూడా వుంటుంది. రచయితలు సంతకం చేసిన పుస్తకాల కోసం పాఠకులు యెగబడుతూ వుంటారు.

యింత గొప్పగా గాకపోయినా నా చిన్నతనంలో అన్ని వూర్లలో వో మాదిరి గ్రంథాలయాలుండేవి. జిల్లా కేంద్ర నగరంలోని గ్రంథా లయం యెప్పుడూ పాఠకులతో వెలిగిపోతూ వుండేది. ఆ రోజుల్లో కొన్ని లిఖిత పత్రికలు గూడా వుండేవి. యే చిన్న పత్రికలో రచన వచ్చినా చదివి గుర్తుంచుకునే పాఠకులుండేవాళ్ళు. యిప్పుడు తెలుగు

**తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకై చట్టాన్ని వెంటనే తేవాలి**

రాష్ట్రాల్లోని గ్రంథాలయాలు దాదాపుగా శిథిలాలయాలుగా మారిపోయి వున్నాయి.

విద్య, పుస్తకాలు, గ్రంథాలయాల వంటి అంశాలు లాభకరమైనవిగావని యిప్పటి ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అనేక రంగాల్లో ప్రజాధనం దుర్వినియోగమవుతున్న తీరును గమనిస్తున్నప్పుడు యీ నిర్లక్ష్యం మరింత విషాదకరమని గుర్తించి తీరతాం. ఆరేడేళ్ళకు పూర్వం "రాజా రాంమోహన్‌రాయ్ ఫౌండేషన్' పేరుతో ప్రభుత్వాలు కేంద్రం నుంచీ సొమ్ముతో కొన్ని పుస్తకాలు యెన్నిక జేసి, వందల సంఖ్యలోకొని, గ్రంథాలయాలకు సరఫరా చేసేవి.

తమిళ, కన్నడ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరమూ ఆయా భాషల్లో ప్రచురించబడే పుస్తకాలను రెండు మూడు వందల ప్రతుల వరకూ కొని గ్రంథాలయాలకు పంపిణీ చేస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాల్లోని గ్రంథాలయాలు చితికి పోయాయి. మలయాళంలో యిప్పుడు గూడాయే పుస్తకమైనా ప్రథమ ముద్రణ కనీసం అయిదువేల ప్రతులుంటాయి. ప్రసిద్ధమైన వో గ్రంథాన్ని రాసిన రచయిత దాని ద్వారా వచ్చే ఆదాయంతో జీవించడం గూడా సాధ్యమేనంటారు. రెండు రాష్ట్రా ల్లోనూ కలసి దాదాపు తొమ్మిది కోట్ల మందీ, రాష్ట్రాల కవతల మరో తొమ్మిది కోట్ల మందీ, వెరశీ 18 కోట్ల వరకూ వున్న తెలుగు ప్రజల భాషలో యిప్పుడు ప్రసిద్ధ రచయితలూ, కవులూ గూడా 500 ప్రతులు వేయడం గూడా భారమేనను కుంటున్నారు.

**తన ప్రసిద్ధమైన గ్రంథం "వాల్డన్"లో ప్రముఖ అమెరికన్ రచయిత తోరో షేక్స్ పియర్, మిల్టన్ రచనలకంటే ముఖ్యమైన వార్తా పత్రికలేముంటాయని ప్రశ్నిస్తాడు. మానవ విజ్ఞానమంతా పుస్తకాలలోనే వుంది. యెన్ని సాంకేతిక విప్లవాలు వచ్చినా పుస్తకానికి మాత్రం ప్రత్యామ్నాయ ముండదు. పాఠకుల సంఖ్య తక్కువగా వుందంటే ఆ జాతి సాంస్కృతికంగా తక్కువ స్థాయిలో వుందనే అర్థం. యిప్పటికైనా విద్యార్థులూ పాఠకులూ తల్లిదండ్రులూ వుపాధ్యాయులూ ప్రభుత్వాలు మేలుకుని పాఠకుల సంఖ్యను పెంచుకోక పోతే యే రంగంలోనైనా పురోభివృద్ధి సాధ్యం కాదు.**

కవిత

# పూలు సుగంధాలనే విరజిమ్మాలి

సముద్రం అల్లకల్లోలమవుతోంది
అనంతమైన కల్మషంతో కొట్టుమిట్టాడుతోంది
భూమి వేడెక్కి బీటలు వారుతోంది
రోడ్లతారు కరిగిపోతోంది
అంతా నిర్మానుష్యం
భానుడు నడిరోడ్డుమీద నిద్రిస్తున్నాడు
కుళాయిలో వస్తున్న నీరు కూడా
కాలిపోతోంది

మత్తుపానీయాలు కాలేయానికి
చిల్లులు వేస్తున్నాయి
మనిషి ఏదో ఒక మత్తులో
బ్రతకాలని చూస్తున్నాడు
తన్నుతాను మోసం చేసుకొంటున్నాడు,
డ్రగ్స్ తీసుకొన్నవారు
ఇంద్రలోకాల్లో తిరుగుతున్నారు
ఆడా మగా అంతా పబ్బుల్లో గంతులేస్తున్నారు
గుక్కగుక్కకి కిక్కెక్కి తూలిపడిపోతున్నారు
యుక్త వయస్సులోనే
ఓడ్కాలు, విస్కీలతో శరీరాన్ని
విషపూరితం చేసుకొంటున్నారు
సంతానోత్పత్తి సామర్థ్యాన్ని
విచ్ఛిన్నం చేసుకొంటున్నారు
శని, ఆదివారాలంటే వినోదించే రోజులా!
జీవితానికి నిర్మాణం లేదా!
ఎవ్వరితో జీవితం పంచుకొంటున్నారో
వారి మీద నమ్మకం లేదు
జీవితం పంచుకొనే వారు ఒకరు
పెళ్ళి మరొకరితోనా?!
సంపదను పెంచుకోవడానికి
శరీరాన్ని ఫణంగా పెట్టడం ధర్మమా!
ఖండాంతరాలు దాటి షాపింగ్ లెందుకు?
జీవితం ధ్వంసం అయ్యాక
బంగారం ఎంత వుంటే ఏమిటి?
ఎన్ని సుఖాలు పొందినా
ఏదో 'ఫ్రస్టేషన్' లో బ్రతుకుతున్నారు
మానసిక రోగాలు పెరుగుతున్నాయి
మత్తు పోగొట్టే సెంటర్లు పెరుగుతున్నాయి

గ్రంథాలయ సంస్కృతిని ధ్వంసం చేశారు
జ్ఞాన జ్యోతులను ఆర్పేస్తున్నారు
నాలుగు అక్షరాలు బట్టీ పడట్టడం
చదువు అంటున్నారు
ప్రతి మనిషిలో ఓ వివేచన ఉంటుంది
దానికి పదును తగ్గుతోంది
ధనం పెరిగే కొద్దీ వ్యసనాలు పెరుగుతున్నాయి
వేర్లు బలహీనంగా ఉండి
చెట్లు కూలుతున్నాయి.
నదుల నడిబొడ్డులో విషం పారుతోంది
పూలు కూడా దుర్గంధాన్నే చిమ్ముతున్నాయి
సందిగ్ధంలో మనుషులు బ్రతుకుతున్నారు
ఎవరిమీదా నమ్మకం లేదు
ఏ విషయం మీదా సమగ్రత లేదు
ఏ విషయాన్నీ వినే అలవాటు లేదు
ఏ అంశాన్నీ తేల్చుకోలేరు
మనుషులు ద్వంద్వత్వంలో వున్నారు

నిజమే! మరో ప్రక్క
చైతన్యం వెల్లి విరుస్తోంది
హిమాలయాలను
అలవోకగా ఎక్కుతున్నారు
సామర్థ్యానికి నిరంతరం
పదును పెడుతున్నారు
కక్షా, కార్పణ్యాలను దాటి
కారుణ్య సముద్రులవుతున్నారు
సేవా సంస్కృతితో
ఉజ్వల భవితవ్యానికి దారులు నిర్మిస్తున్నారు
అవును! ఎప్పటికైనా మనిషే విజేతక!
మానవత్వమే జీవన సత్యం
పూలు సుగంధాలనే విరజిమ్మాలి...
అప్పుడే మనిషి ప్రకృతికి వికాసం

డా॥ కత్తి పద్మారావు
9849741695

ధారావాహిక

# మౌనంలోని మాటలు

(9)

**సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ**


కన్నడ మూలం:
**డా. ఆర్. వి. బి. కుమార్**

తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**
9059779289




**కూతురు పుట్టుక :**

**నేను** రెండవ పెళ్ళి చేసుకున్నాను. పెళ్ళి చేసుకున్న సంవత్సరానికి సరిగ్గా కూతురు పుట్టింది. మా సముదాయానికి చెందిన ఆడపిల్లలు సామాన్యంగా గర్భవతులు అవుతే డాక్టర్ దగ్గరకు వెళ్ళటం అరుదు. వాళ్ళు తమకు తెలిసిన నాటుమందులు తయారు చేసుకుంటారు. అయితే నా రెండవ భార్య గర్భవతి అయినపుడు నా కన్నా ఎక్కువగా సంతోషపడింది నా మొదటి భార్య. ఆమె డాక్టర్ దగ్గరికి నా రెండవ భార్యను తీసుకుని పొమ్మని పోరు పెట్టింది. మొదటి భార్య పోరుపెట్టడంతో గర్భవతి అయిన రెండవ భార్యను డాక్టర్ దగ్గరికి పిల్చుకుని పోయాను. డాక్టర్ అంటే ఊరికేనా? ఆ టెస్ట్ ఈ టెస్ట్ అని డబ్బు పీక్కోవటమే కదా !

కాన్పు రోజు దగ్గర పడినపుడు గంగావతికి పిల్చుకునిపోయాను. డాక్టర్ అడ్మిట్ చేసుకున్నాడు. అడ్మిట్ చేసుకున్న రెండు రోజులకు తల్లి కడుపు కోసి బిడ్డను బయటికి తీయాలన్నాడు. నాకు ప్రాణాలే పోయినట్టయ్యాయి. ఆపరేషన్ అంటే నాకేమో భయం ! మేము ఎంతైనా బిచ్చం అడగటానికి చెయ్యి కోసుకుని రక్తంకార్చి బిచ్చం అడిగేవాళ్ళం. చెయ్యి కోసుకోవటం మాకు సాధారణమైన విషయం. కోసుకున్న చేతికి ఇంటికి వచ్చిన తరువాత గుంటగలగరాకు రసం పిండుకుని, వాటి ఆకులు కట్టుకుంటే రక్తం నిలిచిపోయి నెమ్మదిగా గాయం మానిపోయేది. మరుసటి రోజు బిచ్చం అడిగే సమయానికి మరో చోట చెయ్యి కోసుకునేవాళ్ళం. అయితే కడుపు కోయటం మాకు కొత్త. ఏ పిల్లలు వద్దు. ఇంటికి వెళ్ళిపోదామని నిర్ణయించుకున్నాం.

ఆ సమయంలో నాలో ధైర్యం నింపింది నా మొదటి భార్య. "ఏమీ కాదు ఊరుకో, డాక్టర్ ఉన్నాడు ! ఆయనే అంతా సూసుకుంటాడు" అని చెప్పింది.

మనస్సుకు కొంచెం నెమ్మది కలిగింది.

అందులో ఆపరేషన్ అంటే ఊరికేనా? మాలాంటి పేదవాళ్ళు ఎక్కడి నుంచి డబ్బు సమకూర్చుకోవాలి? భయం వేసింది. చివరికి నా పెళ్ళికి దండన కట్టడానికి డబ్బు ఇచ్చిన ఫ్రాన్సిస్ దగ్గరికి వెళ్ళి వడ్డీకి డబ్బు ఇప్పించుకుని వచ్చాను. ఆపరేషన్ జరిగింది. కూతరు పుట్టింది. భార్య ఆరోగ్యవంతురాలైంది.

కూతురు పుట్టి నా పురుషత్వాన్ని రుజువు చేసింది !

నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు !!

**టీ తాగిన కథ :**

మొన్న 2013లో మునిసిపల్ ఎలెక్షన్‌లో జరిగిన సంఘటన ఇది !

ఆ రోజు పొద్దున్నే ఓటు వేయడం కోసం వరుసలో నిలబడ్డాను. ఎవడో ఒకడు టీ ఇచ్చే కుర్రవాడు అటుగా వచ్చాడు. లోపల రాసుకోవడానికి కూర్చున్న వాళ్ళకంతా టీ ఇచ్చాడు. వరుసలో నేను నిలబడివున్నాను. ఎందుకో టీ పిల్లవాడు నాకూ టీ ఇచ్చాడు. అతను నాకు టీ ఎందుకు ఇచ్చాడో నాకు తెలియదు. ఓటు వేయడానికి నా వంతు కోసం నిలబడిన నాకు అప్పటికే తలనొప్పెడుతూ ఉంది. టీ ఇస్తుండగా ఎందుకు? ఏమిటి అని అడగకుండా టీ తీసుకుని తాగసాగాను.

అదే సమయంలో ఎవరో సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చాడు.

అతని పేరు ఆనందో ఏమో? నాకు తెలియదు.

రాగానే టీ తాగుతున్న నన్ను చూసి, "ఏనా కొడుకు టీ ఇచ్చాడ్రా లమ్డికే" అని తిట్టాడు.

నాకు చాలా అవమానంగా అనిపించింది. నేను అడగకపోయినా ఆ కుర్రవాడే టీ ఇచ్చాడు. నేను తాగాను. ఇందులో నా తప్పేముంది?

నేను ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఉన్నంత ఎత్తు ఉన్నాను. ఒకవేళ అలా ఉండటం కారణమా?

లేదా నేను చదువుకోకపోవటం కారణమా?

ఇప్పటికీ నాకు అర్థం కాలేదు.


ఆ మనిషి నన్ను తిట్టడానికి కారణం ఏమైవుండొచ్చని ఎంత ఆలోచించినా ఇప్పటికీ కారణం తెలియలేదు.

చదువులేని వాళ్ళకు మానం-మర్యాద ఉండవా?

అదీ అర్థం కాలేదు !

**సంచారి శవసంస్కారం :**

గతంలో మా నాన్న నా భార్య అమ్మమ్మను



భుజం మీద మోసుకుని పోయి శవసంస్కారం చేసిన కథ చెప్పాను.

అలాంటిదే మరొక ఘటన మొన్ననే జరిగింది. దాన్ని చెబుతాను. వినండి.

నాకు ఇప్పుడు ఒక ఏడాది వయస్సున్న చిన్న కూతురుంది. నాకొక అంగడి కూడా ఉంది. అందులో మా జనాలకు అవసరమైన కాయగూరలు, పచారీ సామాన్లు, బీడీలు, ఆకులు, వక్కలు, టీ మొదలైనవి అమ్ముతాం. మా వీధిలో మాలాంటి సంచారులు హెయిర్ పిన్నులు, పిల్లల ఆటవస్తువులైన పీపీ, బెలూన్, ఈలలు మొదలైనవాటిని అమ్మటానికి వస్తారు. ఈ విధంగా పీపీ, పిన్నులు మొదలైనవి అమ్మటానికి ఈ మధ్యన కడుపుతో ఉన్న ఒక స్త్రీ వచ్చేది. ఒక్కొక్కసారి ఆమెతోపాటు ఆమె భర్త కూడా వచ్చేవాడు. ఇలా వచ్చినపుడు మా అంగడిలోనే ఇద్దరూకూర్చుని టీ తాగి, నా కూతురుకు పీపీ ఇచ్చి అమ్మాయిని కాస్సేపు ముద్దుచేసి వెళ్ళేవారు. మేము సంచారులం అన్నది వాళ్ళకూ తెలుసు. వాళ్ళు కంప్లికి వచ్చి ఎక్కడ ఉంటున్నారో అనే విషయాలను నేను విచారించలేదు.

మొన్న శుక్రవారం అంటే 17-5-2003న మా ఊర్లో సోమప్ప జాతర ఉంది.

ఆరోజు మధ్యాహ్నం నేను అంగడికి కావలసిన సామాన్లు తీసుకుని రావటానికి అయిదు వందల రూపాయలు జేబులో పెట్టుకుని బజారుకు వచ్చాను. అదే సమయానికి ఆ గర్భిణి స్త్రీ భర్త బజారులో కనిపించాడు. నన్ను చూడగానే –

"దండాలు అన్నా" అన్నాడు.

"దండాలు, ఏమిటి సమాచారం? వ్యాపారానికి పోలేదా?" అని అడిగాను.

"లేదన్నా, నా ఆడది సచ్చిపోయిందన్నా, ఏం చేయాలో తెలియటం లేదు. సంస్కారం చేయడానికి లేదు. ఏమీ అర్థం కావటం లేదన్నా" అన్నాడు దీనంగా.

"ఎక్కడ ఉన్నారు?"

"సోమప్ప గుడి దగ్గర" అన్నాడు.

సోమ్మప్ప గుడి కోనేరు పక్కన చాలా మంది చిన్నదాసరులు, శికారివాళ్ళు మొదలైన సంచారులే నివసిస్తున్నారు.

"అన్నా, పీనుగుని తొందరగా తీసుకునిపోండి. ఇప్పుడు తేరును లాగుతారు. పీనుగుని పక్కన పెట్టుకుని తేరును లాగడానికి కుదరదని గుడి కమిటీవాళ్ళు తొందర పెడుతుండారు. నా దగ్గర డబ్బులు లేవు. ఆడది బాలింత కావటంవల్ల పూడ్చకూడదంట. దహనం చేయాల్నంట. కట్టెలమండి దగ్గరికి వెళితే కట్టెలకు నాలుగువేలు అడుగుతుండారు. ఇలాంటి సమయంలో నువ్వు దేవుడు కనిపించినట్టు కనిపించినావన్నా. ఏదైనా సహాయం చెయ్" అని అడిగాడు.

"రా, బండి వెనుక కూర్చో" అన్నాను.

నా సైకిల్‌మోటర్ ఎక్కి కూర్చున్నాడు.

నేరుగా సోమప్పగుడి దగ్గరికి పోయాం. తేరుగది ఇంటి వెనుక భాగంలో గుడిసె వేసుకున్నారు. గుడిసెలో శవాన్ని పడుకోబెట్టారు. అందులో ఉన్నవాళ్ళంతా బయట ఉన్నారు. ఆ కుటుంబంలో కేవలం భార్యాభర్తలు, భర్త అన్న ఉన్నారట. ఇప్పుడు ఆ స్త్రీ మగబిడ్డను కని చనిపోయింది.

మొన్న ఆమె చావటానికి నాలుగు రోజుల ముందు ఆ స్త్రీకి నొప్పులు మొదలయ్యాయట. మరోదారి కనిపించక ఆస్పత్రికి పిల్చుకునిపోతే డాక్టర్ బళ్ళారిలోని పెద్దాసుపత్రికి పిల్చుకుని పొమ్మని చెప్పారట. అయితే వారి దగ్గర డబ్బు లేనందువల్ల – 'దేవుడు పెట్టినట్టు కానీ' అని తిరిగి గుడిసెకు పిల్చుకుని వచ్చారట. ఇంట్లోనే కాన్పు జరిగి మగబిడ్డను కన్నదట. కాన్పులో చాలా రక్తం పొయిందట. ఇది జరిగిన మూడు రోజుల వరకూ బాగానే ఉందట. నాలుగవ రోజున సుమారు పన్నెండు గంటలకు బాలింతరాలు భర్త అన్న దగ్గరికి వచ్చి బీడి అడిగిందట. ఆమె అంతకు ముందు ఎప్పుడూ బీడీ తాగలేదట. ఆమె బీడీ అడగటంతో ఒక బీడీ ఇచ్చాడట. అతని దగ్గరే అగ్గిపెట్టె ఇప్పించుకుని బీడి వెలిగించి కాల్చిందట. అది పూర్తవుతుండగా మరొక బీడి ఇప్పించుకుని తాగిందట. ఇలా మూడు బీడిలు కాల్చిన ఆమె మూడవ బీడీ తాగిన తరువాత "నేను ఇంగ పోతాను మావా" అని అందట. ఎందుకిలా అన్నదో అర్థం కాలేదట. నిల్చున్నపాటున నేల మీద పడి ప్రాణాలు వొదిలిందట.

నేను వెళ్ళి చూసే సమయానికి గుడిసె ముందు కొంత మంది జనం నిలబడి ఉన్నారు. అందులో కొందరు ఆడపిల్లలు శవసంస్కారం కోసం చందా ఎత్తుతున్నారు. అదంతా చూసి అంగడి కోసం సామాన్లు తీసుకుని రావటానికి తెచ్చిన అయిదువందలు ఆమె భర్తకు ఇచ్చేశాను.

"ఈ దుడ్లు చాలదన్నా ! ఎట్లా చెయ్యాలి?" అన్నాడు.

ఆ వ్యక్తిని బండి వెనుక కూర్చోబెట్టుకుని మా వీధికి వెళ్ళి చందా అడిగాను. ఊళ్ళో నాకు తెలిసిన వాళ్ళందరి దగ్గర పరిస్థితి వివరించి చందా అడిగాను. హక్కిపిక్కి కాంత్‌ను అడిగితే అయిదువందల రూపాయల విలువైన కట్టెలు సామిల్లులో ఇప్పించాడు. మరో రెండు సామిల్లులకు వెళ్ళి పరిస్థితి వివరిస్తే వాళ్ళు కూడా

కట్టెలు ఇచ్చారు. మా ఇంట్లో అయిదు లీటర్ల కిరసనాయిల్ ఉంది. తెచ్చి వారికి ఇచ్చాను. మొత్తం చందా సొమ్ము అయిదువేల రూపాయలు పోగయ్యాయి. మొత్తం సొమ్ము వాళ్ళకే ఇచ్చాను.

అన్ని సమకూరాయి. అయితే శవం మోయటానికి ఒక్కరూ రాలేదు.

చివరికి అక్కడ ఉన్నది నేను, ఆ స్త్రీ భర్త, అతడి అన్న. అంతే !

ఏం చేయాలో తోచలేదు. నా బండిలోనే వెళ్ళి ఒక పూలదండ తెచ్చి శవానికి వేశాం. ఊరి నుంచి ఊరికి తీసుకునిపోవటానికి ఒక పాత ఆటో వారి దగ్గర ఉంది. ఆటోలో శవాన్ని వేసుకుని ముగ్గురం శ్మశానికి వెళ్ళాం. మేమే కట్టెలు పేర్చి శవాన్ని దాన్ని మీద పడుకోబెట్టి నిప్పుపెట్టాం. శవం కాలిన తరువాత ఇంటివైపు వచ్చాం.

ఆ సంఘటన నాకు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టుంది.

మా సంచారుల సుమారు 300 కుటుంబాలు కంప్లిలో ప్రస్తుతం నివాస మున్నాయి.

అయితే ఒక వ్యక్తి కూడా శవానికి భుజం ఇవ్వడానికి రాలేదు.

మేము సంచారులం. కొంచెం మారి నామని అనుకున్నాను.

ఈ ఘటన జరిగిన తరువాత మేము ఇంకా మా తండ్రి కాలంలో ఉన్న స్థితిలోనే ఇప్పటికీ ఉన్నామని నాకు అనిపించింది.

మా పరిస్థితి ఎప్పుడు బాగుపడుతుందో చెప్పండి?

**యముడిని గెలిచినవారు :**

కూతురు పుట్టినపుడే పిల్లలు కాకుండా ఆపరేషన్ చేయించాలని అనుకున్నాను.

అయితే పెద్దభార్య ఇంటికి ఒక్క మగబిడ్డయినా ఉండాలని గొడవ పెట్టింది. ఆమె కోరిక ఎందుకు కాదనాలని ఆపరేషన్ చేయించలేదు. మొదటి కూతురు పుట్టిన మూడేళ్ళకు నా రెండవ భార్య మళ్ళీ గర్భవతి అయ్యింది. గర్భవతి అయిన తరువాత గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్ళి వచ్చేవాళ్ళు. ఎనిమిది నెలలు నిండుతుండగా ఆ ఆస్పత్రిలోని డాక్టర్ మా దగ్గర లేడీ డాక్టర్ లేదు. అనుకూలమైన మరో మంచి డాక్టర్ దగ్గరికి పిలుచుకునిపోయి స్కానింగ్ చేయించు అన్నారు. వారి మాట ప్రకారం గంగావతిలోని డాక్టర్ దగ్గరికి పిల్చుకునిపోయాం.

డాక్టర్ స్కానింగ్ చేసి "కవల పిల్లలు" అన్నారు.

ఒక వైపు సంతోషం, ఒక వైపు దుఃఖం.

ఏమి చేయాల్రా దేవుడా అని అనుకుంటుండగా డాక్టర్ "ముందు మీరు అడ్మిట్ అవ్వండి. రోజులు నిండే వరకు నిర్లక్ష్యం చేస్తే తల్లి ప్రాణాలకు ప్రమాదం. తొందరగా ఆపరేషన్ చేద్దాం. దేవుడు అంతా మంచే చేస్తాడు" అని చెప్పారు.

రోజులు నిండటానికి ముందే బిడ్డ బయటికి వస్తే ఎలా అనే చింత పెద్ద భార్యకి. డాక్టర్ ఏమీ కాదని, ధైర్యంగా ఉండమనీ చెప్పిన తరువాత ఆపరేషన్ చేయడానికి అంగీకరించాం. డాక్టర్ ఆపరేషన్ చేసి బిడ్డలను బయటికి తీశారు. ఇద్దరూ మగపిల్లలు. నా భార్యల సంబరానికి హద్దే లేకుండా పోయింది. అయితే ఎంత బరువు ఉండాలో పిల్లలు అంత బరువు లేరు. చిన్నబిడ్డ అయితే ఒక కేజి నూటాయాభై గ్రాములు ఉన్నాడేమో, ఇలాంటి పిల్లలు బతకడం కష్టమని మనసుకు అనిపించింది. ఈరనాగమ్మ మీద భారం వేసి మౌనంగా కూర్చున్నాను. డాక్టర్ పిలిచి –'పిల్లలు ఇంకా కోలుకోవాలి. పిల్లల డాక్టర్ దగ్గరికి పిల్చుకునిపోండి' అని చెప్పారు. నా దగ్గరేమో డబ్బులు లేవు. వడ్డీకి అప్పు తీసుకుని రావాలన్నా వెంటనే డబ్బు ఎవరు ఇస్తారు? నా పెద్దభార్య తన దగ్గర ఉన్న బంగారమంతా ఇచ్చేసింది. దాన్ని అమ్మాను. కొంచెం డబ్బు దొరికింది. మిత్రుడు హక్కిపిక్కి శికారి రాము తాను ఇతరుల దగ్గర తీసుకున్న అప్పు తీర్చడానికి పెట్టుకున్న వదివేల రూపాయలు నాకు ఇచ్చేశాడు. ఇలా ఎవరెవరి నుంచో డబ్బు సమకూర్చుకుని పిల్లలకు, భార్యకు, ఆస్పత్రి ఖర్చులకు వెచ్చించాను. పిల్లలు కాస్త దూదితో వేస్తున్న పాలకు నోరు చప్పరించసాగారు. డాక్టర్లు ఇంకా ఆస్పత్రిలోనే ఉండాలన్నారు. అయితే నా దగ్గర ఉన్న డబ్బంతా ఖర్చయిపోయింది. ఇంకా ఆస్పత్రిలోనే ఉంటే ఖర్చులకు డబ్బు ఇచ్చేవాళ్ళు ఎవరు? దేవుడి మీద భారం వేసి భార్యాపిల్లల్ని ఇంటికి తీసుకుని వచ్చాం.

పిల్లలకు పాలు తాగడానికి రావడం లేదు. అప్పుడే పుట్టిన కుక్క పిల్లల్లా ఉన్నారు. ఇంటివాళ్ళంతా రాత్రీపగలూ ఒకరి తరువాత ఒకరు కాపలా కాసి పిల్లలను చూసుకున్నాం. అయినా చిన్న కొడుకు బతుకుతాడన్న నమ్మకం లేకపోయింది. అయితే చివరికి ఆ బిడ్డలు చనుపాలు తాగగలిగారు. కొంచెం ధైర్యం వచ్చింది.

ఇలా మూడునాలుగు నెలలు గడిచేలోగా పెద్దకొడుకును మరొక సమస్య ఇబ్బంది పెట్టసాగింది. బిడ్డ ఏడిస్తే చాలు గజ్జెల్లో బెలూన్‌లా ఉబ్బినట్టు కనిపించేది. అలా ఉబ్బుతుండగా బిడ్డ స్పృహ తప్పిపోవటంతో ఏడ్పు ఆగిపోయేది. బిడ్డ చనిపోయినట్టులేదు. బతికినట్టు లేదు. కొడుకు పరిస్థితి చూడటానికి నాకు చేతనయ్యేది కాదు. డాక్టర్ దగ్గరికి పిల్చుకునిపోతే బళ్ళారిలోని పెద్దాసుపత్రికి పిల్చుకునిపోండని సలహా ఇచ్చారు. అది మరింత కష్టమైన పననీ డాక్టర్‌కు చెబితే హొసపేటలోని పిల్లల డాక్టర్ దగ్గరికైనా వెళ్ళండని అన్నారు. డబ్బులు సమకూర్చుకుని హొసపేటలోని పిల్లల డాక్టర్ దగ్గరికి పిల్చుకుని వెళ్ళాం. డాక్టర్ చూశాడు. ఏమీ అడగలేదు. వెంటనే ఆపరేషన్ చేసి కాలిబుడగను తీసేశారు. అటు తరువాత మూడురోజులు తమ ఆస్పత్రిలో పెట్టుకుని డబ్బులు ఇప్పించుకుని పంపేశాడు.

ఇప్పుడిప్పుడు పిల్లలు సరైన తూకానికి వస్తున్నారు. పిల్లలకు పేర్లు పెట్టాలని భార్యలు చెప్పారు. సరే అన్నాను. మా వీధిలో ఆటో బాడుగకు నడిపే కుర్రవాడు ఉన్నాడు. ఒక శుక్రవారం అతడి ఆటోలో పిల్లలిద్దర్ని తీసుకుని దేవులాపుర మారెమ్మ గుడికి పోయాను. మారెమ్మ ఒడిలో పిల్లలిద్దరిని వేసి, 'తల్లీ, నా బిడ్డల్ని నువ్వే కాపాడాలమ్మా. నీ పేర్లే పిల్లలకు పెడ్తాను' అని చెప్పి 'పెద్ద మారెప్ప', 'సణ్ణ మారెప్ప' అని పేర్లు పిలిచాను.

నా పెద్దభార్య యముడిని గెలిచిన పిల్లలు అనేది.

అయితే ఈ మధ్యన నా పెద్దకొడుకు చనిపోయాడు.

చిన్నవాడు బాగున్నాడు !

**కాలు విరగటం :**

సిరుగుప్ప తాలుకా తెక్కలకోటలో మా వాళ్ళవి సుమారు ముప్ఫయి, నలభై ఇళ్ళున్నాయి. వీటిలో కేవలం 23 కుటుంబాలకు మాత్రమే 'ఆశ్రయ ఇండ్లు' దొరికాయి. మిగిలినవారికి ఇండ్లే ఇవ్వలేదు. దాని విషయమై నేను తెక్కలకోట వెళ్ళాను. ఆ రోజు నా వెంబడి నా భార్య తమ్ముడు హులుగప్పన్నను పిల్చుకుని



Unfiled Notes Page 27

పోయాను. నా సైకిల్ మోటర్ మీద ఇద్దరం వెళ్ళాం. మునిసిపాలిటి వాళ్ళను కలిసి, మాట్లాడి, మామ ఇంటికి వెళ్ళి భోజనం చేసి, తిరిగి కంప్లికి తిరిగి రావాలి. తెక్కలకోట దాటి వస్తుంటే చెరువుగట్టు మీద నా సైకిల్ మోటర్ ముందు టైరు పంక్చర్ అయ్యింది. పంక్చర్ వేయించు కోవడానికి ముందు ట్యూబ్ నెక్‌ను లోపలికి తోస్తూ మునివేళ్ళ మీద కూర్చున్నాను. నా అల్లుడు ఉచ్చపోయడానికి పక్కకు వెళ్ళాడు. అది ఏ మాయలో వచ్చాడో ఏం కథో ఒక కుర్రవాడు చాలా వేగంతో సైకిల్ మోటర్ నడుపుకుంటూ వచ్చాడు. ఇదేదో సౌండు వస్తుందని అనుకు నేంతలో సైకిల్‌మోటర్‌ను నా కాలికి తగిలిస్తూ బారెడు దూరం ముందుకుపోయి సైకిల్ మోటర్‌ను తన ఒంటిమీద వేసుకుని పడి పోయాడు.

అప్పట్లో నాకు ఎలాంటి నొప్పి కనిపిం చలేదు. ఆ కుర్రవాడు బతికాడా అని చూడ టానికి నా అల్లుడు వెళ్ళాడు. వాడు వెళ్ళి బండి పైకెత్తి స్టాండు వేశాడు. కుర్రవాడు స్పృహ తప్పివున్నాడు. నా బండి బ్యాగులోంచి వాటర్ బాటిల్ తీసి కుర్రవాడి ముఖం మీద నీళ్ళు చిలకరించాను. కుర్రవాడు హడావుడిగా లేచి, "నేను యాక్సిడెంట్ చేయలేదు…నేను యాక్సిడెంట్ చేయలేదు" అని అరవసాగాడు.

ఇటు నా కాలిలో నెమ్మదిగా వాపు కనిపించింది. నాకు కళ్ళు మసకబారుతున్నట్టు అనిపించింది. అలాగే బండి స్టార్ట్‌చేసి పంక్చర్ షాపుకు వచ్చాం. కుర్రవాడిని పిల్చుకుని నా అల్లుడు వచ్చాడు. పంక్చర్ షాపు చేరుకునేంతలో నాకు నడవటానికి సాధ్యం కానంత నొప్పి కనిపించసాగింది. నేను వద్దన్నా కుర్రవాడి నుంచి జనం అయిదువేలు ఇప్పించారు.

ఎలాగో కంప్లి చేరాను. కంప్లి చేరగానే నేరుగా ఎముకల డాక్టర్ దగ్గరికి వెళ్ళాను.

డాక్టర్ ఎక్స్‌రే తీసి "కాలు విరిగింది కట్టు కట్టాలి" అన్నారు.

నా దగ్గరున్న డబ్బులో మూడున్నర వేలు డాక్టర్‌కు ఇచ్చాను.

కాలుకు కట్టు వేశారు. కట్టు వేయిం చుకుని ఇంటికి వచ్చాను. ఇద్దరు భార్యలూ కంగారు పడ్డారు. మా వీధి వాళ్ళంతా వచ్చి చూసి పోయారు. కొందరు ఈ విధంగా కట్టు వేస్తే కాలు సరిగ్గా అతుక్కోదు, పుత్తూరు డాక్టర్ దగ్గర కట్టు వేయిస్తే మంచిదని చెప్పారు. ఆరోజు ఉదయమే గంగావతిలోని పుత్తూరు డాక్టర్ దగ్గరికి వెళ్ళాం. ఆ మహానుభావుడు కంప్లి డాక్టర్ వేసిన కట్టును తీసి కొత్త కట్టు వేశాడు. నాకు భరించరానంత హింస. అతను ఎనిమిది వేలు లాక్కున్నాడు. ఏదో విధంగా డబ్బు సమకూర్చి ఇచ్చాను.

ఇది జరిగిన రెండవ రోజున శికారి రాము, కుమార్‌సార్‌లు నన్ను పలకరించడానికి వచ్చారు. శికారి రాము తమ కళాతండకు సభ్యులకు పంచడానికి దాచిపెట్టిన పదివేల రూపాయలు నాకు ఇచ్చాడు. కుమార్ సార్ అయిదువేలు ఇచ్చారు. ఏదో విధంగా మూడు నెలలు వనవాసం అనుభవించాను. అయినా కాలు కుదురుకోలేదు. ఒక రోజు కుమార్‌సార్ తమ డాక్టర్ అల్లుడి దగ్గరికి పిల్చుకునిపోయారు. ఆయన ఎక్స్‌రే తీయించి నాకు వేరే మందులు, మాత్రలు ఇచ్చారు. అవి తీసుకున్న తరువాత కొంత కోలుకున్నాను. కుమార్‌సార్‌కు చాలా రోజుల తరువాత డబ్బు తిరిగి ఇచ్చాను. రామ ణ్ణకు ఇంకా పూర్తిగా డబ్బు తిరిగి ఇవ్వడానికి సాధ్యం కాలేదు. ఇంకా కొంత ఇవ్వాలి. వారి సహాయం ఎలా మరవగలను?

**శునక పురాణం :**

ధర్మరాజుకు, శునకానికీ బంధుత్వం ఏ విధమైందో; అదే విధంగా సంచారులకు, కుక్కలకూ విడదీయలేని బంధుత్వం ఉంది. మాకు పశువులు లేకున్నా జీవితం సాగి పోతుంది. అయితే కుక్కలు లేకుండా మా జీవితాలు సాగవు. భిక్షం పుట్టని కాలంలో మాకు పొట్టలు నింపేవి కుక్కలే ! ఎక్కడా భిక్ష దొరక నపుడు కుక్కలను వెంటబెట్టుకుని వేటకు వెళతాం. చిన్నచిన్న జంతువులను తాము తిని కడుపు నింపుకుంటే నక్క, కుందేలు, ఉడుము మొదలైన జంతువుల జాడలను పసిగట్టి వాటిని సులభంగా వేటాడటానికి మాకు సహాయం చేసేవి ఈ కుక్కలే !

అందువల్ల మాకూ కుక్కలకూ విడ దీయలేని సంబంధం ఉంది.

ఒకసారి ప్రేమతో ఒక ఆడకుక్కను పెంచాను. చాలా చక్కగా, చురుగ్గా వేటాడేది. దానికి ఏదో రోగం తగిలింది. ఆ రోగంతో చాలా బాధపడేది. దాని కష్టాన్ని చూడలేక పోయేవాడిని. బాధతో విలవిల్లాడేది. ఆ కుక్కను ఎక్కడ చూపించాలో తెలియదు. మాకు తెలిసిన మందులు, మూలికలు మొద లైనవి వాడి సేవలు చేశాను. అయితే కుక్కకు నయం కాలేదు. ఎవరో ఒకరు పశువుల డాక్టర్‌కు చూపించమని సలహా ఇచ్చారు. కుక్కను డాక్టర్ దగ్గరికి తీసుకునిపోయాను. ఆయన దాన్ని చూసి దానికి ఏదో రోగం వచ్చిందని సూది మందు వేయాలని అన్నారు. సరే వేయండన్నాను. ఆయన సూది వేసి, మందులు ఇచ్చారు. సూదివేసి మందులు ఇచ్చినందుకు మూడువేలు తీసుకున్నాడు. ఏం చేయగలను? అలాంటి వేటకుక్కను పోగొట్టుకోవడానికి మనసొప్పలేదు. డాక్టర్ అడిగినంత డబ్బు ఇచ్చాను.

అయినా కుక్క ఎక్కువ రోజులు బతక లేదు.

కుక్క చనిపోయిన రోజు ఇంట్లో ఎవరూ భోజనం చేయలేదు.

నా జీవితంలో ఎన్నో కుక్కలను పెంచాను.

అయితే అలాంటి కుక్క మళ్ళీ దొరక లేదు!

**బాలింత రోగంతో కుక్క చనిపోవటం :**

ఆ కుక్క చనిపోయిన తరువాత మరొక ఆడకుక్కను తెచ్చాను. వేటకు ఆ కుక్కనే వెంటబెట్టుకుని పోయేవాళ్ళం. మేము వేటకు వెళితే ఎనిమిది, పదిమంది కలిసి వెళ్ళేవాళ్ళం. వేటలో దొరికిన జంతు మాంసాన్ని తలాకింత అని భాగాలు వేసుకునేవాళ్ళం. అప్పుడు వలకు ఒక భాగం, కుక్కకూ ఒక భాగం అని పక్కకు తీసిపెడతాం. అటు తరువాత ఆ కుక్క ఒక సంవత్సరానికి ఎదకు వచ్చింది. ఊర కుక్కల పీడ ఎక్కువైంది. ఇది కూడు తినితిని బాగా బలిసింది. మగకుక్కలను వెదుక్కుంటూ తిరి గేది. ఇలా మగవాటి వెనుక తిరిగి గర్భం దాల్చింది. నాలుగు పిల్లలను ఈనింది.

అయితే అది పిల్లలను ఈనిన కొద్ది రోజులకే దాని వెనుక కాళ్ళల్లో వాపు వచ్చింది. ఇతరులకు చూపిస్తే అది బాలింత రోగం అన్నారు. ఎంత చాకిరి చేసినా కుక్క మాకు దక్కలేదు. తల్లి, తల్లితోపాటు దాని పిల్లలు చనిపోయాయి.

మరొక కుక్కను కూడా సాకాను. అది కూడా ఆడకుక్కనే. అయితే ఆ కుక్క ఒక్క పిల్లను ఈనలేదు. దాని వెనుక భాగమంతా ఉబ్బి పోయివుంది. డాక్టర్‌కు చూపిస్తే దానికి కాన్సర్



అన్నారు. కాన్సర్‌కు ఏం చేయాలని అడిగితే సూదిమందు వేయాలన్నారు. అయితే అది ఎక్కువ రోజులు బతికే లక్షణాలు లేవని అన్నాడు. అది ఇప్పటిదాకా మా కోసం కష్టపడింది. దాన్ని అలాగే వదిలి వేయడానికి మనసొప్పలేదు. చనిపోయే వరకూ మాతోనే ఉండనీ అని దాని బాగోగులు చూసుకుంటూ వచ్చాం.

**బెంగళూరు నుంచి జాతికుక్కను తీసుకుని రావటం :**

ఒకసారి సంచారుల సమావేశానికి బెంగళూరుకు శికారి రాముతోపాటు వెళ్ళాను. అదేదో స్థలంలో మీటింగ్ పెట్టారు. ఆ స్థలం ఎక్కడో గుర్తులేదు. భాస్కరదాసు, బాల గురుమూర్తి, మైత్రి అందరూ మీటింగ్‌లో ఉన్నారు. వాళ్ళంతా ఏమేమో మాట్లాడుతున్నారు. నాకు ఒక్కటీ అర్థం కాలేదు. మధ్యాహ్నమైనా మీటింగ్ ముగియలేదు. నాకు విసుగు వస్తూ వుంది. ఏం చేయాల్రా నాయనా అని మీటింగ్ బయటికి వచ్చాను. అటు ఇటు తిరుగసాగాను. అయినా పొద్దుపోవడం లేదు. అలా తిరుగుతూ ఒక చోట నిలబడ్డాను.

అక్కడే ఒక పాత డొక్కు జీపు తన ఒక చక్రంలో గాలి పోగొట్టుకుని పడుకునివుంది. జీపు ప్రాణం పోగొట్టుకుందని అనుకుంటూ నిలబడ్డాను. ఆయితే ఆ ప్రాణం పోగొట్టుకున్న జీపులోంచి కుంయ్ కుంయ్‌మంటూ శబ్దం రాసాగింది. ఏమిటా అని చూస్తే నాలుగైదు కుక్కపిల్లలు. ఇంకా కళ్ళు సైతం తెరవలేదు. వాటి తల్లి ఎక్కడికి పోయిందో తెలియదు. ఆ కుక్కలను చూస్తూ చాలాసేపు నిలబడ్డాను.

అంతలో ఎవరో ఒక సూటుబూటు వేసుకున్న వ్యక్తి వచ్చాడు. "ఏం చేస్తున్నావు?" అని అడిగాడు.

"కుక్కపిల్లలను చూస్తున్నాను" అన్నాను.

"కుక్కలంటే నీకు ఇష్టమా?" అని అన్నాడు.

నేను చిన్నపిల్లవాడిలా "అవునయ్యా" అన్నాను.

అప్పుడు ఆ మనిషి, "నీకు ఎన్ని పిల్లలు కావాలో అన్ని తీసుకునిపో" అన్నాడు.

సిటీ జనం కుక్కలను అమ్ముతారని తెలుసు. ఆ కారణంగా, "అయ్యా, నా దగ్గర డబ్బులు లేవు" అన్నాను.

ఆ మనిషి నవ్వి "డబ్బులు వద్దు, నీకు ఇష్టమైన కుక్కపిల్లల్ని తీసుకునివెళ్ళు" అన్నాడు.

నాకు కావాల్సింది అంతే. అక్కడే దగ్గర్లో ఉన్న మెడికల్ షాపుకు వెళ్ళి ఒక ఖాళీ అట్టపెట్టె తెచ్చాను. అక్కడక్కడ దానికి చిల్లులు వేసి ఒక ఆడకుక్కపిల్లను, ఒక మగకుక్క పిల్లను పెట్టెలో జాగ్రత్త పరిచాను. సాయంకాలం రాము వెంబడి నేరుగా ఊరికి వచ్చాను. "ఎందుకన్నా మన ఊళ్ళో కుక్క దొరకదా? ఇక్కడి నుంచి కుక్క పిల్లల్ని తీసుకుని పోతున్నావు?" అని రాము తమాషా చేశాడు. అవి పాలు తాగలేదు. చివరికి దూదితో పాలు పట్టాను. ఇప్పుడు బాగా ఎత్తుగా పెరిగి చురుగ్గా తయారయ్యాయి. వేటకు పోయినప్పుడంతా పిల్చుకునిపోయి వేటాడటం అలవాటు చేశాను.

ఆ రెండు కుక్కలకు మునలవ్వ, మునలమ్మ అని పేరు పెట్టాను !

(ఇంకా వుంది)

## బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు




"**మా** ఇంటికి ఎదురుగా దక్షిణోత్తరంగా సాగిపోయే రాచబాటను ది గ్రాండ్ నార్తరన్ ట్రంక్ రోడ్ అనేవారు. మా ఇంటికి కుడివైపున (ఉత్తరం) ఉండే దివానుగార్ల బంగళాలలో మొదటిదానిలో రఘుపతి వేంకటరత్నం నాయుడు గారుండేవారు. ఆయన వీరేశలింగంగారితో పాటు, సంఘ సంస్కరణలోను, హరిజనోద్ధరణ కోసమూ పాటుపడిన ఆధునికాంధ్ర నిర్మాతలలో ఒకరు. బ్రహ్మసమాజానికీ, మహరాజా వారి కుమారులకూ, కుమార్తెలకూ గురువుగాను, కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాలుగాను, ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంలో కులపతిగానూ పనిచేసి, కృతకృత్యులై. నిరంతర దైవధ్యాన నిరతులై దీనజనోద్ధరణకు దీక్షాదక్షులై బ్రహ్మర్షి అనిపించుకున్న మహనీయుడు!

హేమచంద్ర సర్కారు వంటి రాష్ట్రేతర అతిథులు మహారాజావారి ఆహ్వానంపై పిఠాపురం వచ్చినపుడు, నాయుడుగారితో బస చేసి, మా ఇంటి ముందు నుంచి పోయే గుర్రపు సార్టులో కనపడేవారు. **– కీ.శే. బాలాంత్రపు రజనీకాంతారావు**

5, ఆగస్టు 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'–'రజనీ భావతరంగాలు' నుండి

ఆచార్య వెలమల సిమ్మన్న
9440641617

# 'విజ్ఞాన సర్వస్వం' కొమర్రాజు లక్ష్మణరావు



*"లక్ష్మణరావుగారి ప్రతిభను అంచనా వేయాలంటే హిమవత్పర్వత శ్రేణుల భౌగోళిక స్వరూప నిర్ణయం చేయడం వంటిదే"* – అడివి బాపిరాజు

చరిత్రకారుడుగా, పరిశోధకుడుగా, భాషా సేవకుడుగా, సాహితీవేత్తగా, సంఘసేవకుడుగా, మేధావిగా, పండితుడుగా, బహుభాషా కోవిధుడుగా, ఎనలేని పేరు ప్రఖ్యాతులు గడించిన గొప్ప సాహితీ సంపన్నులు కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు (18-5-1877-13-7-1923). తెలుగుదేశంలో పుట్టి రెండు దశాబ్దాలు మహారాష్ట్రంలో పెరిగి, తెలుగులో అనేక ఉత్తమ సంస్థల్ని నిర్మించి, సాహిత్యానికీ, భాషకూ, సామాజాభివృద్ధికీ, కృషి చేసిన మహానుభావుడు.

కొమర్రాజువారు 1877 మే 18వ తేదిన కృష్ణా జిల్లా నందిగామ తాలూక పెనుగంచిప్రోలు గ్రామంలో జన్మించారు. గంగమ్మ వేంకటప్పయగార్లు వీరి తల్లిదండ్రులు. లక్ష్మణరావుగారు రెండేళ్ళ వయస్సులో వున్నపుడే తండ్రి చనిపోయారు. ఆ కారణంగా తన సవతి సోదరుడైన శంకరరావుగారి వద్ద కొంతకాలం వున్నారు. వీరు ప్రాథమికవిద్యను భువనగిరిలో పూర్తి చేశారు. వీరి సోదరి అచ్చమాంబను నాగపూర్లో ఇంజనీర్‌గా పనిచేసే, వారి మేనమామ భండారు మాధవరావుకి ఇచ్చి వివాహం చేశారు. లక్ష్మణరావుగారు నాగపూర్‌లో మేనమామ ఇంటిలో వుంటూ మాధ్యమిక విద్యను, ఉన్నత విద్యను అభ్యసించారు.

**నా**గపూరులోని మారిష్ కాలేజీలో బి.ఏ. ఆనర్స్ చదువుకున్నారు. ఎఫ్.ఎల్ కూడా పూర్తి చేశారు. బి.ఏ.లో పాళిభాషను అభిమానంగా తీసుకున్నారు. ఆ భాషలో ఉత్తీర్ణులయిన వారిలో ప్రథముడు మా గురువుగారే అని మల్లంపల్లివారు అన్నారు. ప్రైవేట్‌గా ఎమ్.ఏ. కలకత్తా విశ్వవిద్యాలయంలో పూర్తిచేశారు.

మహారాష్ట్రంలో వుండడం వల్ల ఆ రాష్ట్ర సంస్కృతి ప్రభావం తనపై పడింది. ఆయన కట్టూ బొట్టూ అన్నీ మారాయి. ఎంతగా పడిందంటే ఎప్పుడూ కోటు, ఉత్తరీయం, తలపాగా, మీసాలు. ఇవన్నీ వుండేవి. వీరు సంస్కృతం, హిందీ భాషల్ని అధ్యయనం చేశారు. బెంగాలీ, గుజరాతీ, తమిళం, కన్నడభాషల్లో వీరికి పరిచయం వుంది. మహారాష్ట్రంలో వుండేటప్పుడు రావుగారు 'సమాచార్, వివిధ, విజ్ఞాన విస్తార' అనే పత్రికలకు సంపాదకత్వం వహించారు. 'కేసరి', 'మహారాష్ట్ర', మొదలైన పత్రికల్లో వ్యాసాలు రాశారు. తాను విద్యాభ్యాసం చేసిన మరాఠీ భాషలోనే పరిశోధనా వ్యాసంగం ప్రారంభించారు. మహారాష్ట్రంలో వున్నప్పుడే, విజ్ఞానశాస్త్రాల వ్యాప్తి ప్రాముఖ్యాన్ని రావుగారు గుర్తించారు.

మహారాష్ట్రలో వున్నప్పటికీ తెలుగు భాషా సాహిత్యాలపై వీరికి పట్టుసడలలేదు. సోదరి అచ్చమాంబ తెలుగు గ్రంథాల్ని పత్రికల్ని తెప్పించుకొని చదువుతుండేది. లక్ష్మణరావుగారుకూడా ఆ గ్రంథాల్ని పత్రికల్ని చదివేవారు. అచ్చమాంబ, లక్ష్మణరావు ఇద్దరూ రాసిన వ్యాసాలు తెలుగు పత్రికలలో ప్రచురితమయ్యాయి. రాయసం వేంకట శివుడు నడిపిన 'తెలుగు జనని' పత్రికలో వీరి వ్యాసాలు వెలువడ్డాయి. ఆ పత్రికలోనే కొమర్రాజుగారి "విశ్వం యొక్క విరాట్ స్వరూపం", "విశ్వం యొక్క బాల్యస్వరూపం" మొదలైన విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన వ్యాసాలు ముద్రించబడ్డాయి.

నాగపూర్‌లో వుండగానే తెలుగులో చరిత్ర గ్రంథాలు లేని లోపాన్ని పూరించడానికి "శివాజీ చరిత్ర" రాశారు. వీరు రాసిన "శివాజీ చరిత్ర" ప్రముఖుల ప్రశంసల్ని అందుకుంది. "ఆంధ్రభాష యందు చరిత్ర గ్రంథంబు లత్యల్పంబుగనున్నవి. కానచేతనైనంత వరకు మాతృభాషా సేవ చేయవలెననిన నిచ్చతోనే చరిత్ర గ్రంథంబు రాసినాడ, శక్తివంచనలేక ఇక ముందును నిటులనే భాషా సేవ చేయవలయునని నిచ్చగలవాడను" అని రావుగారు అన్నారు.

లక్ష్మణరావుగారు బెజవాడ తాలూకాకు చెందిన కంకిపాడు కరణం మల్లికార్జునరావు కుమార్తె కోటమాంబను పెళ్ళిచేసుకున్నారు. వీరికి అచ్చమాంబ, వినాయకరావు ఇద్దరు పిల్లలు. అచ్చమాంబ డాక్టర్‌గా, సంఘసేవకురాలుగా కీర్తి గడించారు. వినాయకరావు కొన్ని రచనలు చేశారు. కొంతకాలం ప్రెస్ కూడా నడిపారు.

నాగపూర్ నుంచి తన స్వస్థలం మునగాల చేరుకున్నారు. మునగాల రాజాతో తనకు వున్న నంబంధాల వల్ల లక్ష్మణరావుగారు మునగాలరాజాకు దివానుగా నడిగూడెంలో చేరారు. సంస్థాన వ్యవహారాలు చూసేవారు. మునగాల ఎస్టేట్‌కు సంబంధించిన కోర్టు వ్యవహారాలకోసం 1905 లో లక్ష్మణరావుగారు కుటుంబాన్ని మద్రాస్‌కు మార్చారు. మద్రాస్‌లో నివాసం వున్నప్పడే "దక్షిణ భారత సంఘ సంస్కరణ సమాజం" సభ్యులుగా చేరారు. ఈ సంఘాన్ని ఎస్.శ్రీనివాస అయ్యంగారు స్థాపించారు. వీరు సంస్కరణవాది. హరిజన విద్యకొరకు ఏర్పాటు చేసిన రాత్రి పాఠశాలలో లక్ష్మణరావుగారు పనిచేశారు కూడా.

విజ్ఞానశాస్త్రాలన్నీ సంస్కృతం, ఆంగ్లం భాషల్లో వుండడం వల్ల ఈ భాషలు తెలియని వారికి కూడా విజ్ఞాన శాస్త్రం అందుబాటులో

వుండాలన్న మంచి ఉద్దేశంతో "విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి"ని 1906లో హైదరాబాద్‌లో స్థాపించారు. మునగాలరాజావారి ఇంట్లో లక్ష్మణరావు, హరి సర్వోత్తమరావు, రావిచెట్ల రంగారావు, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలైనవారు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. సంపాదకుడుగా లక్ష్మణరావుగారు, కార్యదర్శిగా హరిసర్వోత్తమరావుగారు నియమితులయ్యారు. హైదరాబాద్ రెసిడెన్సీ బజార్లో ఈ మండలి కార్యాలయం వుండేది. మంచి లక్ష్యాలతో, ఆశయాలతో ఈ మండలి ప్రారంభమైంది. ప్రజల్ని చైతన్యవంతం చేయడం, స్వాతంత్రోద్యమం వైపు ప్రజల్ని నడిపించడం, అస్పృశ్యతా నివారణ, హరిజనాభివృద్ధి, స్త్రీవిద్య, స్త్రీ స్వాతంత్ర్యం, విజ్ఞాన విస్తరణ లాంటి ముఖ్యమైన లక్ష్యాలతో ఈ మండలి ముందుకు వెళ్ళాలని నిర్ణయించారు. అసలు విషయం ఏమంటే ఈ మండలి అభివృద్ధికి ఎవరూ ప్రతిఫలం ఆశించకూడదని ముక్తకంఠంతో అందరూ నిర్ణయం తీసుకున్నారు.

ఈ మండలి మొదటి గ్రంథంగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు రాసిన "అబ్రహం లింకన్ చరిత్ర"ను ముద్రించింది. తర్వాత లక్ష్మణ రావుగారి "హిందూ మహాయుగం" ప్రచురించారు. డాక్టర్ ఆచంట లక్ష్మీపతి–జీవశాస్త్రం, వేలాల సుబ్బారావు–రాణీ సంయుక్త, కొమర్రా జువారి–మహమ్మదీయ మహాయుగం, మంత్రిప్రగడ సాంబశివ రావు–పదార్థవిజ్ఞానశాస్త్రం, విశ్వనాథశర్మ–రసాయన శాస్త్రం, చిలు కూరి వీరభద్రరావు – ఆంధ్రుల చరిత్ర, భోగరాజు నారాయణమూర్తి–విమలాదేవి ఇలా అనేక గ్రంథాలు ఈ మండలి ద్వారా ప్రచురించ బడ్డాయి. తర్వాత ప్రకృతి శాస్త్రగ్రంథాలు వెలువడ్డాయి. ఉత్తమ గ్రంథాల్ని మండలి ప్రచురించి, తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేసింది.

లక్ష్మణరావుగారు 1910లో 'విజ్ఞానచంద్రికాపరిషత్'ను స్థాపించారు. రచనలపోటీ పెట్టారు. ఆ పోటీలో నెగ్గినవారి గ్రంథాల్ని గ్రంథమండలి ప్రచురించింది. 1912 నుండి మండలి ప్రచురణలే పాఠ్య పఠనీయ గ్రంథాలుగా పరీక్షలు నిర్వహించటం ప్రారంభించారు. మొదటి బహుమతి పొందిన వారికి 116/– రూపాయలు మరియు బంగారుపతకం. రెండో స్థానం పొందిన వారికి యోగ్యతాపత్రం ఇచ్చారు. నాడు బహుమతి పొందినవారు కాంచనపల్లి కనకాంబ, పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆదుర్తిభాస్కరమ్మ, నిడుదవోలు వేంకటరావుగార్లు.

ఆంగ్లంలోని బ్రిటీష్‌ఎన్సైక్లోపీడియా పద్ధతిలో ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం నిర్మాణం చేపట్టాలని రావుగారు సంకల్పించారు. 1915లో తెలుగు విజ్ఞాన సర్వస్వం రాయాలని పూనుకున్నారు. మూడు సంపు టాలు వెలువరించారు. వీరు ఈ మూడు సంపుటాల్లో విలువైన వ్యాసాల్ని రాశారు. భాషవిషయాల వ్యాసాలు11, గణిత శాస్త్ర విషయాలు 2, ధర్మశాస్త్ర విషయాలు 9, జ్యోతిశ్శాస్త్ర విషయం 1, చరిత్రకు సంబంధించిన వ్యాసాలు 7, ప్రకృతి శాస్త్ర విషయాలు 2, కళా విషయం 1, రాజకీయ విషయం 1, తర్కశాస్త్ర విషయం 1, మొదలైన వ్యాసాలు ఆయా సంపుటాల్లో చోటు చేసుకున్నాయి. కొమర్రాజువారి ప్రతిభకు ప్రతిబింబం "విజ్ఞాన సర్వస్వం".

ఇవి కాక రావుగారు అద్వైతం, అష్టాదశ పురాణాలు, పాణిని అష్టాధ్యాయి, అలంకారాలు, శృంగారం–పూర్వ లాక్షణికులు, అభిజ్ఞాన శాకుంతలం, అచ్చతెలుగు, అధర్వణవేదం మొదలగు వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాల్ని "లక్ష్మణ రాయ వ్యాసావళి" అనే పేరుతో రెండు భాగాలుగా వెలువడ్డాయి. మొదటి భాగంలో 17, రెండో భాగంలో 5 వ్యాసాలు వున్నాయి. ఇందులోని కొన్ని వ్యాసాలు విజ్ఞాన సర్వస్వంలో కూడా వచ్చాయి.

లక్ష్మణరావుగారు, కాశీనాథుని నాగేశ్వరరావుగారు మంచి మిత్రులు. విజ్ఞాన సర్వస్వాన్ని నాగేశ్వరరావుగారే ప్రచురించారు. వారిద్దరి స్నేహానికి చిహ్నంగా విజ్ఞాన సర్వస్వం సహృదయ పాఠకుల ముందుకు వచ్చింది. విజ్ఞాన సర్వస్వం అంటే కొమర్రాజు లక్ష్మణ రావు, కొమర్రాజు లక్ష్మణరావు అంటే విజ్ఞానసర్వస్వం అనే పేరు లోకంలో స్థిరపడింది.

కొమర్రాజువారు పరిశోధనా రంగంలో చెప్పకోదగ్గ కృషి చేశారు. చరిత్ర, శాసనాలు, భాష, సాహిత్యం మొదలైన విషయాల్లో చాలాలోతుగా, నిశితంగా, ప్రామాణికంగా పరిశోధన చేశారు. ఇక విజ్ఞాన సర్వస్వ నిర్మాణం గూర్చి చెప్పనక్కరలేదు. రావుగారి రచనల్లో పరిశోధన దండిగా వుంది. విజ్ఞాన సర్వస్వంలోని ఆయన వ్యాసాలన్నీ పరిశోధన ఫలితాలే కానీ, అనుసరణలు, అనువాదాలు కావు. కొమర్రాజువారు పరిశోధనలో పరిపక్వం చెంది, పరాకాష్ఠకు చేరుకున్నారు.

నాగపూర్‌లో మెట్రిక్యులేషన్ చదువుతున్నపుడు ఒక ముసలి డాక్టర్ చిన్నపిల్లను పెళ్ళాడిన విషయాన్ని ఇతివృత్తంగా తీసుకొని "వృద్ధభర్త–పడుచు భార్య" అనే ప్రహసనం రాశారు. ఈ ప్రహసనం మహారాష్ట్ర ప్రాంతంలో పెద్ద సంచలనాన్ని కలిగించింది. ఎఫ్.ఎ. చదువుచుండగా భార్య వియోగాన్ని గూర్చి మరాఠీ భాషలో "వియోగ గీతి" అనే పేరుతో గేయాన్ని రాశారు. అందులోని అనుభూతి సహజం గా వుండడం వల్ల చిన్నతనంలోనే భార్య వియోగం కలిగిందని కొందరు ఓదార్చడానికి ఇంటికి వచ్చారు. దీన్ని బట్టి ఆయన సృజనాత్మక సాహిత్య సృష్టి ఎలా వుంటుందో మనం అర్థం చేసుకోవచ్చు. తెలుగులో వేరే పేర్లతో రావుగారు కథలు రాశారు. "క" రామానుజరావు అనే పేరుతో 'ఆంధ్ర పత్రిక" మొదటి ఉగాది సంచికలో "ఏబదివేల బేరము" అనే కథ అచ్చు అయింది. 'సావిత్రి' పత్రికలో "పుల్జాన్ బేగం"అనే కథ వెలువడింది.

రావుగారి గ్రంథాల్లోనూ, వ్యాసాల్లోనూ చాలా స్పష్టంగా పరి పూర్ణత, సాధికారిత, సప్రమాణత అనే మూడు లక్షణాలు కన్పిస్తాయి. రామాయణంలోని 'పంచవటి' స్థల నిర్ణయం గూర్చి పండిత లోకంలో పెద్దచర్చ జరిగింది. వాదోపవాదాలు కూడా చోటుచేసుకున్నాయి. రావుగారు భద్రాచలం సమీపంలోని పర్ణశాలయే 'పంచవటి' అని నిర్ధారించారు. అందరూ శభాష్ అన్నారు. వీరు రాసిన ఏకశిలా నగరము ఓరుగల్లే, చాళుక్యులు దాక్షిణాత్యులే, కృష్ణరాయలు నిదాన కాలము, యుద్ధమల్లుని బెజవాడ శాసనం, త్రిలింగము నుండి తెలుగు పుట్టేనా లేక తెలుగు నుండి త్రిలింగము పుట్టేనా, మొదలైన వ్యాసాలు ప్రముఖుల ప్రశంసల్ని అందుకున్నాయి.

రావుగారు విద్యాభివృద్ధి పట్ల, వితంతు పునర్వివాహాల పట్ల స్త్రీ స్వాతంత్ర్యంపట్ల ఎక్కువగా మొగ్గు చూపేవారు. తన కుమార్తెను యుక్తవయస్సు రాకముందే పెళ్ళి చేయాలన్న తన తల్లి మాటల్ని వ్యతిరేకించారు. అందుకే తల్లి కోపంతో ఇల్లువదలి కాశీ వెళ్ళిపోయింది. అయినా రావుగారు కూతురుకి చిన్నతనంలో పెళ్ళి చేయలేదు. అంతేకాదు కూతురిని విదేశాలకు చదువుకోసం పంపారు. తన రెండో మేనమామ గారిని వితంతు వివాహం చేసుకోవడానికి ప్రోత్సహించి అంతా తానే దగ్గర వుండి పెళ్ళి చేసిన సంఘ సేవకులు లక్ష్మణరావుగారు.

కొమర్రాజువారు రాజకీయాల్లో బాలగంగాధర తిలక్ అభిమాని. రావుగారు స్వయంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదు. అయితే స్వాతంత్ర్యోద్యమానికి సహాయ సహకారాలందించారు. 1906లో కలకత్తాలో దాదాబాయి నౌరోజి అధ్యక్షతన సంపూర్ణ స్వాతంత్ర్య నినాదంతో జరిగిన కాంగ్రెస్ మహాసభలో నాయని వేంకట రంగరావు హరి సర్వోత్తమరావులతోపాటు తాను కూడా పాల్గొన్నారు. 1907లో నందిగామలో జరిగిన కృష్ణాజిల్లా కాంగ్రెస్ మహాసభలో లాలాలజపతిరాయ్ మొదలైనవారిని అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ ఉపన్యాసాలిచ్చారు. ఇదే సంవత్సరంలో దేశం అంతా పర్యటిస్తూ బిపిన్ చంద్ర పాలుకు స్వాగతమిచ్చిన వారిలో రావుగారు కూడా వున్నారు. 1908లో మద్రాసులో జరిగిన శివాజీ వర్ధంతి సభలో పాల్గొని రావుగారు మరాఠీ భాషలో ప్రసంగించారు.

గిడుగు, గురజాడ, కందుకూరి నడిపిన వ్యావహారిక భాషా ఉద్యమాన్ని లక్ష్మణరావుగారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ కారణంగా ఎంతోమంది వ్యావహారిక భాషావాదులతో ఆనాడు తీవ్రమైన విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది.

తెలుగులో చరిత్ర, వైజ్ఞానిక గ్రంథాలులేని కొరతను తీర్చడానికి కంకణం కట్టుకున్న ఏకైక మహావిజ్ఞాని రావుగారు. విజ్ఞానాన్ని సమాజానికి అందించడంకోసం అనేక గ్రంథాల్ని ప్రచురించిన మహనీయులు లక్ష్మణరావుగారు. ఆయన ప్రతిభకు నిదర్శనంగా "కొమర్రాజు వేంకటలక్ష్మణరావు విజ్ఞానసర్వస్వ పీఠం"ను తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించింది. వీరు రాసిన భాషా వ్యాసాలు 'తెలుగు భాషాతత్త్వం"గా వెలుగులోకి వచ్చింది.

తక్కిన వారితో పోల్చిచూసుకుంటే లక్ష్మణరావు గారిలో కొన్ని ప్రత్యేక లక్షణాలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. ఇతరులు స్పృశించని అనేక రంగాల్లో వీరు విశేషమైన కృషిచేశారు. విద్య, వైజ్ఞానిక శాస్త్ర వ్యాప్తి, చరిత్ర, పరిశోధన అంశాల్లో రావుగారికి ప్రముఖ స్థానం వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కొమర్రాజువారు ఒక విజ్ఞాన సర్వస్వం.

తెలుగుప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న లక్ష్మణరావుగారు ఉబ్బసవ్యాధి కారణంగా 46 సంవత్సరాల వయస్సులోనే అంటే 1923 జూలై13 తేదిన పరమపదించారు. తక్కువ కాలం జీవించినా, తెలుగు సాహిత్యంలో మహోన్నతమైన స్థానాన్ని సంపాదించారు కొమర్రాజువారు.

*"అనేక విషయాల్లో కొమర్రాజు వేంకట లక్ష్మణరావు ప్రథముడనవచ్చు. దక్షిణ భారతీయ భాషల్లో విజ్ఞానసర్వస్వ నిర్మాణ ప్రచురణల విషయంలో తెలుగుకు ప్రాధాన్యం సంపాదించిన వాడాయనే. స్వభాషలో స్వదేశ చరిత్రను రాసిన వారిలో యావద్దక్షిణ భారతంలో ఆయనే మొదటివాడు. గ్రంథాలయ స్థాపనలో, శాసనాల సేకరణలో, ప్రచురణల్లో, మౌలిక సమాచారం మీద ఆధారపడి చరిత్ర పరిశోధన చేయటంలో, ఒక శాస్త్రీయ పద్ధతి ప్రకారం ప్రాచీన గ్రంథ పరిష్కరణ చేయడంలో, శాస్త్ర సాహిత్యపరికల్పనలో, పరిభాషా కల్పనలో, పాఠ్యగ్రంథ రచనలో, తెలుగువారి కాయన మార్గదర్శకుడు. ప్రాచీన లిపి శాస్త్రాన్ని తెలుగు వారికి నేర్పిన వాడాయనే. ఆయన చిరస్మరణీయుడు"*

– డా॥బూదరాజు రాధాకృష్ణ

స్పందన

## పిట్టచూపు సరిగ్గా వుంది

జూన్ 2018 అమ్మనుడి సంచికలో పిట్టచూపు శీర్షికలో శ్రీ చలసాని నరేంద్ర విశ్లేషణ సమంజసంగా వుంది. రాష్ట్ర విభజనను ఏకపక్షంగా, ప్రజల మనోభావాలను తెలిసికోకుండా చేసినారని నాలుగేళ్లు గడిచినా ఇంకా నాయకులు అంటూనే ఉన్నారు అనీ ఇంకా ప్రజలను నాయకులు తప్పుదారి పట్టిస్తూనే ఉన్నారనీ రాశారు. ఈ విషయంపై మనం కొంత వెనక్కి వెళితే నాయకుల తీరు స్పష్టంగా తెలుస్తుంది.

1952లో పొట్టి శ్రీరాములుగారు ఆత్మార్పణం చేసినా, మద్రాస్ నగరం లేకుండానే, మరియు, బళ్లారి, కోలార్, హోసూరు, యానాం, తిరుత్తణి, గంజాం, బరంపురం, పర్లాకిమిడి పట్టణాలను కలుపుకోకుండా ఆదరాబాదరాగా అప్పటి మన నాయకులు ఆంధ్రరాష్ట్రం యేర్పాటైతే చాలు అని, మద్రాసు రాష్ట్రం నుండి విడిపోవడానికి ఒప్పుకున్నారు. 1766 నుండి 1953 వరకు అనగా (187) సంవత్సరాలు కలిసి ఉండి, విడిపోయేటప్పుడు ఆస్తులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేస్తూ పంపకం చెయ్యాలని, తమవాటాను తమకు ఇవ్వాలని మద్రాసు, కేంద్ర ప్రభుత్వాలను అడుగలేదు. ఆంధ్రప్రదేశ్‌ను వేరుగా ఉంచుతూ 2014 లో కేంద్రం నిర్ణయించినప్పుడు మాత్రం, ఆంధ్ర ప్రాంతం నాయకులు తమ వాటా జనాభా దామాషా ప్రకారం (58) శాతం పంచి యివ్వాలని అడిగి తీసుకున్నారు.

ఒక తెలుగురాజు, మద్రాస్ ప్రాంతాన్ని (చెన్నపట్నం) ఆంగ్లేయులకు యిచ్చినాడు. అయినా మద్రాసు నగరాన్ని అడుగలేదు. వాటా గూడా అడుగలేదు – తమ తోటి తెలుగు వారైన తెలంగాణ వారి నుండి మాత్రం, వాటా తీసుకున్నారు! ఇదేమి న్యాయం – అక్కడొక న్యాయం, ఇక్కడ మరొక న్యాయమా?

రాయలసీమ నాయకుల ఒత్తిడికి తలొగ్గి కోస్తాంధ్ర నాయకులు కర్నూలును రాజధానిగా (1953)లో ఒప్పుకున్నారు – 1953లోనే విజయవాడ – గుంటూరు ప్రాంతంలో రాజధాని యేర్పాటు చేస్తే అనుకూలంగా ఉండేది.

ఆంధ్ర నాయకులు నాలుగేండ్లు గడిచినా ఇంకా విభజన గురించి తప్పుగా మాట్లాడడం ప్రజలను మభ్య పెట్టడానికే. పాడిందే పాటరా అన్నట్టు అదే పాట పాడుతున్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ, ఖనిజ సంపద మరియు సహజ వాయువు, సుదీర్ఘ కోస్తాతీరం, తెలివిగల కష్టపడే రైతులు ఉన్నారు. మంచి వ్యాపార దక్షతగల పెద్దలున్నారు. విద్యారంగంలో గూడా చాలా ప్రతిభావంతులు ఉన్నారు. నదులనీరు, డెల్టాప్రాంతం ఉన్నది. ఈ వనరులను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రం, దేశంలోనే అత్యధిక సంపదగల రాష్ట్రం అవుతుంది.

శ్రీ చలసాని నరేంద్ర వెలిబుచ్చిన అభిప్రాయంతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. వాస్తవాలను అంగీకరించడంలో నామోషి అక్కరలేదు. విభజన చట్టంలో ఉన్న అంశాలను కేంద్రంతో పోరాడి సాధించుకోవాలి. అధికార పక్షం, ప్రతిపక్షం పరస్పర ఆరోపణలు చేసుకుంటుంటే ప్రజల ముందు పలచనై పోతారు. కలిసికట్టుగా కేంద్రంతో పోరాడి మన హక్కులను, వనరులను సాధించుకోవాలి.

– కంచర్ల సత్యపాల్‌రెడ్డి 86864 86859

స్పందన : 41 పుట కూడా చూడండి.




Unfiled Notes Page 32

పెద్దోరి తీపి గురుతులు

సన్నిధానం నరసింహశర్మ
9292055531

# దీక్షాదక్షతలు గల పనిరాక్షసుడు
# వడ్లమూడి గోపాలకృష్ణయ్య



**వ్యా**వహారిక ఆంధ్ర భాషా వ్యాకరణం రాసిన పండిత కవి వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు. హైదరాబాదులోని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంకి వెళ్ళి ఆ సంస్థకు సంచాలకులుగా చేసిన వారి పట్టిక చూస్తే రాష్ట్ర వ్యాప్త కీర్తి మూర్తుల పేర్లు దర్శనమిస్తాయి. అందులో వడ్లమూడి వారి పేరు ఒకటి. ఆయనకు రాజమంద్రంలోని అద్దేపల్లి నాగేశ్వరరావు అద్దేపల్లి వివేకానందాదేవిగార్ల సరస్వతీ ప్రెస్సుతో, అద్దేపల్లి ప్రచురణలతో మంచి సంబంధాలుండేవి. అద్దేపల్లి అండ్‌కో వారు వడ్లమూడి వారి కొన్ని పొత్తాలు అచ్చొత్తించారు. వెలువరించారు. అద్దేపల్లివారికి ఆంతరంగిక ఆలోచనా మార్గదర్శకత్వాల్లో పురిపండావారి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటివారి పాత్ర వుండేది.

సరే అది అలా వుంచితే - ఒక సందర్భాన వడ్లమూడి గోపాలకృష్ణయ్య గౌతమి పొత్తపు గుడికి విచ్చేశారు. నేను గ్రంథ భాండగారిని. పొత్తాల కెరటాలపై కొంతసేపు ఈదులాడి ఆయన - సన్నిధానం... ఈ వూళ్ళో ఆర్.ఎమ్.చల్లా అనే అరుదైన పండితుడు, బహు భాషాభిజ్ఞుడూ వున్నారు. ఆయన ఇంటికి తీసికెళతావా? అన్నారు. పని వేళల్లో గ్రంథాలయ కార్యాలు చూడ్డం- తరువాత విచ్చేసిన సందర్శక ప్రముఖులతో పెద్దల ఇళ్ళకు వెళ్ళడం, ఇంట్లో ఇంకా తిండికి రాలేదని తిట్లు తినడం. ఇవన్నీ నాకు మామూలే, సరదాలే. సరే దానవాయి పేట పార్కు ప్రక్కన అద్దేపల్లి వారింటికి సరిగ్గా ఇవతలే వున్న చల్లా రాధాకృష్ణమూర్తిగారింటికి వడ్లమూడి వారిని తీసుకుని వెళ్ళాను.

ఆర్.ఎమ్.చల్లా ఒక విచిత్ర వ్యక్తి. సమయపాలనకు పెట్టింది పేరు. పది నిముషాలు మాట్లాడడానికి కేటాయించారంటే ఆ సమయం అయిపోతే ఆయన ఇంటి మెట్లనుండి కిందికి దిగిపోతాడు. వెళ్ళిన వాళ్లం వారి ఇంట్లో వుండం కదా,- మనమూ దిగి వచ్చేస్తాం. అటువంటి కాలజ్ఞాని వడ్లమూడి వారికి చాలా సేపు కేటాయించారు. అప్పుడు గోపాల కృష్ణయ్యగారు 'మీ ఆంగ్ల కవిత్వాన్ని మీ నోట వినాలని వచ్చాను. అన్నారు. అనగానే అదినాకూ ఒక అవకాశం అంటూ చల్లా మా ఎదురుగుండా లోపల గదిలోకి వెళ్ళి తలుపు భళ్ళున వేసుకున్నారు. వడ్లమూడివారూ నేనూ ఒకళ్ళ ముఖం ఒకరు చూసుకుంటుండగా - ఎదుట గదిపైభాగాన అమర్చబడిన శ్రవణ యంత్రం ద్వారా తమ కవిత్వాన్ని ఆడియో ద్వారా వినిపించారు. తరువాత సాలార్జంగ్ మ్యూజియంలో గడియారపు బొమ్మలా బయటికి వచ్చి 'హౌ ఈజ్ మై పొయిట్రీ మిస్టర్ వడ్లమూడీ!' అన్నారు, చల్లాగారు. మీ కవిత్వాన్ని మీ నుండే వినాలని వచ్చాను అన్నారు వడ్లమూడి. అవును నా నుండే నా గొంతునుండే విన్నారు. నా శరీరం ద్వారా ఎదురుగా వుండి వినిపించడం కన్నా నా గొంతు ద్వారా కేవల శబ్దగతంగా మీకు వినిపించడమే మంచిది. మధ్యలో ఈ శరీరం కనపడక్కర్లేదుగా అన్నారు చల్లా. అవాక్కయ్యారు వడ్లమూడివారు. బయటకు వచ్చేస్తున్నప్పుడు - సన్నిధానం, మీ వూళ్ళో పండితులు చాలా చిత్రమైన వాళ్లే అన్నారు. అబ్బుర పాటుతో.

వేదాలను అనుసరించడం మాట అల్లా వుంచితే అందులో ఏమున్నాయో తెలుసుకోవడం జ్ఞానదాహానికి సంబంధించింది. ప్రపంచంలోని అత్యంత ప్రాచీనమైన 'రికార్డులు' గా మాక్సుముల్లర్ నోటబలికాడు. మళ్ళీనాకు జన్మ అంటూ వుంటే వేదాలు, ఉపనిషత్తులు పుట్టిన భారతదేశంలో పుట్టాలని వుంది - అది రాసుకున్నాడు.

వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారికి పండితునిగా, రచయితగా ప్రముఖ కీర్తి వుంది. ఆయనలో మనం గ్రహించవలసిన మరో గొప్పకోణం వేద పరిశోధన, వేదజ్ఞానాసక్తి.

ఉత్తరాంధ్రకు చెందిన కళ్ళికోటలో కళాశాలా పండితుడుగా పనిచేసిన నేమాని వేంకట నరసింహశాస్త్రిగారు యావత్తు ఋగ్వేదాన్ని సరళ సుబోధక శైలిలో పద్యానువాదంగా చేశారు. ఆ మహానుభావుడు కొన్ని సంపుటాలుగా రాసిన ఆ అనువాద వ్రాత ప్రతులు కొంతకాలం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భద్రపరచబడినాయి. తరువాత పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి పుణ్యమా అని ఆ రాత ప్రతులన్నీ శ్రీ గౌతమీ గ్రంథాలయానికి చేర్చబడి చాలాకాలం అచ్చుకు నోచుకోక ఎదురు చూపులతో ఉండిపోయాయి. మహీధర జగన్మోహనరావు కొన్ని మచ్చు పుటలు వేసి అచ్చు అవసరాన్ని తెలుపుతూ కరపత్రాలు పంచారు. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల్లో. అముద్రిత ఆంధ్రీకృత ఋగ్వేద సంహిత రాత ప్రతుల అచ్చు ఆవశ్యకతపై నేను కొన్ని దిన పత్రికలకు లేఖలు కూడా రాశాను. పందిరి మల్లికార్జునరావు తమ 'సుభాషి' పత్రికలో నేమానివారి వేదానువాద పద్యాలు కొన్ని ప్రకటించారు కూడా. రెవరెండ్ కె. ప్రశాంతకుమార్ అధ్యక్షునిగా గౌతమీ గ్రంథాలయ నిర్వహణ వున్న కాలంలో వడ్లమూడి వారు ఆ రాత ప్రతుల్ని చూశారు. పాలక వర్గంతోనూ, తిరుమల తిరుపతి దేవస్థానం వారితోనూ అనుసంధాన కృషి చేశారు. బేరం రామస్వామి అనే కలప వర్తకుడు, గౌతమీ గ్రంథ కోశాధికారి, పాలక వర్గ సభ్యుడు, పత్రికా విలేఖరి కంచుమర్తి శ్రీరాములు ఋగ్వేద పద్యానువాద వ్రాత ప్రతుల్ని శిరోధార్యం చేసుకుని తిరుపతి తీసుకెళ్ళడం మరపురానిది. తెన్నేటి విశ్వనాథం వంటివారూ రాత ప్రతుల అచ్చు అవసరాన్ని ఉద్ఘాటించేవారు.

వడ్లమూడి వారిని వేద పరిశోధకుడనడానికి శషభిషలు అనవసరం.

ఇంతింత లావుపాటి పెద్ద సైజు సంపుటాలుగా తిరుమల తిరుపతి దేవస్థానంవారు నేమాని వారి శ్రీమదాంధ్రీకృత పద్య ఋగ్వేద సంహితను లక్షల ఖర్చుతో వేసినవి చూస్తూంటే - ఆ అచ్చు సంపుటాలు కాక అచ్చమైన దీక్షా దక్షతలతో ఒక పనిరాక్షస కృషే దర్శనమిస్తుంది. ఆ దర్శనంలో వడ్లమూడి గోపాలకృష్ణయ్య ఆత్మదర్శనం కూడా వుంది.

ఓ సందర్భంలో హైదరాబాదు చిక్కడపల్లిలో వడ్లమూడి వారింటికి వెళ్ళాను. ఆశ్చర్యం - వడ్లమూడి వారు కుటుంబ సభ్యుల మధ్య నుండి పద్య ఋగ్వేదం అచ్చు కాగితాల్ని చదువుతున్నారు. ఆ కుటుంబ సభ్యులు కూడా ఆయన కృషి భాగస్వాములై చుట్టూ కూర్చున్నారు.

పుస్తకాల ముద్రణ అయ్యాక నేను ఆయనను కలసినప్పుడు ఆ

**(తరువాయి 37వ పుటలో...)**

భాషోద్యమ కథానిక

# అమ్మమాట

డా॥. వేదగిరి రాంబాబు
9391343916



అమ్మ... అమ్మ మాట... అమ్మ భాష... అమ్మ దేశం...అన్నింటికి దూరంగా తనింకెన్నాళ్ళు ఉంటాడు? తిరిగి మాతృదేశం వెళ్ళి పోవాలి. మాతృభాషలో మాట్లాడుకోవాలి. తననింతటివాణ్ణిచేసిన 'అమ్మ రుణం' తీర్చుకోవాలి. నేను పెరిగినట్లే నా పిల్లలూ అమ్మ మాటతోనే పెరగాలి. మమ్మీ డాడీల సంస్కృతితో కాదు!

**"అ**మ్మా! ఆకలేస్తోంది... అన్నం పెట్టు...హడావిడిగా ఇంట్లోకి పరుగెత్తుకుంటూ వచ్చి ఆయాసపడుతూ అమ్మనడిగాడు. అప్పుడు తనకి అయిదేళ్లుంటాయి.

"ఆకలేసిన తర్వాత అమ్మ, ఇల్లూ గుర్తుకు వచ్చాయా నాన్నా!" కొడుకుని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ లాలిస్తూ అడిగింది అమ్మ.

అమ్మ మాటకి ఏమని జవాబు చెప్పాలో అర్థంకాలేదు కృష్ణకి. "అది కాదమ్మా... మన వాకిట్లోనే ఆడుకుంటున్నాం నేను, మన పక్కింటి రాజు..." తడబడ్డాడతను.

అమ్మమాటతో "ఇంకెన్నాళ్ళులే నీ ఆటలు! వచ్చే నెలలో స్కూల్‌కి పంపిస్తాంగా!" నవ్వుతూ అమ్మ మామూలుగా అన్నా తన మనసు చివుక్కుమంది.

వచ్చే నెల నుంచి తనిలా ఆడుకోలేడా?

స్కూల్‌లో చదువు చెప్పే మాస్టారు చదువుకోకపోతే కోప్పడతారట?

స్కూల్‌లో ఆయన పక్క పిల్లలతో కూడా మాట్లాడుకోనివ్వరట! ఎప్పుడు 'ఇంకా చదువు' అంటూ కోప్పడుతూనే ఉంటారట. ఇంటికెళ్ళిన తర్వాత కూడా ఆడుకోవడానికి వీల్లేకుండా బోల్డంత హోమ్‌వర్క్ ఇస్తారట!

స్నేహితుడు రాజు వాళ్ళన్నయ్య మురళి చెప్పిన మాటలు చటుక్కున గుర్తుకు వచ్చాయి తనకి.

"ఏమిటాలోచిస్తున్నావ్. కంచంలో అన్నం పెట్టాను. కాళ్ళు, చేతులు కడుక్కుని రా..." అమ్మ వంటింట్లోంచి కేక వేయడంతో ఆలోచనల్ని తాత్కాలికంగా విరమించుకుని పెరట్లోకి పరుగెత్తాడు తను ––

మొదటి రోజు స్కూల్ కాగానే "మమ్మీ" అంటూ తను బాగ్‌తో పరుగెత్తుకొచ్చాడు ఆనందంగా.

అమ్మ జవాబియ్యలేదు. తన ఆనందం మీద తల్లి నీళ్ళు పోసినట్లు జావగారిపోయాడు!

"మమ్మీ!" తేరుకుని మళ్ళీ ఆనందాన్ని పుంజుకుంటూ అమ్మ దగ్గరకు చేరాడు తను.

కానీ అతడిని అమ్మ ఎప్పట్లా దగ్గరకి తీసుకోకపోవడం బాధగా అనిపించింది.

"ఎందుకు మమ్మీ అలా ఉన్నావు కోపంగా" తను అమ్మ కొంగుపట్టుకుంటూ అడిగాడు.

"మమ్మీ అంటే ఏమిటో తెలుసా? అమ్మ శవపేటిక" అమ్మ గొంతులో కోపం!

అమ్మమాట, పెద్దకర్రతో వీపుమీద గట్టిగా కొట్టినట్లనిపించింది కృష్ణకి.

"నాకు అర్థం తెలీదు మమ్మీ... తెలీదు అమ్మా! ఆ స్కూల్లో అందరూ అమ్మని మమ్మీ అంటుంటే ఇంటికి వచ్చిన నేనూ అలా పిలిచాను. అంతే!"

అమ్మ కోపం పోయింది!

"మళ్ళీ ఎప్పుడూ అలా పిలవకుండా ఉంటావని కోపం తెచ్చుకున్నాను. అంతే!" నవ్వుతూ తనను ఎత్తుకుంది అమ్మ.

కాళ్ళు, చేతులతోబాటు వళ్లంతా తడిగుడ్డతో తుడిచి మరో చొక్కా లాగూ వేసింది అమ్మ.

ఇంత ప్రేమగా చూసే అమ్మకి తనలా పిలిచేసరికి ఎంతకోపం వచ్చింది! అమ్మకి కోపం వస్తే తను తట్టుకోగలడా? భయంతో అమ్మని గట్టిగా కౌగిలించుకున్నాడు తను.

"అదేమిటిరా... అలా చేస్తున్నావ్!" అమ్మ నవ్వింది.

"అమ్మకి కోపం వస్తే భయం వేయదా?" గోముగా అడిగాడు తను ——

మరోసారి "మరెవరైనా సాయం చేస్తే 'థాంక్స్' అనాలని, ఎదుటివాళ్ళకి బాధకలిస్తే 'సారీ' అనాలని స్కూళ్లో మాష్టారు చెప్పారమ్మా..." అన్నాడు తను.

"అది ఆంగ్లేయుల సంస్కృతి. మన సంస్కృతి పొరబాటున కూడా ఎవరికీ బాధ కలిగించవద్దంటుంది! మంచిచేస్తే కృతజ్ఞతలు చెప్పమంటూ, తప్పు చేస్తే క్షమాపణలు చెప్పమంటుంది. కొత్త విషయాలు తెలుసుకో...మన పద్ధతుల్ని మరచిపోకు!" అమ్మ మాటలు అర్థమయ్యీ, అర్థం కానట్లున్నాయి తనకి.

"స్కూల్ నుంచి రాగానే ఆ యూనిఫారమ్ విప్పేసి, మనింట్లో ఉన్న మరో జత దుస్తుల్ని వేసుకున్నావా? లేదా? అలాగే అక్కడి మాటల్ని ఇక్కడ హోమ్‌వర్క్‌చేసుకోవడం వరకే పరిమితం చేయ్! ఆ ఆంగ్లం స్కూల్లోనే.. ఇంటిదగ్గర అమ్మ భాష...అమ్మమాట! మీ మాస్టారు నీకు బతుకు విద్యనేర్పితే, నేను మనగురించి, మన అలవాట్లు, ప్రవర్తన నేర్పుతాను అంతే!" ఖచ్చితంగా అంది అమ్మ.

అమ్మకి మళ్ళీ అలా కోపం తెప్పించకూడదనుకున్నాడు తను. చిన్న వయసులో జరిగినా ఆ సంఘటన తన మనసులో అలాగే ముద్రించుకుపోయింది.

ఇంకోసారి చేతిలోంచి సన్నని ముక్కుతో ఉన్న పెన్సిల్ జారి కిందపడింది.

అది గమనించని అతను లేచి చటుక్కున దానిమీద కాలేశాడు.

ఒక్కసారి నోట్లోంచి తెలీకుండానే వెలువడింది "అమ్మా...!" అన్నమాట.

"చూసావా? ఆకలి వేస్తేనేకాదు నొప్పి కలిగినా కూడా గుర్తుకొచ్చేది అమ్మ భాషలోని ఆ మాటే!" అమ్మ నవ్వింది. అమ్మకోప్పడక నవ్వినా అమ్మమాట మనసులో నాటుకుపోయింది!

అమ్మమాటంతే! అంతనిక్కచ్చిగా ఉంటుంది!

రాత్రి చాలాసేపు చదువుకుంటూ కూర్చుని, రాసుకుంటూ - కుర్చీలోంచి లేచేసరికి తెలీకుండానే వళ్ళు విరుచుకుంటూ "అమ్మా..." అన్నాడు కాస్త గట్టిగానే తను.

"ఏంట్రా నాన్నా..." గబగబా తన గదిలోకి వచ్చి అడిగింది అమ్మ.

"అబ్బే.... నిన్ను పిలువలేదమ్మా... వళ్ళు విరుచుకుంటుంటే నాకు తెలికుండానే అమ్మనే మాట అలా వచ్చేసింది!"

అతని మాటలకి అమ్మ నవ్వి లోపలకు వెళ్ళిపోయింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు! ఆమె చెప్పకపోయినా తనకి అర్థమయ్యాయి.

గత జ్ఞాపకాలన్నీ ఒక దాని తర్వాత మరోటి గుర్తుకొచ్చాయ్ కృష్ణకి. అమ్మ గుర్తుకొచ్చింది. అమ్మ మాట గర్తుకొచ్చింది. అసలు తను వాటిని మరచిపోతేగా - గుర్తుకు వచ్చాయనుకోవడానికి!

అమ్మ తనని విడిచి సుదూరలోకానికి వెళ్ళిపోయినా అమ్మ రూపం, అమ్మ మాట - అలాగే శాశ్వతంగా తన మనసులో ఉండి నడిపిస్తూనే ఉంది. మంచి భవిష్యత్తుకోసమనే భ్రమలో తను అమ్మ దేశాన్ని విడిచి దూరంగా వచ్చేసినా అమ్మకి తను దూరమెలా కాగలడు?

అమ్మ... అమ్మ మాట... అమ్మ భాష... అమ్మ దేశం...అన్నింటికి దూరంగా తనింకెన్నాళ్ళు ఉంటాడు? తిరిగి మాతృదేశం వెళ్ళిపోవాలి. మాతృభాషలో మాట్లాడుకోవాలి. తననింతటివాణ్ణిచేసిన 'అమ్మ రుణం' తీర్చుకోవాలి. నేను పెరిగినట్లే నా పిల్లలూ అమ్మ మాటతోనే పెరగాలి. మమ్మీ డాడీల సంస్కృతితో కాదు!

ఓ స్థిరనిశ్చయానికొచ్చి భార్యతో చెప్పాడు కృష్ణ.

'తనకి గర్భం వచ్చిందని చెప్పినప్పటి నుంచి భర్త ఏవేవో ఆలోచనలతో సతమతమవుతున్నా'డని గుర్తించిన భార్య ఓ చిరునవ్వుతో సమాధానమిచ్చింది.

ఆ నవ్వులో అతనికి అమ్మ నవ్వు గుర్తుకు వచ్చింది. తనకి పుట్టబోయే కొడుకుకి 'అమ్మ మాటే కావాలి. మమ్మీ ఆలన అక్కర్లేదు! ఆ మాటే భార్యతో ఆవేశంగా అన్నాడు కృష్ణ.

ఆమె నవ్వింది.

ఆ నవ్వులో అమ్మమాట... అమ్మ మళ్లీ మళ్ళీ గుర్తుకు వచ్చింది కృష్ణకి.

---

35వ పుట తరువాయి... **వడ్లమూడి గోపాలకృష్ణయ్య**

పీఠికల్లో ఆయన పాండిత్యమూ దర్శనమిచ్చింది. కేంద్ర విదేశాంగ శాఖామంత్రిగా శ్రీ పి.వి.నరసింహారావు రాసిన అందులో ఓ పీఠికను చూడమన్నారు. చూశాను, చదివాను. ఇది పి.వి.గారు రాశారా ఆయనకు తీరిక లేక మీరు రాశారా అన్నాను ప్రేమ పూరితమైన చనువుతో. ఏం ఎందుకలా అనుకొంటున్నావు అన్నారు. ఏం లేదులేండి ఆ పీఠికలో మీ గురించి రాసినప్పుడు మీ బిరుదులన్నీ ఇచ్చారు, అన్నాను. భలేవాడివే అని నవ్వుకున్నారు. అర్థవంతమైన నవ్వే అది.

పొత్తపు గుడుల్లో తి.తి.దే. వేసిన ఆ పెద్ద సంపుటాల్ని చూస్తున్నప్పుడు గౌతమిలో దానికి చెందిన రాత ప్రతుల దుమ్ము దులపడం, భద్రపరచడంలో మా సిబ్బంది పాత్ర - ముద్రిత గ్రంథాల్లోని పద్యాలేకాక - అచ్చుకృషి నేపథ్యాలూ కళ్లముందు కదలాడడం-ఎప్పటికీ తీపి గురుతులే. పెద్దవారితో చిన్నవాడిగా నా తీపి గురుతులు నాకు సంజీవకారణులే! జీవన రసాయనాలే.

– కీ.శే. యార్లగడ్డ
బాలగంగాధరరావు

# వివాహిత స్త్రీల ఇంటిపేర్లు ఎందుకు మారుతున్నాయి?

**కొంత** కాలం క్రితం 'మీ ఇంటి పేరెలా వచ్చింది' అని ఆంధ్రజ్యోతిలో ఈ రచయిత నిర్వహించిన శీర్షికకు ప్రతిస్పందిస్తూ పాఠకులు అడిగిన ప్రశ్నల్లో ఇది ఒకటి. అయితే మారి తీరాలి అని నిర్దేశం చేసినట్లు గాని లేక అలాంటి చట్టం ఉన్నట్లు గాని దాఖలా ఏమీ లేదు. కాని మారుతున్న మాటనిజం. ఇది ఒక ఆచారం అని సరిపెట్టుకోవచ్చు. అయితే ఆచారం ఏర్పడడానికి కూడ ఏవో కారణాలుండాలి.

వ్యక్తికి పేరు సమమైన గుర్తింపు కొరకు. సమూహం నుండి వ్యష్టిని గుర్తించడం కొరకు. ఇంటి పేరు, ఆ గుర్తింపును మరింత సమగ్రంగావించడం కొరకు. ఇంత మేరకు స్త్రీ, పుం వివక్షలేదు. వివక్ష ప్రారంభమైంది వివాహిత స్త్రీల విషయంలో. అలా ఎందుకు జరుగుతోంది అనేది ప్రశ్న..

ఈ ప్రశ్న భారతీయ సమాజంలో మాత్రమే ఉత్పన్నమైనది కాదు. ఇతరదేశాల్లో కూడా వచ్చింది. బహుశా ఆ స్ఫూర్తే ఇక్కడ పనిచేసి వుండవచ్చు. ఇది సమాజంలోని పురుషాహంకారానికి నిదర్శనమన్న వారు కూడ వున్నారు. ఇతర దేశాల్లో ఈ విషయమై న్యాయస్థానాల నాశ్రయించడం కూడ జరిగింది. వివాహిత, భర్త ఇంటిపేరు లోనికి మారడం, మారక పోవడం అనేది ఆ స్త్రీ ఇష్టాయిష్టాలకు వదిలివేస్తూ, సమాజానికి, లేక లౌకిక వ్యాపారానికి సంబంధించినంత వరకు అలా మారడం అనేది అవసరమని ఉట్టంకించాయి. కాని ఆ ఆచారానికి కారణాలు వివరింపలేదు. కారణమేమై వుంటుంది. లోకంలో చాల ఆచారాలుంటాయి. కొన్నింటికి కారణాలు తెలియవస్తాయి. కొన్నింటికి తెలియరావు. కారణం, ఆ ఆచారం మొదలు ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు గల కాలంలోని అంతరం. మొదలు కారణమున్నా, ఆ కారణమేదో ఇప్పుడు అంది రాక పోవడం. అందిరావడం లేదు గనుక, దానిని పాటించడం మానివేస్తున్నారా! లేదు. ఎందువలన. అవి సమాజపు విలువలుగా రూపుదిద్దుకున్నాయి గనుక. అయితే పూర్వపు ఆచారాలనన్నింటిని పాటిస్తున్నారా అంటే – అదీ కనుపింపదు. అంటే కొన్ని పాటింపబడుతున్నాయి. కొన్ని పాటింపబడటం లేదు. పాటింపబడుతున్నవి మాత్రం, చట్టం కంటె బలీయమైనవి. నిజానికి చట్టం వాటి జోలికి వెళ్లదు. కారణమేమిటి! చట్టంకాని, ఆచారంగాని, బహుజనులకు హితవును, సుఖాన్ని కలిగించాలి తప్ప కష్టం కలిగింపరాదు. అలాగే కొన్ని 'కుల' కట్టుబాట్లుంటాయి. వాటిని అనుసరింపక పోతే, అనుసరించడం ఇష్టం లేక కోర్టు నాశ్రయిస్తే కోర్టుకూడ, ఆ కట్టుబాటుకే విలువనిస్తుంది తప్ప, దానిని అతిక్రమించే విధంగా తీర్పునివ్వదు. కారణమేమిటి. చట్టాలు, నిబంధనలు, న్యాయసూత్రాలు – ఒకప్పటి ఆచారాలు, వాటి పాటింపు మొదలైన వాటి క్రోడీకరణమే గనుక. అలాంటి క్రోడీకరణలలో ఈ ఇంటి పేరు మారడం, మారక పోవడం అనేది ఎందుకు చోటు చేసుకోలేదు. ఇదొక్కటే అన్నమాటేమి, చాలా చోటు చేసుకోలేదు. అలాంటి వాటిల్లో ఇదొకటి. ఇక ముందు చోటు చేసుకుంటుందేమో. అది ఇప్పటికిప్పుడు చెప్పగలిగింది కాదు. ఏమైనా ఆచారం మాత్రం బలీయమైనది.

ఇక విషయానికి వస్తే, ఎందుకు మారాలి, లేక ఎందుకు మారుతోంది అనే ప్రశ్న ఎవరి నుండి ఉత్పన్నమైంది. విద్యావంతులైన స్త్రీల నుండి, వివాహం తరువాత, వీరికి సంబంధించిన రికార్డులు మార్చుకోవలసి రావడం చేత మాత్రమేనన్నది గుర్తుంచుకోవాలి. – అలా మార్చకపోయినా ఇబ్బంది కలుగని చోట, వివాహితులైన విద్యావంతులైన స్త్రీలు, తమ వివాహత్పూర్వపు ఇంటి పేర్లతోనే కొనసాగుతున్న వారు లేకపోలేదు. అంటే అవసరం కారణమవుతోంది. ఇబ్బంది లేని చోట కూడ మార్చుకోవలసిందేననే నిర్బంధము భర్త నుండి, లేక అత్తవారింటి నుండి ఎదురైతే అది వ్యక్తినిష్టమే తప్ప, 'మారితీరాలి' అన్న చట్టమున్నట్లు లేదు. విద్యావంతురాంధ్రు కాని స్త్రీల విషయంలో ఈ సమస్య ఉత్పన్నం కాదు. కారణం లౌకిక వ్యవహారంలో స్త్రీల విషయంలో ఇంటి పేరుతో పని లేదు గనుక, పురుషుల విషయంలో వుందా – అంటే అదీ అనుమానమే. లిఖిత పూర్వకమైన వ్యవహారం లేని చోట ప్రత్యేకంగా ఇంటిపేరు ఉట్టంకించనవసరం లేదు. స్త్రీల విషయంలో కూడ, వారు విద్యావంతులు కాకపోయినా, ఓటర్ల లిస్టులో, ఒకవేళ వ్యష్టిగా జీవిస్తున్న వేళ, రేషనుకార్డు, తపాలాచిరునామా ఇలాంటి విషయాల్లో, ఇంటిపేరు తప్పదు. దీనిని బట్టి లిఖిత వ్యవహారంలో, ఇంటిపేరు అవసరమవుతోంది. అది పురుషుని విషయంలో తప్పనిసరి. కాగా, స్త్రీల విషయంలో కొన్ని అవసరాలను బట్టి, విద్యావంతులైన స్త్రీల విషయంలో మరిన్ని అవసరాలను బట్టి ఇంటిపేరు అవసరమవుతోంది. ఇక మార్పు కన్పిస్తోంది స్త్రీల విషయంలో మాత్రమే. (స్త్రీలు అంటే ఇకనుండి విద్యావంతులైన వారిని ఉద్దేశించి మాత్రమేనని గ్రహించాలి). పురుషుల విషయంలో మార్పులేదు. ఇలా ఎందుకు జరిగిందనేది ప్రశ్న.

మార్పు జరగడమనేది లిఖిత వ్యవహారంలో స్ఫుటంగా కన్పిస్తుంది. వాగ్వ్యవహారంలోనికి వచ్చేటప్పటికి, అలా వుండదు. ఒక వ్యక్తిని గూర్చి (స్త్రీ గాని, పురుషుడు గాని) ఆరా తీసేటపుడు, ఎవరు అనే ప్రశ్నకు ఫలానా వారి అబ్బాయి, లేక అమ్మాయి (వివాహితులు కానపుడు), వివాహిత స్త్రీ అయినపుడు ఫలానా వారి భార్య అని గదా సమాధానం. పాఠశాలలో చేర్పించవలసిన చోట, విధిగా, ఆ వ్యక్తి తండ్రి ఎవరో సూచింపవలసి వుంది. ఈ సూచించడమనే ప్రక్రియ, వివాహం తరువాత మార్పు అనే దానికి కారణమైనది. పురుషుని విషయంలో మార్పులేదు. వివాహిత స్త్రీ విషయంలో పైన సూచించిన సందర్భాలను బట్టి మారుతోంది. దీనిని బట్టి నమోదు అనేది లేకపోతే మార్పు అనేది లేదు. కారణమేమంటే సాధారణ వ్యవహారంలో ఇంటి పేరుతో అందునా – స్త్రీల విషయంలో పనిలేదు గనుక. పురుషుని విషయంలో ఎందుకుంది అంటే, ఆ కుటుంబానికి అతడు వారసుడు గనుక, అతని తండ్రి తరువాత ఆ కుటుంబానికి అతడు యజమాని గనుక. ఆ కుటుంబపు ఆస్తి అతనికి సంక్రమిస్తుంది గనుక, తత్సంబంధమైన వ్యవహారాన్ని బట్టి, అవసరాన్ని

బట్టి, ఇంటిపేరు వ్యక్తపరుపవలసి వస్తుంది గనుక. స్త్రీ విషయంలో పై కారణాల ప్రమేయం లేదు గనుక, అది వ్యక్తీకరింపబడే అవకాశముత్పన్నం కాదు. ఉత్పన్నమైన వేళ, ఆమె ఫలానా వారి భార్య అని చెప్పబడుతుంది. ఆ వ్యవహారాలతో ప్రమేయమేర్పడే నాటికి వివాహితురాలు కాకపోతే ఫలానా వారి కుమార్తె అని వ్యవహరింపబడుతుంది. అప్పుడైనా, (ఫలానా వారి కుమార్తె అన్నపుడు) తండ్రి ఇంటి పేరు ఉట్టంకింపబడడం లేదా – అంటే, (వివాహిత అయితే భర్త ఇంటిపేరుతో) ఉట్టంకింపబడవచ్చును. అది లేఖరి విన్యాసమే తప్ప, ఉట్టంకించకపోయినా, చట్టపరమైన ఇబ్బందిలేదు. పురుషుని విషయమైనా (ఫలానా వారి కుమారుడు అని చెప్పేటప్పుడు) అంతే..

అంటే విద్యాసంబంధమైన వ్యవహారాలు, యోగ్యతా పత్రాలపై నమోదు విషయంలో మాత్రమే, ఇంటిపేరు ప్రసక్తి వస్తోందనేది స్పష్టము. ఇది వివాహత్పూర్వం, యువతీ యువకుల విషయంలో సామాన్యం. పై విధమైన వ్యవహారం లేనిచోట్ల ఈ మార్పు అనే ప్రసక్తికి ఆస్కారం లేదు అనే విషయం జ్ఞాపముంచుకోవాలి. అదే సమయంలో చట్టపరమైన ఆంక్షలు కూడ లేవని కూడా గుర్తుంచుకోవాలి. వివాహ కార్యక్రమంలో గూడ గోత్రనామానికే తప్ప, ఇంటి పేరు ప్రసక్తి లేదు సరికదా, ఒకే ఇంటి పేరున్నా (వధూవరులకు) గోత్రభేదమున్నపుడు సంబంధ బంధుత్వానికి అడ్డులేదు. మూడు తరాల నుండి, వధూవరుల కుటుంబాల మధ్య ఏవిధమైన బంధుత్వం లేనపుడు, వారు ఏకగోత్రజు లైనప్పటికి వివాహాలు గావింపవచ్చునని కూడా వెసులుబాటు వుంది. కాబట్టి ప్రాధాన్యం వహిస్తోంది. గోత్ర గృహనామాలు కాదని, జన్య సంబంధమైన కారణాలేనని బోధపడుతోంది.

అయితే వివాహం తరువాత పురుషుడు, తన తండ్రి ఇంటి పేరుతో అంటే తనదైన 'కుటుంబనామం'తోనే వ్యవహరింపబడుతున్నాడు. కాని స్త్రీల విషయంలో అలా గాక, వివాహం తరువాత, తన తండ్రి కుటుంబనామం నుండి, భర్త కుటుంబనామంలోకి మార్చబడడం జరుగుతుంది. (అది కూడ పైన వివరించిన సమస్యల వల్లనే తప్ప సాధారణ లోక వ్యవహారంలో దాని ప్రసక్తి లేదని, అదికూడ విద్యావంతులైన స్త్రీల విషయంలో మాత్రమేనని గుర్తుంచుకోవాలి). ఇలా ఎందుకు మారాలి అనేది సమస్య. మార్చుకోవడం ఇష్టంలేని వారు, మార్పుతో అవసరం లేదనువారు (యోగ్యతాపత్రాలు మొ॥ వాటి విషయంలో) వివాహం తరువాత కూడ తమ తండ్రుల కుటుంబ నామాలతోనే లౌకిక వ్యవహారాలలో కొనసాగుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో. అలాంటి వారి విషయంలో సంఘం నుండి ఎట్టి అభ్యంతరం ఎదురుకాలేదు. నిజానికి ఈ వ్యవహారాల్లో సంఘానికి ప్రమేయమే లేదు. చట్టం కూడా దానికి ఎలాంటి ప్రాధాన్యము ఇవ్వడం లేదు. వివాహస్థితిని నిరూపించడానికి, ఇతర ఆధారాలను పరిగణనలోనికి తీసుకొంటారు తప్ప, ఇంటి పేరు మారిందా లేదా అన్న దానిని పరిగణింపరు. ఇక సమస్య అంతా భర్త నుండి, ఇతర కుటుంబసభ్యుల నుండి వత్తిడి వచ్చినపుడు, అలా మారడం ఆత్మన్యూనతగా భావింపబడుతున్నపుడు మాత్రమే ఇది ప్రసక్తమవుతోంది. ఎప్పుడైనా, ఏ విషయంలోనైనా, ఇలా జరగవలసిందే నన్నపుడు మాత్రమే, అలా ఎందుకు జరగాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది. అందులో ఆత్మ గౌరవమనే విషయం చోటుచేసుకుంటే, అది సమస్యగా పరిణమిస్తుంది. అలా లేనపుడు ఆ సమస్యకు ఉనికియే లేదు.

మారి తీరాలి అంటున్నవారు కూడ, అది ఆచారం గనుక, అలా మారకపోతే, తమకు, తమ కుటుంబ ప్రతిపత్తికి, గౌరవానికి ఏదో భంగం కలుగుతుందనే అపోహతోనే తప్ప, ఎందుకు మారాలో స్పష్టమైన అవగాహన లేదు. ('ఎందుకు మారాలో' అనే మాట వలన, ఈ రచయితకు అలా మారితీరాలి అనే అభిప్రాయం వుందని భావింపవలదు. విషయ వివరణ కొరకు మాత్రమే ఆ పదం ఉపయోగింప వలసి వచ్చింది). అలాగే, పురుషుని విషయంలో మార్పులేనపుడు స్త్రీ విషయంలో మాత్రమే ఈ మార్పు ఎందుకుండాలి అనే వారిలో కూడ, పంతమే కనిపిస్తుంది తప్ప, ఆచారమే అయినా, అది ఎందుకు అలా ఏర్పడిందోననే దానిపై స్పష్టమైన అవగాహన ఉన్నట్లు కనుపింపదు. ఇలా అనడానికి కారణాలున్నాయి. అవేమిటో ముందు చూసి, తరువాత ప్రధాన విషయానికి వద్దాము.

విద్యావంతురాండ్రు కొందరైనా, తమపేరు తరువాత, భర్తల ఇంటి పేర్లు చేర్చుకుంటున్న వారు గలరనేది నిర్వివాదం. ఇలాంటి వారిలో ఇంటి పేరు ఎందుకు మారాలి అనేవారు కూడా ఉండి ఉండవచ్చు. అలాగే మార్చుకున్నవారు కూడా ఉండి వుండవచ్చు. వారు పై రెంటిలో ఏ వర్గానికి చెందినా, కావలసిన విషయం, వివాహితులు తమ భర్తల పేర్లు, తమ పేర్లకు ఎందుకు జోడిస్తున్నారనేది. మీదు మిక్కిలి అది నాగరకతగాను, సంస్కారానికి ప్రతీకగాను భావింపబడుతోంది. (అందరి విషయంగాదు. అలా భావించే వారి విషయం మాట) ఇది మన తెలుగు సమాజంలో స్థూలంగా స్వాతంత్ర్యానంతరం ప్రారంభమైంది! అక్షరాస్యత పెరగడం, ఇతర ప్రాంతాలతో, అక్కడి ఆచార వ్యవహారాలతో సంసర్గం ఏర్పడడం కారణంగా ఇది ప్రారంభమైంది. ముఖ్యంగా రచయిత్రులు దీనిని పాటిస్తున్నట్లు కనుపిస్తుంది. పై కారణాలు దీనికి మూలం. కాగా ఇది కేవలం అవగాహనా లోపం వలన జనించిన అనుకరణ మీది మోజుతో చోటు చేసుకుంది. దీనికి గల కారణాలు. పాశ్చాత్య ప్రపంచం లోను, ఉత్తర భారతదేశంలోను, దక్షిణాదిలో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోను, మన అనుసరణకు భిన్నంగా, కుటుంబనామాలు వ్యక్తుల పేర్ల చివర వుంటాయి. ఉదా : విలియం వర్డ్స్ వర్త్, జాన్ ఫిట్జరాల్డ్ కెనడి, మొరార్జీదేశాయి, వల్లభభాయిపటేల్, సుబ్రహ్మణ్యం పిళ్ళ, శంకరన్ నంబూద్రి, వీనిలో వర్డ్స్ వర్త్, కెనడి, దేశాయి, పటేల్, పిళ్ళ, నంబూద్రి అనేవి ఆయా వ్యక్తుల కుటుంబ నామాలు. కాని వాటిని వ్యక్తి నామాల్లోని భాగంగా పరిగణించి, ఇక్కడ తమ భర్తల పేర్లు చేర్చుకోవడం జరిగింది. అన్ని సందర్భాల్లోను ఇలాగే జరగకపోయినా, ఈ భావనే అలా చేయడానికి ప్రోత్సహించింది. అలా తమ భర్తలపేర్లను తమ పేర్ల చివర చేర్చుకున్న స్త్రీలు, తమ ఇంటిపేర్లను అలాగే ఉంచుకున్నారంటే దీనిని అవగాహనాలోపంగా తప్ప ఎలా పరిగణించాలి! వాదానికి అలా కాదని చెప్పవచ్చు. కాని సమమైన ఆలోచనలతో విచారిస్తే సత్యం బోధపడకపోదు.

ఇది ఇలాంటిదైతే, కొందరు, భర్తల ఇంటి పేరు లోనికి ఎందుకు మారాలి అన్నవారు, ఒకటి రెండు సూచనలు గావించారు. అది 1) తమ వివాహత్పూర్వపు ఇంటి పేర్లతోనే – అంటే, పుట్టింటి కుటుంబనామం

**వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది**



Unfiled Notes Page 37

తోనే వ్యవహరించబడాలి అనేది ఒకటి. మరి ఆ పుట్టింటి ఇంటి పేరు కూడ తండ్రిదే గదా? తండ్రి కూడా పురుషుడే గదా! ఇంటి పేరు మారడం, పురుషాహంకార సమాజానికి నిదర్శనము అన్నపుడు, మరో పద్ధతిలోనైనా దానినే పాటించడం ఎలా సబబు అవుతుందో వివేచనకు అందిరాదు. రెండవ సూచన ఏమంటే, తమ సంతతికి, తమ (వివాహితలు) వివాహ త్పూర్వపు ఇంటి పేరు పెట్టాలనడం. ఇందులో గావించిన మరో సూచన ఏమంటే, సంతతిలోని బాలురకు తండ్రి ఇంటి పేరు. బాలికకు తల్లి ఇంటిపేరు ఉండాలనడం. వీటి వలన కాలాంతరంలో ఉత్పన్నమయ్యేది గందరగోళమే తప్ప, పురుషాహంకారాన్ని తప్పించడమెలా అవుతుందో తెలియరాదు. నిజానికి, ఈ ఎందుకు మారాలి అన్న సమస్య పాశ్చాత్య ప్రపంచం నుండి ముఖ్యంగా అమెరికా నుండి దిగుమతి అయింది. అచ్చటి స్త్రీవాదులు పరిష్కారం కొరకు న్యాయస్థానాలను ఆశ్రయింపగా వచ్చిన తీర్పుల విషయం, ఈ వ్యాస ప్రారంభంలో పేర్కొనడం జరిగింది. అది, మారడం, మార్చుకోకపోవడం, అనేది అలా కోర్టు నాశ్రయించిన వారి ఇష్టాయిష్టాలకు వదిలివేయడం. ఆస్తి సంక్రమణం లాంటి విషయాల్లో మారి వుంటే పరిష్కారం సులభమని చెప్పడం జరిగింది. అంతేగాక అది విశ్వవ్యాప్తమైన ఆచారమని చెప్పడం జరిగింది. అంతే తప్ప ఆచారానికి మూలమేమిటో చెప్పబడలేదు. ఈ విషయాలన్నీ అమెరికాలోని న్యూయార్కు నుండి వెలువడే 'నేము' అనే పత్రిక నుండి గ్రహించడం జరిగింది. ఇలా వుండగా ఈ మధ్యకాలంలో 'నడుస్తున్న చరిత్ర' అనే పత్రికలో, ఎందుకు మారాలి అనే విషయంపై ఒక వ్యాసం వెలువడగా, దానిపై ఇరువురు పాఠకురాండ్రు, ఇలాంటి సమస్యలను అనవసరంగా రేకెత్తిస్తున్నారని, అలా మార్చుకోకపోవడం ఇష్టంలేని వారు అలాగే కొనసాగవచ్చని, ఇతరులపై వారి అభిప్రాయాలను ప్రసరింప జేయడం అనవసరమని, ఆ వ్యాసకర్త, తమ నిజ జీవితంలో దానిని ఎందుకు ఆచరణలో పెట్టడం లేదని వ్రాశారు (కారణం ఆ రచయిత్రి మల్లాది సుబ్బమ్మ వివాహిత. వారు తమ భర్త ఇంటి పేరుతోనే కొనసాగుతున్నారు) అంతేగాక ఇది ఒక వికారపు ఆలోచన, వ్యర్థ చర్చ తప్ప మరొకటి కాదని కూడ వ్రాశారు. (చూడు : నడుస్తున్న చరిత్ర, జనవరి, ఫిబ్రవరి 2001). అంతేగాక, ఈ మారడం అనేది ఆనవాయితీగా జరుగుతున్నపుడు, దాని వలన ఇబ్బంది లేనపుడు, ఆ ఆనవాయితీని కొనసాగిస్తే తప్పు ఏమిటి అని వ్రాశారు. దీనిని బట్టి ఈ సమస్య పట్ల వివాహిత స్త్రీలలో ఏకాభిప్రాయం లేదని తెలుస్తుంది. (పై ప్రశ్నలకు ఆ వ్యాస రచయిత్రి సమాధానం ఇవ్వలేదు).

ఇక అసలు విషయానికి వద్దాము. మారడం అనేది ఆచారం. ఈ ఆచారం ఎందుకు ఏర్పడింది అనేది ప్రశ్న. నిజానికి మారడం అనేది లేదు. అంటే వివాహత్పూర్వం స్త్రీకి కుటుంబనామం లేదు. వివాహం తరువాతనే ఆమె ఇంటిపేరు స్థిరీకరింపబడుతోంది. అది భర్త ఇంటి పేరుతో! అయితే వివాహత్పూర్వం పురుషునికి కూడ కుటుంబనామం లేదు. మొదలు వివాహ విషయంలో దీని ప్రసక్తిలేదు. వివాహం తరువాత, వెంటనే కాక పోయినా, కుటుంబాలు విడిపోతున్నాయి. అలా విడిపోయి నపుడు, వ్యవహార సరళి నిమిత్తం, వివాహితుడైన వానికి, అతని కుటుంబ నామం సంక్రమిస్తోంది. తత్పూర్వం, రికార్డులతో పని ఏర్పడినప్పుడు తప్ప, ఇతరత్రా అతడు ఫలానా వారి కుమారుడు అని, ఆమె ఫలానా వారి కుమార్తె అని మాత్రమే వాస్తవమైన వ్యవహార సరళి అని ముందు చెప్పడం జరిగింది. వివాహానంతరం పురుషుడు కుటుంబీకుడు అవుతున్నాడు. అతని భార్య కుటుంబిని అవుతోంది. ఇరువురు, వారి సంతతి అంతా కుటుంబ మవుతోంది. అలా ఆ కుటుంబాని కంతకు కుటుంబనామం స్థిరీకరింప బడుతోంది. ఈ స్థిరీకరణంలో పురుషుని కుటుంబనామం అలాగే వుండగా, స్త్రీకి అప్పటికి గల – అంటే ఆమె తండ్రి కుటుంబనామం, మారుతోంది గదా అనబోతారు. ఇదే గదా అసలు సమస్య! పై వాక్యాల్లో దీనికి సమాధానం వుంది. అయినా మరి కొంత వివరంగా చూద్దాము. వివాహితకు తన కుటుంబం ఏది! తండ్రి కుటుంబమా! లేక తాను, తన భర్త, తన సంతానంతో కూడిన కుటుంబమా! మారడం దోషమైతే, తండ్రి కుటుంబ నామంతో కొనసాగడం మరింత దోషం కాదా! మరి ఆమె సోదరుల కుటుంబనామాలు ఎలా ఉండాలి. ఆమెది, ఆమె సోదరులది ఒకటే కుటుంబనామమైతే, సమమైన గుర్తింపు కొరకు ఏర్పడిన వివక్షకు స్థితి ఏమిటి. ఆమె వల్లనే గదా పురుషుడు కుటుంబీకుడు అవుతోంది. ఆమె కుటుంబిని అవుతోంది. కనుక దీనిలో ఇంటిపేరు మారడం అనే సాధారణ వ్యవహారం గాక, సమాజ మనుగడ అందులోని కుటుంబ వ్యవస్థ అనే అంశాలు ఇమిడి ఉన్నాయి. కనుక అది కేవలం ఇంటిపేరు గాదు. కుటుంబ నామం. ఇది పైకి కనుపించేటంత సాధారణ వ్యవహారం గాదు. కనుకనే ఇది విశ్వవ్యాప్తమైన ఆచారం.

ఇప్పుడు ఈ ఆచారానికి మూలమేమిటో చూద్దాము. పెళ్లివలన గదా, ఈ సమస్య ఉత్పన్నమైనది! అది లేకపోతే ఈ సమస్యే వుండదు. కాని అపుడు సంతతిని ఎలా గుర్తించాలో తెలియదు. అది అలా వుంచినా, పెళ్లి లేని సమాజం స్వీడన్లో అమల్లోనికి వచ్చిందని, అది విఫలమయిందని ఎవరో చెప్పగా తెలిసింది. అయినా ఇప్పుడు దానితో పనిలేదు. మన సమస్య ఇంకా అంతవరకు ఎదగలేదు. పెళ్ళి అంటే వివాహమని అర్థం – అని అనుకుంటారు. నిజానికి కాదు. పెళ్లి అంటే వధువు అని మాత్రమే. మనం పెళ్ళికూతురని ఎవరిని సంభావిస్తున్నామో ఆమె పెళ్లి. అంతే! వివరాలు కావలసినవారు, దీనిని పరిశీలించండి. బాలిక, కన్య, వధువు, భార్య – ఇవి సంస్కృత పదాలు. వీటికి సమమైన పదాలు ఆడపిల్ల, పడచు, పెళ్లి, మగువ (మగనాలునే మగువ అనాలి) అంటే వధువు అనే సంస్కృత పదానికి సమానమైన తెలుగుపదం పెళ్లి, ఈ భాషాచర్చ ఇలా వదలి, వధువు అని ఎప్పుడు అంటున్నామో తెలుసుకుందాము. వివాహం నిశ్చయమైనపుడు, కన్య, వధువు అవుతుంది. అంటే ఏమిటి. ఫలానా వరునికి ఈమె వధువు అని నిశ్చయింపబడిందన్న మాట. దీనికి ఒక కార్యక్రమం వుంది. అది లగ్నాలు పెట్టుకోవడం. అప్పుడు జరుగుతోందేమిటి.

బ్రాహ్మణుల్లోనయితే గోత్రచ్ఛేదనం. ఇతరుల్లో నయితే వరుని ఇంటివారు, ఉద్దిష్ట కన్యను, తమ అమ్మాయి అనిపించుకోవడం. పసుపు కుంకుమలు ఇచ్చి, తాము తెచ్చిన చీరను ఆమెతో ధరింపజేయడం. గోత్రచ్ఛేదనం ఎవరి గోత్రం నుండి. ఆమె తండ్రి గోత్రం నుండి. మారడం,

...తరువాయి 48 పుటలో

తెలుగు మాధ్యమాన్ని తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు

## స్పందన

### తెలుగు లిపి - సంస్కరణావశ్యకత

రంగనాయకమ్మగారు నా వ్యాసంపై స్పందిస్తూ "ఈయన 'ళ' కి బదులు 'ల' నే వాడుకోవచ్చు అన్నారు. ఈ వాక్యం నా వ్యాసంలో లేదు. నేను పొరపాటున గూడ ఇలా అనను. ఇంకెవరైనా అమ్మనుడిలో రాశారేమో వెదకండి.

1. తెలుగు వ్యవహారంలో అ ఇ ల మధ్యస్థంగా వినబడే ధ్వని ఒకటి ఉంది. అవగాహనకోసం ఒక ఉదాహరణ. 1. ఆయన ఇంటిలో పెద్ద మేక + ఉంది. 2. ఆయన ఇంటిలో పెద్ద మేకు + ఉంది. వ్యవహారంలో ఇలా విడదీసి మాట్లాడరు. ఉచ్చారణ త్వరణం వల్ల సంధి జరుగుతుంది. మొదటి వాక్యాన్ని మనస్సులో అనుకొని గట్టిగా పలకండి. అలాఏ రెండవ వాక్యాన్ని మనస్సులో అనుకొని గట్టిగా పలకండి. భేదం మీకే తెలుస్తుంది. గ్రహించలేకపోతే రికార్డు చేసుకొని వినండి. ధ్వని భేదం వున్నా మేకు + ఉంది. = మేకుంది, మేక + ఉంది. = మేకుంది అనే రాస్తున్నాం. ఈ ధ్వని భేదాన్ని గిడుగు రామమూర్తిగారు 102 సంవత్సరాల క్రితమే గుర్తించి డేనియల్ జోన్స్‌తో చర్చించారు. ఈ ధ్వని ఇంగ్లీషులోని 'man, cat, map,bank వంటి పదాలలో వినిపిస్తున్న అచ్చు ధ్వని. కొన్ని ఇంగ్లీషు మాటలు తెలుగులోకి ప్రవేశించడంవల్ల ఈ ధ్వనికి అక్షర సంకేతం ఇవ్వవలసిన అవసరం వుంది. "మేపు', 'మాపు', మా'పు (map)." ఈ 3 పదాలకీ అర్థాలు వేరు.

'ఐ', 'ఔ' లు అచ్చులు కావు. వీటిని డిప్తాంగ్స్ అంటారు. తెలుగులో సంధ్యచ్చులు అని అంటున్నారు.

'ఋ' ఉచ్చారణ గురించి చాలా వివరంగా రాశాను.

'క్ + ఋ = కృ' 'క్ + ర్ + ఉ = క్రు. వీటిలో ఏది సంయుక్తమో ఏది ద్విత్వమో నాకు తెలీదు.

**- అల్లంశెట్టి చంద్రశేఖర రావు** 99496 05141

### 'తెలుగుభాష అక్షరాల/లిపి మార్పు'

'అమ్మనుడి'లో 'తెలుగుభాష అక్షరాల/ లిపి మార్పు' చర్చ కొంత కాలం నుంచి సాగుతున్నది. మంచిదే కాని - పాండిత్య ప్రదర్శన ఎక్కువై ప్రయోజనం తక్కువ అన్నట్లుంది. ఇప్పుడు మనం నిర్ణయాలు చేసినా, ప్రభుత్వం, అకాడమీలు, పత్రికలు అంగీకరించవు - ఆచరణకు నోచుకోవు. వెయ్యేండ్లుగా వచ్చిన లక్షల (కోట్ల?) తెలుగు గ్రంథాల గతేమిటి? అనేది మరో పెద్ద ప్రశ్న.

ఈ పత్రికలో వచ్చిన ఒక నుడికారం 'పత్తిత్తు' వివరణ చూపుతున్న. ఆమె పత్తిత్తా? అంటే, పతివ్రతనా? అనే అర్థంలో వాడుక ఉంది. ఆ లేఖకుడు దీని వివరణ సరిగా ఇవ్వలేదు. దాని వివరణ ఇది - ఏ కాయనైనా పగల్చి విత్తనాల సులభంగా తాకవచ్చు - వేరు చేయవచ్చు. కాని, ప్రత్తిగింజ అట్లా కాదు. దాని చుట్టూ దట్టంగా దూది పీచు ఆవరించి ఉంటది. ఏదీ దాన్ని సులభంగా తాకజాలదు. అంతటి భద్రత మధ్య ఉంటది ప్రత్తి విత్తనం. అందుకే పత్తిత్తు మాట వ్యాప్తికి వచ్చింది.

మరొక్క మాట - ఈ మధ్య ఒక టివి ఛానల్లో 'మన భాషలో గొప్ప ఫీల్ ఉంది' అని వస్తున్నది. అది చూసి ఎవరూ ఫీల్ కాలేదు. నేను మాత్రం చాలా ఫీల్ అయిన. ఫీల్‌కు తెలుగు పదమే లేదా, దొరకలేదా అని.

**-డా॥ మలయశ్రీ** 98665 46220

### "మీరూ పిడుగులు కావాలి"

'అమ్మనుడి' జూన్ 2018 సంచికలో "మీరూ పిడుగులు కావాలి" అన్నది డా॥ వేదగిరి రాంబాబుగారి రచన. అందులో 'గిడుగు' వారి గురించి చిన్నపిల్లలకు చెప్పే కథగా రాసారు. చాలా సంతోషించదగిన విషయం. అయితే ఇందులో గిడుగువారి గురించి ఒక విషయం తప్పుగా చెప్పడం జరిగింది- "కాని గిడుగు రామ్మూర్తిగారు ఆంధ్రాయూనివర్సిటీ బి.ఎ.లో విశ్వవిద్యాలయ స్థాయిలో ద్వితీయశ్రేణిలో పాసయ్యారు" అని అన్నారు. ఇది సరికాదు.

గిడుగువారు బి.ఎ. పాసయ్యేసరికి ఆంధ్రాయూనివర్సిటీ ఏర్ప డలేదు. అప్పుడు మనది మద్రాసు రాష్ట్రం. రాష్ట్రానికంతటికీ మద్రాసు యూనివర్సిటీ ఒక్కటే ఉంది. అటు దక్షిణాన కన్యాకుమారి నుండి ఇటు ఉత్తరాన గంజాం జిల్లా కలుపుకొని. దారుణమేమంటే వారు బి.ఎ. ద్వితీయ శ్రేణిలో పాసయ్యారని అనడం వారు మొదటి శ్రేణిలో పాసై రాష్ట్రానికంతటికి రెండవ రేంకు సాధించారు.

ఇంకొక చిన్నపొరపాటు ఏమంటే, గిడుగువారు చేపట్టిన ఉద్యమం వలన కేవలం వంద గ్రామాలు కాదు, దాదాపు నాలుగు వందల గ్రామాలు ఆంధ్రలో కలిసి శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం తాలూకా అయింది.

మన తెలుగు అకాడమీ వారు 'గిడుగువారి రచనా సర్వస్వం' అనే ఒక గ్రంథం అచ్చువేస్తే, దాని రెండవ భాగంగా, వేదగిరివారు 'గిడుగువారి రచనా సర్వస్వం - సవరభాషా సంబంధి' అనే బృహత్ గ్రంథాన్ని ప్రచురించి గిడుగువారికి ఎంతో సేవ చేసారు. వారే ఇలాంటి పొరపాట్లు చేస్తే...నాబోటి గిడుగువారి అభిమానులు ఎవరికి మొఱపెట్టుకోవాలి. ఇలా రాసినందుకు మన్నించాలి.

**- కణుగుల వేంకటరావు** 8330949562

### అనువాదంలో తప్పు...

ఆమ్మనుడి, మే నెల సంచికలో....'అక్షరాస్యత...' వ్యాసంలో ఈ కింది తప్పును సరిదిద్దటం అవసరం.

ఈ వివరాలన్నీ మన నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నాయి. ఈ వాక్యం చివరి పదం 'చేయాలి' అని ఉంటే బావుంటుంది.

2. పేరొందిన రచయిత్రి ముగింపు-లిపిసంస్కరణపై వచ్చిన చర్చలు చాలావాటిపై స్పందిస్తూ తార్కిక పరమైన ఆలోచనా విధానంతో చేసినవి. ఆధునిక అవసరాలకు తగినట్లుగా ఉంది. అయితే వీటన్నిటిపై సమగ్రంగా సింహావలోకనం చేస్తూ ఒక సమీక్షా వ్యాసం రావటం అవసరం.

3.ఆచార్య కె.వెంకటేశ్వర్లుగారి రచన (1912లో ప్రచురణ) 'కలోనియలిజం, ఓరియంటలిజం అండ్ ద ద్రవిడియన్ ల్యాంగ్వేజస్' పై ఆచార్య కె. పద్దయ్యగారి సమీక్షా వ్యాసాన్ని డా. కొంపల్లి సుందర్ అనువాదం చేసినది. ఆసలు సమీక్ష అవసరానికంటే ఎక్కువ నిడివితో బావున్నా అనువాదంలో ఒకటి రెండు తప్పులు దొర్లినట్లు నాకు కనబడినవి. ఉదా. ఆ నాటి మద్రాసు ప్రెసిడెన్సీ సెయింట్ ఫోర్ట్ జార్జి కళాశాలలో బౌద్ధిక మాంద్యం (Intellectual Ferment ), బౌద్ధిక మాంద్యం... బౌద్ధిక మాంద్యం అని రెండు సార్లూ తప్పుగా వాడారు.

దీనికి సరైన అనువాదం బౌద్ధిక ఉద్దీపనం అనివుండాలి. అనువాదంలో పూర్తిగా అర్థం తారుమారైంది. ఆనాడు మద్రాసులో బ్రిటిషు అధికారులు, తదితర ఆంగ్లేయ రచయితలతో మన పండితులు భుజాలు కలిపి తిరిగి చర్చలలో పాల్గొనడం వల్ల వచ్చినదే.

4. చెన్నూరి సుదర్శన్‌గారి భాషోద్యమ కథానిక 'మాతృభాష' చాలా బావుంది. **- డా॥గారపాటి ఉమామహేశ్వరరావు** 9866128846



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 15. బౌద్ధుల ఖగోళ పరిశోధనలు-2

(గత సంచిక తరువాయి...)

### ఆకాశగోళం - దిక్చక్రం:

ఒక రాశిలో కన్పించే విషువత్, తిరిగి అదే రాశిలోకి రావడానికి పట్టేకాలం 26వేల సంవత్సరాలు. మన జీవితకాలం గట్టిగా 70 ఏళ్ళు. లేదా తీసుకు తీసుకు బతికితే వందేళ్లు. ఒక రాశిని పూర్తి చేయడానికి 2150 సంవత్సరాలు. అంటే...విషువత్తులు ఆయనాంతాల మార్పు గమనించడానికి కనీసం 2000 సంవత్సరాలు కావాలి. అంటే...600 తరాల కాలంలో ఈ మార్పు గమనించడం సాధ్యం. మొత్తం వృత్తానికి $360^0$ లు అనుకుంటే - ఒకరాశికి $30^0$ లు. 12 రాశులకుగాను $360^0$ లకు 26 వేల సంవత్సరాలు అనుకుంటే - ఒకరాశికి $30^0$ లకు 2150 సంవత్సరాలు. అందులో $1^0$ కి 72 సంవత్సరాలు. మనిషి తన 70 ఏళ్ళ కాలంలో విషువత్తుల్లోని $1^0$ మార్పుని మాత్రం గమనించగలడు. ఈ $1^0$ ని నక్షత్ర పాదాల్లోకి మారిస్తే..ఒక నక్షత్రం నుండి మరో నక్షత్రానికి మారడానికే వెయ్యేళ్ళు పడుతుంది.

ఇంత సూక్ష్మమైన మార్పుని గమనించడం ఒక ఎత్తు అయితే, దీనికి కారణం కనుగొనడం మరో ఎత్తు. కారణం వారికి తెలియక పోవచ్చు. కానీ, మార్పుని గమనించడం మాత్రం జరిగింది.

ఈ మార్పుని గమనించిన తాలూకు మొట్టమొదటి ఆనమాలు నిదానకథలో మనం చెప్పుకున్న 'దిక్ చక్రం' విషయంలో కన్పిస్తుంది.

మనకి ఇప్పటిదాకా బాగా తెలిసిన భూచలనాలు రెండే.

ఒకటి : భూ ఆత్మభ్రమణం (తన చుట్టూ తను తిరగడం)


రెండు : భూ పరిభ్రమణం (భూమి సూర్యుని చుట్టూ తిరగడం)

ఇవికాక మూడో చలనం విషువత్ చలనం. భూమి గిరగిరా తిరుగుతూ వేగం ఆగిపోయి, పడిపోబోయే ముందు బొంగరం ఎలా తూలుతూ చుట్టూ తిరుగుతుందో అలా తిరిగే చలనమే ఈ మూడో చలనమైన విషువత్ చలనం. ఇలా ఒక తూలుడు చలనాన్ని పూర్తి చేయడానికి 26 వేల సంవత్సరాలు పడుతుంది. ఈ 26 వేల సంవత్సరాలలో వంగి ఉన్న భూ అక్షం సూర్యునికి ఒకసారి అటూ, ఒకసారి ఇటూ తిరుగుతుంది. దీనివల్ల వాతావరణాల్లో, ఋతువుల్లో మార్పులు వస్తాయి. ఋతువులన్నీ వెనక్కి నడుస్తాయి. ఇప్పుడు వేసవి ఉన్న ఋతుకాలంలో 15వేల సంవత్సరాలకు శీతాకాలం ఉంటుంది. అలా ఒక్కో ఋతువు వెనక్కి వెళ్లి...వెళ్ళి మరలా 26 వేల సంవత్సరాలకి అదే స్థానంలోకి వస్తుంది.

మనం ఆకాశంలో ఆ స్థానాల్ని గుర్తుపట్టలేం. కాబట్టి సూర్యుని వల్ల భూమ్మీద ఏర్పడే విషువత్తుల ద్వారా, అవి వెనక్కి జరిగే ప్రక్రియ ద్వారా ఆ మార్పును, గమనించగలం. అందుకే ఈ చలనాన్ని విషువత్ చలనం అంటారు. విషువత్తుల, ఋతువుల మార్పుని గమనించడమే ఈచలనాన్ని తెలుసు కోవడం.

విషువత్తులతో పాటు ఆయనాంతాలు కూడా మారతాయి. ఆయన ప్రాంతాల మీద నివసించే ప్రజలకి కనిపించే ఆకాశం తీరే - దిక్ చక్రం. మనం సాయంత్రం వేళ ఆయన రేఖపై నిలబడి ఆకాశాన్ని చూస్తే నక్షత్రాల వంకర చలనకాలు కన్పిస్తాయి. అక్కడి నుండి ధృవ నక్షత్రాన్ని చూస్తే ఆకాశంలో, రాశులు, నక్షత్రాలు అన్ని దిక్కులకూ సమానంగా ఉన్నాయా? లేదా?, ఏదైన దిక్కుకేసి వంగి ఉన్నాయా? అనేది కూడా కన్పిస్తుంది. ఏ రోజున, ఏదిక్కున ఆకాశం (ఆకాశగోళం), భూమికి సమాంతరంగా ఉంటుందో అదే సరైన దిక్ చక్రం -(పటం -1 చూడండి)

ప్రస్తుతం వసంత విషువత్తు మీన రాశిలో జరుగుతుంది. అంటే సూర్యుడి మీన రాశిలో ఉన్నప్పుడు మనకి వసంత విషువత్ అన్నమాట. అంటే...సూర్యుడు తన ఉత్తరాయన కాలంలో భూమధ్యరేఖ మీదకు వస్తాడు. అప్పుడు భూమధ్యరేఖ మీదుగా ఆకాశ గోళంలో మీన రాశి ఉంటుంది.




క్రీ.పూ **2050** - క్రీ.శ **100** కాలం నాటి దిక్చక్రం

అలాగే...శరత్ విషువత్తు కన్యరాశిలో జరుగుతుంది. ఇక ఉత్తరాయణాంతం మిధున రాశిలో దక్షిణాయనాంతం ధనుర్రాశిలో జరు గుతున్నాయి.

నిజానికి కర్కటరేఖ మీద ఆకాశంలో కనిపించే కర్కాటక రాశిలో కాకుండా దాని వెనుకదైన మిధునంలో ఉత్తరాయణాంతం జరుగుతుంది. అంటే ఉత్తరాయణాంతం ఒక రాశి వెనక్కి పోయిందన్నమాట!

అలాగే మకర రాశిలో జరగాల్సిన దక్షిణాయనాంతం ధనుర్రాశిలో జరుగుతుంది

ఈ ప్రక్కనున్న రెండవ బొమ్మను చూస్తే ఈ నాలుగు అంశాలు ఏఏ రాశుల్లో జరుగు తున్నాయో తెలుస్తుంది.

ఇక 2 వేల సంవత్సరాల వెనక్కిపోదాం -క్రీ.పూ. 2050 నుండి క్రీ.శ 100వరకూ ఉన్న కాలం. రుగ్ యజుర్వేదకాలం.బుద్ధని కాలం.అశోకుడు, ఉపనిషత్తులు, అధర్వణ వేదం, శాతవాహనుల కాలం వరకూ ఉన్నదంతా ఈ కాలంలోనే.

ఈ కాలంలో చూడండి. వసంత విషువత్ మేషంలో జరిగింది. శరద్ విషవత్ తులలో జరిగింది. ఉత్తరాయణాంతం కర్కా టకరాశిలో, దక్షిణాయనాంతం మకర రాశిలో జరిగాయి.


**పటం..3 (బుద్ధని కాలంలో)**

ఈనాడు మనం నక్షత్రాల క్రమాన్ని 'అశ్వని, భరణి, కృత్తిక' అనే క్రమంలో చెప్తాం. ఈ క్రమం అప్పటిదే. ఈ మూడు నక్ష త్రాలతో ఏర్పడ్డరాశి మేషం. ఇక అంతకంటే పూర్వపు స్థితి చూద్దాం. ఆపైన 2150 ఏళ్ల వెనక్కిపోతే క్రీ.పూ. 4200 - క్రీ.పూ. 2050 మధ్యకాలం వస్తుంది. ఈ కాలంలో వసంత విషువత్ వృషభంలో, శరత్ విషువత్ వృశ్చి కంలో, ఉత్తరాయణాతం సింహంలో, దక్షిణాయ నాంతం కుంభరాశితో సంభవించాయి.

**పటం.4(సింధూనాగరికత కాలం)**

రుగ్, యజుర్వేదాల్లో నక్షత్రాల పేర్లు వున్నాయి. కాని, మొదటి నక్షత్రం అశ్విని కాదు. కృత్తిక. కృత్తికతో నక్షత్రాల లెక్కింపు మొదలవుతుంది. ఎందుకంటే కృత్తిక, రోహిణి, మృగశిర నక్షత్రాల కూడికే వృషభ రాశి. అప్పుడు మొదటిరాశి వృషభం. మొదట నక్షత్రం కృత్తిక. అశ్విని ఇరవై ఆరో నక్షత్రం.

పై మూడు బొమ్మలు చూస్తే ఆయనాం




**పటం 2. ప్రస్తుత కాలంలో** క్రీ.శ **100** - క్రీ.శ **2200**


శాలు, విషువత్తులు ఎలా మారుతున్నాయో అర్థం అవుతుందిగదా!

ఇక, ఇప్పుడు అసలు విషయాని కొద్దాం!

### దిక్చక్రం - బుద్ధుని ధ్యానం:

బుద్ధుడు ధ్యానానికి కూర్చొంది బుద్ధ గయలో. బుద్ధగయ భూమ్మీద $24^0$ ఉత్తర అక్షాంశం మీద ఉంది. కర్కాటరేఖ $23\ 1/2^0$ ల ఉత్తర అక్షాంశం అని మనకు తెలుసు. అంటే బుద్ధుడు దాదాపుగా కర్కటరేఖా ప్రాంతంలోనే ధ్యానానికి కూర్చొన్నాడన్న మాట. అంటే ఆయన కూర్చొన్న ప్రాంతం ఒక ఆయనరేఖా ప్రాంతం. దక్షిణాయనాంతం, ఉత్తరాయన ఆరంభం ఆ ప్రాంతం నుండే స్పష్టంగా గమనించవచ్చు. ఆయనకు జ్ఞానో దయం అయ్యింది వైశాఖ పున్నమినాడు. అంతకు 48 రోజుల ముందు 'ఇక నేను జ్ఞానం పొందే వరకూ లేవను' అని కూర్చొ న్నాడు. అంటే వైశాఖానికి రెండు నెలలు ముందు. 49 రోజులు అంటే 7 వారాలు. ఏడు ఉపోదన దినాలు. 49 వ రోజున జ్ఞానోదయం కల్గింది. దీన్ని మనం ఇప్పుడు ఇంగ్లీషు నెలల్లోకి మార్చుకుంటే జ్ఞానోదయం పొందిన 'నెల' మే నెల కాబట్టి మార్చి నెలలో ఆయన ధ్యానానికి కూర్చొన్నాడు. అంటే మేషరాశిలో వసంత విషువత్ జరిగి కాలంలో కూర్చొ న్నాడు. విషువత్తులంటే పగలూ రాత్రీ సమా నంగా ఉండే రోజులని మనం గతంలో తెలుసు కున్నాం. ఈ రోజున సూర్యుని కాంతివృత్తం లేదా దిక్చక్రం భూ మధ్యరేఖకు సమాంతరం గా ఉంటుంది.

అన్ని దిక్కుల్ని చూసి దిక్చక్రం ఏ దిశకు సమాంతరంగా ఉంటుందో చూసి, ఆకాశ రాశి చక్రం ఎటు హెచ్చుతగ్గులుగా ఉండదో గమనించి, అటు తిరిగి, బోధ వృక్షా నికి పడమర వైపుకు వెళ్ళి తూర్పు దిక్కుకు ముఖం పెట్టి కూర్చొన్నాడు. ఇలా కూర్చోవడం ఎందుకంటే ఎల్లవేళలా ఆ చెట్టు నీడలోనే ఉండడానికి. ఎందుకంటే వసంత విషువత్ తర్వాత సూర్యుడు ఉత్తరానికొస్తూ ఉంటాడు కాబట్టి, చెట్టు నీడ దక్షిణం వైపున ఎక్కువ పడుతుంది. ఉత్తరం వైపున తగ్గిపోతుంది. తాను లేవకుండా కూర్చోవాలి అనుకున్నాడు కాబట్టి ఆ వృక్షానికి తూర్పున నదీ తీరం ఉంది. ఉదయం ఎండ పొడ పడుతుంది.




(పటం..3..) **బుద్ధునికాలంలో** క్రీ.పూ **2050** - క్రీ.శ **100**

అందుకనే చెట్టుకి పశ్చిమ దిశలో పూర్వ ముఖుడై కూర్చొన్నాడు. వేసవి తాపం సోక కుండా ఏ ప్రదేశంలో కూర్చోవాలో అలా కూర్చొన్నాడు.


ఒక చిన్న విషయం చెప్పుకుందాం. మనం బస్సు, రైలు, ప్రయాణాలు చేస్తూ ఉంటాం. బస్సు బస్టాండులో ఆగినప్పుడు డ్రైవర్ వైపున ఎండపడుతూ ఉంటే మనం కండక్టర్ వైపు ఉన్న సీట్లలో కూర్చొంటాం. తీరా బస్సు స్టేషన్ దాటి రోడ్డు మీదకి వచ్చాక కండక్టర్‌వైపు ఎండవచ్చి పడుతుంది. దీనికి కారణం? మనం వెళ్ళేదారి ఏ దిక్కుకు ఉందో మనం తెలుసుకోలేక పోవడమే!

మరి నెలల తరబడి లేవకుండా కూర్చో వాలి అనుకుంటే ఎంత జాగ్రత్త తీసుకోవాలి ?

### ఇప్పటి పంచాంగం ఇప్పటిది కాదు:

ఇక్కడ ఒక విషయం చెప్పుకుతీరాలి. **మనం ఇప్పుడు పాటించే పంచాంగం అంతా క్రీ.పూ. 2050 - క్రీ.శ 100 సంవత్సరాల నాటిదే! మేషం మొదటిరాశి. అశ్విని మొదట నక్షత్రం. మన జ్యోతిష్యం అంతా ఆ నక్ష త్రాలు, ఆ నక్షత్రపాదాల మీదే రూపొందించి నవి. కాని ఇప్పుడు మొదటి రాశి మీనం, మొదటి నక్షత్రం పూర్వభాద్ర - ఈ లెక్కన చూస్తే ఇప్పటి జ్యోతిష్య పంచాంగం అంతా పరమ తప్పు. ఈ తప్పిదాన్ని సవరించడం తలకు మించిన భారమేమీ కాదు. కానీ అలా మారిస్తే తరతరాలుగా నమ్ముతూ వస్తోన్న మూఢనమ్మ కాలన్నీ మారిపోతాయి. జ్యోతిష్యం మీద నమ్మకం పోతుంది. కాబట్టి, 'నమ్మకం' మీద నాలుగురాళ్ళు సంపాదించుకునేవారికి, జ్యోతిష్యాన్ని మార్చడం ఉత్త దండగ. అందుకే ఆ ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఈ దురదృష్టం అంతా జ్యోతిష్య ఫలాల్ని నమ్మే వాళ్ళదే!**

విషువత్ చలనానికి భూమి మూడో చలనమే కారణం అనే విషయం నిదాన కథ రచయితకి తెలియకపోవచ్చు. కానీ, దాని




(పటం...4) **సింధూ నాగరకత కాలంలో** క్రీ.పూ **4150** - క్రీ.పూ **2050**

మార్పుని గమనించడం, బుద్ధుని ధ్యాన విషయంలో ఆ దిక్చక్రాన్ని (కాంతి వృత్తాన్ని) ఆధారంగా స్థల ఎంపిక చేసుకోవడం గొప్ప వైజ్ఞానిక అంశం.

## పరిశోధనలు:

ఇప్పటిదాకా మనం కేవలం పరిశీలనలు మాత్రమే చూశాం. అసాధ్యమైన ఆయనాంశాల పరిశీలనా చేశాం. ఇక ఖగోళ పరిశోధనలు చూద్దాం.

ఈ దేశంలో ఖగోళ పరిశీలనలు ఎప్పటి నుండో ఉన్నాయి. కానీ, పరిశోధన ప్రారంభించింది బౌద్ధులు మాత్రమే. వారిలో మొదటివాడు, ఆర్యభటే.

ఆయన పరిశోధనల గురించి తెలుసుకొందాం!

**వేదాలు, బౌద్ధగ్రంథాలు ప్రక్కన పెడితే పూర్తి జ్యోతిషగ్రంథం "వేదాంగ జ్యోతిషం". ఇది కేవలం నక్షత్రాలూ, రాశులకు సంబంధించిన గ్రంథమే. ఇది మంచి చెడుల గురించి చెప్పే ఫలిత జ్యోతిషగ్రంథం కాదు. ఇది క్రీ.పూ 1200 సం॥ నాటిది. దీని కర్త లాగదుడు. ఇది ఇప్పుడు దొరకడం లేదు. వేదాల్లోగానీ, లాగదుని గ్రంథంలోగానీ ఖగోళ పరిశీలనలే ఉన్నాయి. ఫలిత జ్యోశ్యాలు లేవు.**

**జ్యోతిష నమ్మకాల పిచ్చి మొదట పుట్టింది గ్రీకులో. టాలెమీ క్రీ.శ 140లో ట్రిట్రిబ్యులస్ అనే గ్రంథం రాశాడు. ప్రపంచం లో తొలి ఫలిత జ్యోతిష గ్రంథం ఇదే. దీన్ని 200 లో రుద్రదాముడు గ్రీకునుండి సంస్కృ తంలోకి మార్చి ఆ పిచ్చిని ఇక్కడా అంటిం చాడు. ఆ తర్వాత స్ఫుజిధ్వజుడు క్రీ.శ 270 లో "యవన జాతకం', క్రీ.శ 400 లో మీన రాజు 'వృద్ధ యవన జాతకం' అనే రెండు జ్యోతిష గ్రంథాలు రాశారు .**

**ఈ సమయంలో నలంద విశ్వవిద్యాలయ కులపతిగా ఉన్న బౌద్ధ ఆచార్యుడు ఆర్యభట. ఆయన చేసిన కృషి-జ్యోతిషాన్ని ప్రక్కకు నెట్టి ఖగోళ శాస్త్రానికి ప్రాణం పోసింది.**

ప్రాచీన భారతీయ ఖగోళ గ్రంథాల్లో " సౌర సిద్ధాంతం" అనేది ఒకటి. దీని కర్త ఎవరో తెలీదు. మన పురాణాలు వల్లించే యుగాల లెక్కలు ఈ సౌరసిద్ధాంతం లోనివే. ఇదికాక వాశిష్ఠ సిద్ధాంతం, రోమన్ సిద్ధాంతం, పౌలిన సిద్ధాంతం అనే మరో మూడు ఖగోళ సిద్ధాంతాలున్నాయి. అలాగే అతి ప్రాచీన బ్రహ్మ సిద్ధాంతం ఉంది. దీన్నే పితామహ సిద్ధాంతం లేదా పైతామహ సిద్ధాంతం అంటారు. ఆర్యభట్ట ఈ బ్రహ్మసిద్ధాంతాన్ని ప్రక్షాళన చేసి తనదైన నూతన ఆవిష్కరణల్ని అదే సిద్ధాంతం పేరుతో ప్రకటించాడు.

## యుగాలు - కల్పాలు:

సూర్య సిద్ధాంతం ప్రకారం:యుగాలు 4.

కలియుగం: 4,32,000 సంవత్సరాలు

ద్వాపరయుగం :8, 64,000 సం॥రాలు (కలియుగం × 3)

త్రేతాయుగం : 12,96,000 సం॥ (కలియుగం ×3)

కృతయుగం : 17,28,000 సం॥లు (కలియుగం ×4)

ఇవి మొత్తం = 43,20,000 సం॥రాలు. ఇది ఒక మహాయుగం.

71 యుగాలు = 1 మనువు

1000 యుగాలు = 1 కల్పం. (432 కోట్ల సంవత్సరాలు)

ఈ విభజనకి కాస్త సవరణలు చేసిన ఆర్యభట యుగ విభజన ఇలా ఉంటుంది.

10,80,000 సంవత్సరాలు = 1 చిన్న యుగం

4 చిన్న యుగాలు = 1 మహాయుగం (43,20,000 సం॥లు)

72 యుగాలు = 1 మనువు

1008 యుగాలు = 1 కల్పం (1 కల్పం = 435,45,60,000 సం॥రాలు.

ఆ తర్వాతి వాడైన వరాహమిహిరుని గ్రంథం 'బృహత్ సంహిత'లో ఆర్యభటునికి పూర్వం 18మంది జ్యోతిషవేత్తలున్నట్లు ఉంది.

వారు :

1. సూర్యుడు (సౌర సిద్ధాంతం ) 2. బ్రహ్మ (బ్రహ్మ సిద్ధాంతం) 3. వశిష్టుడు (వశిష్ట సిద్ధాంతం) 4. పౌలీసుడు (పౌలస సిద్ధాంతం) 5.యవనుడు (రోమక సిద్ధాంతం) 6. వ్యాసుడు 7. అత్రి 8. పరాశరుడు9. కశ్యపుడు 10. నారదుడు11. గర్గుడు 12. మరాబి

13. మనువు 14. అంగీరసుడు 15. లోమశుడు 16. చ్యవనుడు 17. భృగు 18. శానకుడు.

కల్పాలు, యుగాల కాలప్రమాణాల గురించి బౌద్ధుల నిదానకథలో ఉంది.

## గ్రహణాల గుట్టురట్టు : –

గ్రహణాలు ఎప్పుడెప్పుడొస్తాయో అంతకు ముందే చాలామందికి తెలుసు. రాబోయే కాలంలో కొన్ని వందల సంవత్సరాల్లో ఏ రోజున గ్రహణాలు సంభవిస్తాయో రాసి పెట్టారు. ప్రతి 18 సంవత్సరాలు 11 నెలలకు గ్రహణ చక్రం తిరిగి మరలా అదే తేదీల్లో వస్తాయి. ఇది పరిశీలన.

కానీ, గ్రహణాలు ఎందుకు వస్తాయి? అనేది పరిశోధన. ఈ పరిశోధన చేసిన మొదటి వ్యక్తి ఆర్యభట. గ్రహణాలకి సంబంధించిన కట్టు కథలు నమ్మని బౌద్ధాచార్యుడు ఆయన. అందుకే భౌతిక విషయాలతో ఆయన పరిశోధన సాగింది.

భూమి తన చుట్టూ తాను తిరుగుతుందని మొట్టమొదట ప్రకటించింది ఆయనే. భూమి గుండ్రంగా ఉందని అంతకు ముందే చాలామంది భావించారు. ప్రకటించారు. 'కపిత్థాకారం భూగోళం' అని చెప్పింది బ్రహ్మ సిద్ధాంతం. ఈ వెలగపండు లాంటి భూమి, తన చుట్టూ తాను తిరుగుతుంది' అని చెప్పడమే కాక, మనకు కనిపించే, గ్రహాలు, నక్షత్రాలు అన్నీ 'గోళాలే' అని ప్రకటించాడు ఆర్యభట. భూమి తన చుట్టూ తను తిరగడం వల్లే ఆకాశంలో సూరీడు, నక్షత్రాలు, చంద్రుడు అన్నీ భూమి తిరిగే దిశకు వ్యతిరేక దిశలో తిరుగుతున్నట్లు కనపడుతున్నాయనీ చెప్పాడు. ఐతే...ఒక్క సూర్యుడు మాత్రమే అగ్ని గోళం అనీ, అది తప్ప మిగిలిన గ్రహ, నక్షత్రాలన్నీ భూమిలా నీటి ఆవరణతో నిండిన గోళాలే అని చెప్పాడు.

గ్రహణాలకి పాముగానీ, రాహుకేతువులుగానీ కారణం కాదనీ, భూమి నీడ పడడం వల్లే చంద్రగ్రహణం సంభవిస్తుందని వివరించాడు. ఐతే సూర్యగ్రహణానికి కారణం ఈయన చెప్పలేదు. అలాగే 'ఒక రోజు కాలగణనని సూర్యోదయం నుండి కాకుండా, అర్ధరాత్రి నుండి కొలవాలి. ఇలా కొలిస్తే సూర్యోదయ సమయాల్లోని వ్యత్యాసాల వల్ల కలిగే ఇబ్బందులు తొలగిపోతాయి' అని తన 'ఆర్యభట సిద్ధాంతం' లో ప్రకటించాడు. దీనికి మంచి ఉదాహరణగా శ్రీలంకలోని కాలమానాన్ని సూచించాడు. శ్రీలంక భూమధ్యరేఖా ప్రాంతం. కాబట్టి మనకు లాగా పగలూ రాత్రి సమయాల్లో వ్యత్యాసాలు అక్కడ అంతగా ఉండవు. అయినా వారు రాత్రినుండి సమయాన్ని గుణించేవారు. బహుశ ఆయన ఈ విష యాన్ని తన తోటి సహాధ్యాయులనుండో, శ్రీలంక విద్యార్థుల నుండో తెలుసుకుని ఉంటాడు.

ఎందుకంటే...ఆయన ఒక విశ్వవిద్యాలయ కులపతి. అక్కడికి శ్రీలంక, గ్రీకు, చైనా, ఇంకా అనేక ప్రాంతాలనుండి విద్యార్థులు వచ్చేవారు. 10వేల మంది విద్యా ర్థులు అక్కడ విద్యనభ్యసించేవారు.

అంతేకాదు...ఆయన రకరకాల ఖగోళ పరికరాల నిర్మాణం గురించి ఆయన రాశాడు. వాటిలో నక్షత్రాల దూరాల్ని కొలిచే పరికరాలు, రకరకాల గడియారాలూ ఉన్నాయి. గ్రహగమనాల్ని కొలిచే సాధనాలూ ఉన్నాయి.

ఆ విశ్వవిద్యాలయంలో బోధించే ఏడు ప్రధాన శాస్త్రాల్లో ఖగోళ శాస్త్రం ఒకటి.

## ఆర్యభట – అల్ జహీర్:

ఆర్యభట ఆవిష్కరించిన గణిత, ఖగోళ విషయాలన్నింటినీ అల్ బెరూనీ అనే అరబ్ పండితుడు పారశీక భాషలోకి అనువదించాడు.

ఆయన ఆర్యభటను వేనోళ్ల కొనియాడాడు. అరబ్‌లు ఆర్యభటను "అల్–జహీర్' అనేవారు. అరబ్ నుండి ఆర్యభట సిద్ధాంతాలు గ్రీకు, రోములకు వెళ్ళాయి. ఆర్యభట అరబిక్ పేరైన 'అల్ – జహీర్' నుండే 'సున్న'కు...జహీర్, జహర్, దాన్నుండి చివరకు 'జీరో' అనే పేరు వచ్చింది. సున్నను ఆవిష్కరించినవాడు ఆర్యభటే కాబట్టి 'సున్న' కు వారు ఆయన పేరే పెట్టుకున్నారు. ఆయన పేరు నుండే "అనిర్ధారక సమీకరణాలకి 'అల్ – జీబ్రా' అనే నామకరణం కూడా జరిగింది. ఇందుకు అరబ్బులకి ఎంతో రుణపడి ఉండాలి.


ఇక, మనదేశం 1975 లో ఏప్రిల్ 19న అంతరిక్షంలోకి మొదటి కృత్రిమ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టింది. దానిపేరు 'ఆర్యభట' . అలాగే ఆ తర్వాత ప్రవేశ పెట్టిన రెండో ఉపగ్రహానికి 'భాస్కర' అనే పేరుపెట్టింది. 1వ భాస్కరుడు కూడా బౌద్ధ గణిత, ఖగోళ విద్వాంసుడే! – తన 'మహా భాస్కరీయం' లో ఆయన ఎన్నో ఖగోళ విషయాలు చర్చించాడు.

విచారం ఏమిటంటే...

"అరబ్బుల ద్వారా పాశ్చాత్య ప్రపంచానికి ఆర్యభటుని ఖగోళ విజ్ఞానం అందింది. అది ఒక ప్రక్కన జరిగితే....ఆర్యభట అనంతరం 'బృహజ్జాతకం, బృహత్ సంహిత, హోర'–అనే ఫలిత జ్యోతిష గ్రంథాలను వరాహ మిహిరుడు రచించాడు. ఈ ఫలిత జ్యోతిష గ్రంథాలకి ఆధారం గ్రీకు రచయిత టాలెమీ గ్రంథం 'ట్రిట్రిబ్యులస్'.

అందుకే... వివేకానందుడు ఇలా అన్నాడు – "మనం మన గణిత ఖగోళ శాస్త్రాల్ని గ్రీకులకు ఇచ్చి, వారి నుండి జ్యోతిషాన్ని తెచ్చుకున్నాం. మూఢనమ్మకాల్లో బ్రతుకీడుస్తున్నాం' అని.

(బౌద్ధుల రసాయన శాస్త్ర విజ్ఞానం, సృష్టి భావనలు – వచ్చే సంచికలో చూద్దాం).



### మాతృభాషంటే...?

ఎందుకు మాతృభాషపట్ల ఇంత ఆందోళన? ఎందుకంటె, అది ఒక భాషీయుడి సంప్రదాయ, సంస్కార మూలాల్ని నిత్యం తడుపుతూ, శుభ్రపరుస్తూ నవనవోన్మేషంగా పల్లవింపచేసే అంతః స్రోతస్విని. అది జలజలా నిత్యం పారుతుండకపోతే, ఆ భాషీయుడి జీవనం శుష్కించి పోవటమే కాదు, ఏ చిన్న జీవన విషాదానికైనా గజగజవణికి కుప్ప కూలుతుంది. అట్లాంటి అంతశ్శక్తినిచ్చే సహజ పౌష్టికాహారం తల్లిభాష! – సి. ధర్మారావు

**పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం – రెండూ తప్పే**

చలసాని నరేంద్ర
9849569050

# రాజకీయాధికారంతోనే 'మహిళా సాధికారికత'

పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు మూడోవంతు సీట్లు రిజర్వు చేయాలని ఉద్దేశించిన బిల్లు తయారయి దశాబ్దాలు గడచినా ఆమోదంకు నోచుకోవడం లేదు. పురుష ఆధిపత్యం గల రాజకీయ పార్టీలు ఈ బిల్ ఆమోదానికి అడ్డంకిగా ఉన్నాయని అనుకొన్నా, తన కను సంకేతాలతో పదేళ్ళపాటు యుపియే ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా శాసించిన, నడిపించిన సోనియా గాంధీ హయాంలో సహితం ఈ బిల్లు వెలుగు చూడలేక పోయింది.

"అన్ని రకాల సామాజిక ప్రగతికి రాజాకీయాధికారం కీలకం" అని రాజ్యాంగ నిర్మాత డా॥బి.ఆర్.అంబేద్కర్ ఎప్పుడో చెప్పారు. దేశ జనాభాలో సగం మంది వరకు ఉన్న మహిళలు అన్ని రంగాలలో క్రియాశీలకంగా పాల్గొన గలిగితేనే దేశాభివృద్ధి సహితం విశేషంగా ఉంటుంది అనడంలో సందేశం లేదు. అందుకనే అభివృద్ధి పథ కాలలో 'మహిళా సాధికారికత'కు విశేష ప్రాధాన్యత కల్పిస్తున్నాము. మహిళలకు కేవలం నామ మాత్రపు ప్రాధాన్యత కల్పించడమేకాదు వారికి నిర్ణయాలు తీసుకోగల సౌలభ్యం కూడా ఏర్పడటం అత్యవసరం.

తమకు అవకాశం కల్పిస్తే ఏ రంగంలో అయినా మగవారికి దీటుగా ప్రావీణ్యత చూపగలమని మగువలు అనేకమంది అనేక రంగాలలో నిరూపించుకొంటున్నారు. అయినా నేడు మహిళలు దాదాపు అన్ని రంగాలలో వివక్షతకు గురవుతున్నారు. మహిళలే కాదు ముక్కుపచ్చలారని బాలికలు సహితం లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు గురవుతున్నారు. కుటుంబ సభ్యులు, బాగా తెలిసిన వారు, తమతో కలసి చదువు కొంటున్నవారు - పనిచేస్తున్నవారినుండే వారికి రక్షణ లేకుండా పోతున్నది.

ఇటువంటి ఆగడాలను అరికట్టడంకోసం నిర్భయ వంటి చట్టాలు తీసుకొచ్చిన ప్రయోజనం ఉండటం లేదు. కొందరు ఆవేశంగా ఇటువంటి నేరాలకు ఉరిశిక్ష విధించే అదుపు చేయవచ్చని అంటున్నారు. అయితే కేవలం చట్టాల ద్వారా మహిళలకు పూర్తి రక్షణ కల్పించలేము.

**అంబేద్కర్ మాటల ఆంతర్యం గ్రహిస్తే రాజకీయాధికారంలో మహిళలకు తగు స్థానం కల్పిస్తేనే వారికి రక్షణ లభించడంగాని, వారి అభివృద్ధికి అవసరమైన వాతావరణం ఏర్పడటంగాని సాధ్యం కాగలదని గమనించాలి. ఈ మధ్యనే స్పెయిన్ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పెడ్రో సంచేజ్ తన మంత్రివర్గంలో మొత్తం 17 మంది సభ్యులు ఉంటె, వారిలో 11 మంది మహిళలను నియమించడం ద్వారా ఆ దేశంలోనే చరిత్ర సృష్టించారు. నేడు ఐరోపాలోని అనేక దేశాలలో మంత్రివర్గాలలో మహిళలు గణనీయ సంఖ్యలో ఉంటున్నారు.**

అయితే భారతదేశంలో అటువంటి పరిస్థితి ఏర్పడటం లేదు. మొదటి లోక్‌సభ లో 4.5 గా ఉన్న మహిళల ప్రాతినిధ్యం ఇప్పుడు 16వ లోక్‌సభలో 12 శాతంకు మాత్రమే చేరుకొంది. కేంద్రమంత్రివర్గంలో 22 శాతం వరకు వారి ప్రాతినిధ్యం ఉన్నా, కొందరు కీలక శాఖలు నిర్వహిస్తున్నా వారేమాత్రం స్వతంత్ర్యంగా వ్యవహరిస్తున్నారో చెప్పడం కష్టం. విదేశాంగ మంత్రిగా సుష్మా స్వరాజ్ వీలు చిక్కినప్పుడల్లా తన ప్రతిభను ప్రదర్శించుకో గలిగారు. అయినా ఆమెను ఉత్సవ విగ్రహంగా మార్చి, ప్రధాన మంత్రి కార్యాలయంలోని వారే అంతా పెత్తనం చేయడాన్ని చూస్తున్నాము.

రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంస్థలలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్ కల్పించడం ద్వారా స్థానిక సంస్థలలో ఒకవిధంగా పెను విప్లవం తీసుకు వచ్చారని చెప్పవచ్చు. పలు రాష్ట్రాలలో ఇప్పుడు స్థానిక సంస్థలలో సగం మేరకు సీట్లు మహిళలకు రిజర్వు చేసారు. **ఎక్కడైతే మహిళలు రాజకీయంగా సాధికారికత సాధించగలరో అక్కడ పరిసరాలలోనే గణనీయ మార్పు సాధిస్తున్నట్లు పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.**

పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు మూడోవంతు సీట్లు రిజర్వు చేయాలని ఉద్దేశించిన బిల్లు తయారయి దశాబ్దాలు గడచినా ఆమోదంకు నోచుకోవడం లేదు. పురుష ఆధిపత్యం గల రాజకీయ పార్టీలు ఈ బిల్ ఆమోదానికి అడ్డంకిగా ఉన్నాయని అనుకొన్నా, తన కను సంకేతాలతో పదేళ్ళపాటు యుపియే ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా శాసించిన, నడిపించిన సోనియా గాంధీ హయాంలో సహితం ఈ బిల్లు వెలుగు చూడలేక పోయింది.

మమత బెనెర్జీ, మాయావతి, వసుంధర రాజే వంటి రాజకీయంగా బలమైన పునాదిగల నాయకులు ఉన్నప్పటికీ మొత్తం మీద రాజకీయంగా మహిళలకు తగు ప్రాతినిధ్యం లభించడం లేదు. కీలక పదవులలో ఉన్న మహిళా నాయకులు సహితం తమ పరిధిలో మహిళలను ప్రోత్సహించే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పుడు మహిళలకు లభిస్తున్న ప్రాతినిధ్యం సహితం ఎక్కువగా వారివారి కుటుంబ నేపథ్యం కారణంగా లభిస్తుం డడంతో వారు ఏమేరకు స్వయం నిర్ణయాధికారం చెలాయించ గలుగుతున్నారు అన్నది ప్రశ్నార్ధకరమే. స్థానిక సంస్థలలో విశేషంగా ప్రాతినిధ్యం లభిస్తున్నా ప్రతి ఐదేళ్ళకు ఒకసారి వారికోసం రిజర్వ్ చేసిన నియోజక వర్గాలను మారుస్తూ ఉండడంతో ఒకసారి ఎన్నికైన వారు తిరిగి తమ ప్రాతినిధ్యాన్ని నిలబెట్టుకోలేక బలమైన నాయకులు కాలేక పోతున్నారు.

బిజెపి వంటి పార్టీలు అంతర్గతంగా పార్టీ కార్యవర్గాలలో మూడొంతుల పదవులను మహిళలకు కేటాయిస్తున్నా చాలావరకు అలంకార ప్రాయంగానే ఉంటున్నాయి. వారికి పార్టీ అంతర్గత వ్యవహారాలలో నిర్ణయాధికారం మాత్రం చెప్పుకోదగిన స్థితిలో ఉండటం లేదు. కీలకమైన పార్టీ పార్లమెంటరీ బోర్డు, రాష్ట్ర శాఖల అధ్యక్షులు,

జిల్లా అధ్యక్షులు, శాసనసభ నాయకత్వం...వంటి వాటిల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లభించడం లేదు. కాంగ్రెస్‌కు సుదీర్ఘకాలం సోనియాగాంధీ అధ్యక్షురాలిగా వ్యవహరించగా, తృణమూల్ కాంగ్రెస్‌కు మమత బెనర్జీ, బిఎస్పికి మాయావతి అధ్యక్షులుగా ఉంటున్నారు. మరే ఇతర పార్టీకి మహిళలు అధ్యక్ష పదవికి చేరుకొనే అవకాశాలు ఇప్పట్లో కనిపించడం లేదు.

మహిళలు రాజకీయ అధికారంకు చేరుకోగలిగితే దాని ప్రభావం సామాజిక అభివృద్ధిపై, ఆర్థిక సాధికారికత చేరుకోవడంపై విశేషంగా ఉంటుందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. మహిళలు రాజకీయ ప్రాతినిధ్యం పొందేచోట నేరాలు సహితం తగ్గుముఖం పడుతున్నట్లు 2012లో భారత్‌లో జరిపిన ఒక అధ్యయనం వెల్లడించింది. బలహీన వర్గాలకు భరోసా ఏర్పడి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నేరాలు జరిగితే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి దోహద పడుతుంది. దానితో పోలీసులు సహితం తగు చర్యలు తీసుకొనక తప్పదు.

2002లో రాజస్తాన్, పశ్చిమ బెంగాల్‌లలో జరిపిన ఒక అధ్యయనంలో ఏ గ్రామాలలో అయితే మహిళలు సర్పంచ్‌గా ఎన్నికవుతారో అక్కడ సామాజిక అవసరాలపై పెడుతున్న ఖర్చు గణనీయంగా పెరిగినట్లు కనుగొన్నారు. త్రాగునీరు, రహదారులు, పాఠశాలలు వంటివాటికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. పెరుగుతున్న మహిళల రాజకీయ ప్రాతినిధ్యానికి వారిలో పరిశ్రమల అభివృద్ధిపట్ల పెరుగుతున్న ఆసక్తికి ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు 2014లో మరో అధ్యయనం స్పష్టం చేసింది. 1994 – 2005ల మధ్య కాలానికి జరిపిన ఈ అధ్యయనంలో మహిళలు ప్రారంభించే వ్యాపారాలు, కంపెనీలు, మహిళలు ఉద్యోగాలు చేయడం విశేషంగా పెరిగినట్లు కనుగొన్నారు.

రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే వారికి తగువిధంగా నాయకత్వ శిక్షణ లభించడం లేదు. తమిళనాడులోని 144 గ్రామాలో జరిపిన ఒక అధ్యయనంలో పంచాయతీలకు ఎన్నికైన మహిళల కన్నా మగవారికి తమ విధులుపట్ల ఎక్కువ అవగాహన ఉంటున్నది. గ్రామీణ ఉపాధి పథకం వంటి ప్రాముఖ్యత కలిగిన పథకాల అమలుపట్ల మహిళలు సర్పంచ్‌లుగా ఉన్నచోట్ల తగు ఉత్సాహం చూపడం లేదని ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని శివారు గ్రామాలలో జరిపిన పరిశీలన వెల్లడి చేసింది.

**స్థానిక సంస్థలకు ఎన్నికయ్యే మహిళా ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకంగా పరిపాలన వ్యవహారాలలో, రాజకీయ వ్యవహారాలలో శిక్షణ సదుపాయాలు కల్పించడం నేడు అత్యవసరం. అందుకోసం శాశ్వత ప్రాతిపదికపై ఒక శిక్షణ సంస్థను కూడా ఏర్పరచాలి.**

పలుచోట్ల మహిళలు ఎన్నికైనా వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చి, అసలు అధికారాన్ని వారి భర్తలో, కుమారులో చెలాయిస్తూ ఉండటం జరుగుతున్నది. మహిళల అధ్యక్షతన జరిగే పంచాయత్, మండల సమావేశాలలో సహితం వారు పాల్గొనే వారి తరపున అన్ని నిర్ణయాలను వారే తీసుకోవడం పలుచోట్ల జరుగుతున్నది. అంతమాత్రంచేత రాజకీయ నాయకత్వానికి మహిళలు సమర్థులు కారని వారిని కొట్టిపారవేయలేము. మొదట్లో కొంతకాలంవారు భర్తల చాటున, కొడుకుల చాటున వ్యవహరించినా క్రమంగా రాజకీయ మెలకువలకు గ్రహించి రాజకీయంగా రాణించే అవకాశం లేకపోలేదు.

...41వ పుట తరువాయి

భర్త గోత్రం లోనికి. అంటే ఆ క్షణంలోనే ఆమె వరుని కుటుంబంలో చేరిపోయింది. ప నిజానికి మనం దేనిని పెళ్లి అంటున్నామో (వ్యవహారంలో) అది జరిగిపోయింది. తరువాత పందిట్లో జరుగుతోంది, అలా జరిగిపోయిన దానిని, విస్తృతమైన పరిధిలో అందరికి తెలియజేయడం, వేడుకగా నిర్వహించడం. దానికి మరింత పరివ్యాప్తత ఊరేగింపులో ఉంది. మాంగల్యధారణ, సప్తపది – ఇవన్నీ దానికి మరింత ప్రమాణీకరణాన్ని మందిలో అనుసంధించడం. నిజానికి కొన్ని సందర్భాల్లో, పై కార్యక్రమానికి, అనంతరం బంధుమిత్రుల సమక్షంలో జరిగే తంతుకు మధ్య, వరుడు గతించిన సందర్భాల్లో, అతనికి ఉద్దిష్టమైన వధువు వైధవ్యాన్ని పాటించిన సంఘటనలున్నాయి. ఇది అభిలషణీయమా అనేది కాదు ఇక్కడి ప్రశ్న. గోత్ర చ్ఛేదనానికి ఎంత ప్రాముఖ్యత వుందో, మన పూర్వులు దానిని ఎలా పరిగణించారో తెలియజెప్పడం మాత్రం వరకే దీని ప్రసక్తి.

కనుక, మార్పు జరుగుతోందనే దానికి (ఇంటిపేరుకు) స్థితి లేదని, మారుతోంది గోత్రమని, తత్ఫలితంగా స్త్రీకి కుటుంబనామం స్థిరపడుతోందని తెలుస్తుంది. దంపతులు, వారి సంతతి – ఇదీ కుటుంబం. సమమైన గుర్తింపు కొరకు వివక్షింపబడడం తప్పదు. వివాహం తరువాత కూడ స్త్రీ తండ్రి ఇంటి పేరుతో కొనసాగితే – అది ఆమె ఇష్టమనిపిస్తుంది. కాని కుటుంబమనే విషయంగా, ఆ మార్పు ఆమె సోదరులకు కూడా అయిష్టం కలిగింపవచ్చు. అందులో కొన్ని న్యాయపరమైన చిక్కులుండే అవకాశం కూడా వుంది.

అన్నింటికంటే ప్రధానమైనది, స్త్రీకి తనదైన కుటుంబం అవసరమా కాదా అనేది. ఆమె కుటుంబిని. ఆమె వల్లనే కుటుంబమనే దానికి అస్థిత్వముంది. ఆమెయే గృహనీతి విద్యకు గృహము. విమలచారిత్ర శిక్షకు ఆమెయే ఆచార్య. ఆమెయే అన్వయస్థితికి మూలము. ఇదీ గృహిణి విషయమై మహాభారత ప్రతిపాదనము. తొందరపాటు, ఏమరపాటు లేక, విజ్ఞులు ఆలోచింతురుగాక! ఫలితార్థము వివాహం తరువాత స్త్రీ ఇంటి పేరు మారడం లేదు. స్థిరీకరింపబడుతోంది.


---

కీ.శే. యార్లగడ్డ బాలగంగాధరరావు – ప్రఖ్యాత తెలుగు ఆచార్యులు. పరిశోధకులు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా అనేకమంది శిష్యులకు మార్గదర్శనం చేసినవారు. రచయిత. ఈ వ్యాసంలో పేర్కొన్న అంశాలపై 'నడుస్తున్న చరిత్ర' (ఈ పత్రిక 'అమ్మనుడి' కి తొలిపేరు)లో 2001లో కొంత చర్చ జరిగింది. తర్వాత 'నామ విజ్ఞానం' పేరుతో 2002లో, 2015లో వెలువడిన పుస్తకంలో – వెలువడిన ఈ వ్యాసంలో ఆ ప్రస్తావన ఉంది. సమాజానికి ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ వ్యాసాన్ని ఇక్కడ పునర్ముద్రిస్తున్నాము.

బాలగంగాధరరావుగారికి స్మృత్యంజలి ఘటిస్తూ – సంపాదకుడు

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లిభాష

# 2017 డిసెంబరు ప్రపంచ తెలుగు మహాసభల గురించి సమగ్రంగా తెలిపే రెండు ప్రత్యేక సంచికలు




**తెలుగువాణి**
ప్రపంచ తెలుగు మహాసభల
ప్రత్యేక వార్తా సంచిక - 2018
ప్రచురణ : పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం
చిరునామా : పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం,
లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ - 500 004
ఫోన్ : 040-23230435

**జయంతి**
ప్రపంచ తెలుగు మహాసభల
విద్య, సాహిత్య, సాంస్కృతిక త్రైమాసిక పత్రిక
పుటలు :212,
సంవత్సర చందా : 500/-
ముఖ్య సంపాదకులు:
డా॥వెల్చాల కొండలరావు,
ప్రచురణ : సిస్టర్ నివేదిత
పబ్లికేషన్స్, 11-4-654/2,
రెడ్ హిల్స్, లక్డీకాపూల్,
హైదరాబాద్ - 500 004
ఫోన్ : 040-23396358




**ఐ**దు రోజులపాటు - డిసెంబరు 15 నుండి 19 వరకు జరిగిన అన్ని కార్యక్రమాలు - ప్రారంభ, ముగింపు సభలు, అన్ని సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాహితీ గోష్ఠులు - అన్నిటి వార్తా విశేషాలనూ సంగ్రహించి ప్రచురించిన 'తెలుగు వాణి' ప్రత్యేక సంచికను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించింది. 264 పుటలు గలిగి ఎప్పటికీ దాచుకోదగిన విధంగా వెలువరించిన ఈ సంచికకు ప్రధాన సంపాదకులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, గౌరవ సంపాదకులు ఆచార్య అలేఖ్య పుంజాల కాగా - సంపాదకులు : డా॥ ఎం. గీతావాణి, రింగు రామమూర్తి, బి.శ్రీనివాసగౌడ్, డా॥ఎన్. సుధాకర నాయుడు. ప్రపంచ మహాసభల గురించిన సమాచారాన్ని సమగ్రంగా ఇచ్చారు.

'జయంతి' మూడు నెలలకొకసారి వెలువడే విద్య, సాహిత్య, సాంస్కృతిక, బహు భాషాపత్రిక. ముఖ్య సంపాదకులు డా॥ వెలిచాల కొండలరావు. ప్రపంచ మహాసభల్లోని ముఖ్య ప్రసంగాలను, ఆ సందర్భంగా వెలువడిన వ్యాసాలను క్రోడీకరించి ప్రత్యేకంగా 200 పుటల్లో పొందు పరచి ఒక ప్రత్యేక సంచికను, రంగుల ఫోటోలతో, కె.సి.ఆర్ తదితర ప్రముఖుల సందేశాలతో సర్వ సమగ్రంగా వెలువరించారు. చదివి తీరవలసిన రచనలు, ప్రసంగ సారాంశాలూ ఇందులో ఉన్నాయి.

పై రెండు ప్రచురణలూ - ఆసక్తిగల ప్రతివారి స్వంత గ్రంథాలయంలోనూ, ప్రతి కళాశాలలో, పాఠశాలల్లో, ప్రజా గ్రంథాలయాల్లోనూ ఉంచాల్సినవి. ప్రచురణ కర్తలూ, ప్రభుత్వమూ - ఇందుకు చొరవతీసుకోవాలి.

---

# దీపం (స్త్రీవాద కథలు)




**దీపం** (స్త్రీ వాద కథలు)
సంకలనం :
సన్నపనేని అయ్యన్‌రావు
పుటలు : 131, వెల : రు.100/-
ప్రతులకు :
ప్రముఖ పుస్తకవిక్రయ కేంద్రాలు
ప్రచురణ : సన్నపనేని పున్నయ్య,
లక్ష్మీనరసమ్మ ట్రస్ట్, ఫ్లాట్‌నెం.301,
రిషి ఎన్‌క్లేవ్, 2/4 లక్ష్మీపురం,
గుంటూరు - 522 007
సెల్ : 94914 78884

స్త్రీ, పురుషుల మధ్య కొనసాగుతున్న అసమానతలు, మగువల మనోవ్యథలు, సంఘర్షణల గురించిన ఒక కథా సంకలనాన్ని తీసుకుని రావాలనే సన్నపనేని అయ్యన్‌రావు ఆలోచనకు కార్యరూపం ఈ పుస్తకం, ఇందులో 18 కథలున్నాయి.


వాటిలో 15 కథలు ప్రసిద్ధ రచయిత్రులు వ్రాసినవి, 3 కథలు ముగ్గురు ప్రముఖ రచయితలు వ్రాసినవి! 1948 వ సం॥ నుండి 2017 సం॥ వరకు, అంటే దాదాపు ఏడు దశాబ్దాల కాలంలో వివిధ పత్రికలలో ప్రచురింపబడిన ఈ కథలు విశేషంగా పాఠకులను ఆకట్టుకున్నవే!

స్త్రీలో చైతన్యం కలిగి, స్త్రీలు సమస్యల నుండి విముక్తులు కావాలి అని తెలియచేసేవి స్త్రీ వాద కథలు. స్త్రీ వాద మూలాలను తెలియచేస్తూ కొ.కు. వ్రాసిన 'పిన్ని' కథలో ఆర్థిక వ్యవస్థ స్త్రీలకు అధికారం యిస్తే కుటుంబంలో విలువలుంటాయనే వ్యక్తిగత చైతన్యం కనిపిస్తుంది. భార్య అంటే రాక్షస కామం తీర్చుకునే కీలుబొమ్మ అని భావించే భర్త యొక్క లైంగిక దోపిడీ నుండి విముక్తురాలై, తన లైంగిక హక్కును కాపాడుకోటమే జీవితపు వెలుగుగా భావించిన 'కమల' పి. సత్యవతి వ్రాసిన 'మాఘ సూర్యకాంతి' లో కనబడుతుంది. డా॥ ఆరేటి కృష్ణ వ్రాసిన 'సుధీర' కథలో ఆమెని ప్రేమించి పెళ్లి చేసుకున్న శివరాం యొక్క యిష్టా యిష్టాలకు అనుగుణంగా మారిపోయి తన ఉనికినే మరచి పోయింది. కాని అతడు స్వార్థంతో ఆమెను ఉద్యోగం చేయమన్నపుడు, స్వేచ్ఛనుపయోగించుకుని

## గ్రంథాలయం




రచన: తురగా జయ శ్యామల
ప్రతులకు: జయశ్యామల తురగా,
706, ఆరాధన 'బి' వింగ్,
జి.డి. అంబేద్కర్ రోడ్, దాదర్,
ముంబయి-400 014;
సెల్ :9821003133



**మనసుపిలిచింది:** (రెండు నవలలు)
పుటలు:142వెల:రు.150/-,

**అనుకోలేదని:** (కథలు)
పుటలు:76వెల:రు.100/-,


**పూస్తున్న పూలలో...వీస్తున్న పరిమళం**
(కవిత్వం)
రచన : సీతా సుధాకర్,
పుటలు : 106, వెల: రు.50/-,
ప్రతులకు: సీతా సుధాకర్, బి -602,
బ్లూ హిల్స్ సొసైటీ, యెరవాడ, పూనె - 411006
సెల్ : 9765390199





**ఆకాశం కోల్పోయిన పక్షి** (కవిత్వం)
రచన : కృష్ణుడు, పుటలు: 166, వెల: రు.125/-,
ప్రచురణ: ఎమెస్కో బుక్స్, 1-2-7, భానూ కాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమల్‌గూడ,
హైదరాబాద్ - 500029,
బ్రాంచ్ ఆఫీసు విజయవాడ
ఫోన్ నెం : 0866-2436643


**కవేరా** కలం - కాలం : (వ్యాసాలు),
రచన : కణుగుల వేంకటరావు
పుటలు: 206, వెల: రు.150/-
ప్రతులకు: ఎం.ఐ.జి-100, హౌసింగ్ బోర్డు కాలనీ,
జిల్లా పరిషత్ ఎదురుగా, శ్రీకాకుళం - 532001
సెల్ : 99892 65444





**పెన్న ముచ్చట్లు :** (వ్యాసాలు)
పుటలు: 240, వెల: రు.150/-
ప్రతులకు: శ్రీమతి కె.సత్యవతి
16-4-279, కస్తూరిదేవి నగర్,
నెల్లూరు-524 001. నవోదయ బుక్ హౌస్,
కాచిగూడ, హైదరాబాద్.
సెల్ : 9247564044

**మట్టి పొరల్లోంచి :** (కవిత్వం)
రచన : సోమేపల్లి వెంకట సుబ్బయ్య ;
పుటలు: 56, వెల: రు.60,
ప్రతులకు : క్రెసెంట్ పబ్లికేషన్స్, 29-25-23ఎ,
వేమూరివారి వీథి, సూర్యారావుపేట, విజయవాడ- 2
ప్రచురణ:రత్న ప్రింటింగ్ వర్క్స్, విజయవాడ -2,
సెల్ : 9030663666






**ప్రాచీన కుల సంస్కృతి-సామాజిక ప్రగతి** (వ్యాసాలు)
కులం, మతం అనే అడ్డుగోడలను నిర్మూలించి, సమాజ పురోగతికి, సమసమాజ నిర్మాణానికి, హితోధికంగా కృషి చేస్తూ హేతువాద రచనలను జనసామాన్యానికి అందించే సంకల్పంతో వెలువడిన పుస్తకం
ప్రతులకు:డి.పేరలింగం, సెల్ : 95026 54774



**ఓ మహిళా నీకు మతమెందుకమ్మా** (వ్యాసాలు)
రచన:డి.పేరలింగం, పుటలు:48, వెల : రు.20/-,
ప్రతులకు: డి.పేరలింగం, హేతువాది,
(సైన్స్ గ్రంథాలయం), ఎ.వి.అప్పారావు రోడ్,
బాలాజీ వీథి, రాజమండ్రి - 533103,
సెల్ : 95026 54774



అతని నుండి విడిపోతుంది.

పితృస్వామ్యం నిర్మించిన గోడలు, అత్త - కోడళ్లను శత్రువులుగా మారిస్తే ఆ గోడలను బద్దలు కొట్టి వారిద్దరు మిత్ర సంబంధాలతో ఉండాలనుకోవటం, పితృ స్వామ్యానికి ఒక చెంపదెబ్బ అని వోల్గా వ్రాసిన 'గోడలు' కథలో అర్థం అవుతుంది. స్త్రీకి యింటి చాకిరీ ఒక పీడనగా తయారయ్యే సరికి దాని నుండి విముక్తికై 'రిటైర్‌మెంట్' ను కోరుకోవటం ఇంద్రగంటి జానకీబాల కథలో అర్థం అవుతుంది.

మిగిలిన కథలు స్త్రీల సమస్యలను స్పృశించినా, ప్రపంచీకరణ సందర్భంలో బలహీనపడుతున్న మానవ సంబంధాలను తెలిపే కథలు.

తాను జ్వలిస్తూ, కరిగిపోతూ వెలుగుని ప్రసరింపచేసే స్త్రీ మూర్తిని దీపాకృతిలో చిత్రించిన ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య ముఖ చిత్రంతో పాటుగ, మరికొన్ని రేఖా, వర్ణ చిత్రాలు లోపలి పేజీలలో ఆకర్షణీయంగా ఉన్నాయి. అక్కడక్కడ కొన్ని కార్టూన్లు, ఛాయా చిత్రాలు కనిపిస్తాయి.

సంకలన కర్త చేసిన 'ఆలోకనము' చాల దీర్ఘంగా సాగిందని చెప్పవచ్చు. అయితే స్త్రీలు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, వారిలో చైతన్యం కలిగి సమాజంలో లింగ వివక్ష పోవాలని తపనపడే అంతరంగాన్ని అర్థం చేసుకోగలుగుతాం. ఒక స్త్రీవాద రచయిత్రి లేదా సాహితీవేత్త చేత 'ముందుమాట' వ్రాయించి ఉంటే పుస్తకానికి సమగ్రత వచ్చి ఉండేది. మొత్తం మీద విడివిడిగా పూసిన 18 పుష్పాలను ఒక చోటికి తెచ్చి ఒక సుమహారంగా తెలుగు భారతికి అందించటం అభినందనీయం!

ఎం.వి. శాస్త్రి
9441342999

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362